శుక్రవారం
20•12•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 175
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD









2

## గోరటి వెంకన్నకు కబీర్ సమ్మాన్

మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రకటన

## గణతంత్రానికి తెలంగాణ శకటం

నమూనా శకటానికి రక్షణశాఖ ఆమోదం

ఐదేండ్ల తర్వాత రాజ్‌పథ్‌లో మళ్లీ మన శకటం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర శకటం ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో ఠీవిగా నడువనున్నది. బతుకమ్మ పండుగ, మేడారం జాతర, వేయిస్తంభాల గుడితో రూపొందించిన శకటం నమూనాను కేంద్ర రక్షణశాఖ ఆమోదించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సమాచారశాఖ కమిషనర్, పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ


మిగతా 6వ పేజీలో






## కమ్మిన్స్ పాట.. 15.5 కోట్లు

కోల్‌కతా కైవసం

అత్యధిక ధర పలికిన విదేశీ ప్లేయర్‌గా రికార్డు

6.75 కోట్లకు చెన్నైకి చావ్లా

ముగిసిన ఐపీఎల్ వేలంపాట


వివరాలు ఆటలో


## పోక్సో కేసుల సత్వర విచారణ

36 ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

మహిళా కేసుల ప్రత్యేక కోర్టులకు జడ్జీలు

11 మందిని నియమించిన హైకోర్టు

దిశ, సమత ఘటనల నేపథ్యంలో ఖాళీల భర్తీ

బాధిత మహిళలకు ఇక సత్వర న్యాయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల విచారణ త్వరితగతిన పూర్తయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర హైకోర్టు గురువారం కీలక చర్యలు తీసుకున్నాయి. చిన్నపిల్లలపై లైంగిక దాడి, లైంగిక నేరాల నుంచి రక్షణకల్పించే పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్) చట్టం కింద నమోదయ్యే కేసులను సత్వరం పరిష్కరించే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా 36 ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. సుమోటోగా స్వీకరించిన ఒక కేసులో సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాల అమలుతోపాటు కేంద్ర ప్రభుత్వ సిఫారసుల మేరకు పోక్సో కేసుల విచారణకు హైకోర్టుతో సంప్రదించి, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేసినట్లు న్యాయశాఖ కార్యదర్శి ఏ సంతోష్‌రెడ్డి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఫాస్ట్ ట్రాక్ కోర్టులకుఅ దనపుజి ల్లా, సెషన్స్ క్యాడర్


మిగతా 2వ పేజీలో


# లోకాయుక్తగా జస్టిస్ రాములు

మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ జీ చంద్రయ్య

అపెక్స్ కమిటీ సిఫారసులు.. గవర్నర్ ఆమోదం

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వ సీఎస్ జోషి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ లోకాయుక్త, ఉపలోకాయుక్త, మానవ హక్కుల కమిషన్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. గురువారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నేతృత్వంలోని అపెక్స్ కమిటీ సమావేశమై లోకాయుక్త, ఉపలోకాయుక్త పేర్లను ఖరారుచేసింది. లోకాయుక్తగా జస్టిస్ చింతపంటి వెంకటరాములు, ఉప లోకాయుక్తగా రిటైర్డ్ జిల్లా జడ్జి వీ నిరంజన్‌రావు పేర్లను గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌కు సిఫారసుచేసింది. వాటిని గవర్నర్ ఆమోదిస్తూ సంబంధిత ఫైల్‌పై సంతకం చేయడంతో గురువారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఉత్తర్వులు జారీచేశారు. ఈ అపెక్స్ కమిటీ సమావేశానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ, శాసనమండలిలో విపక్షనేతలు పాషాఖాద్రి, సయ్యద్ అమీన్ ఉల్‌హుస్సేన్ జాఫ్రీ హాజరయ్యారు. శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు, ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అందుబాటులో లేకపోవడంతో ఆయన తరపున ఆ పార్టీ ఉపనేత పాషాఖాద్రి హాజరయ్యారు.

**మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ జీ చంద్రయ్య**

తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ జీ చంద్రయ్య, సభ్యులుగా ఆనందరావు, మహ్మద్ ఇర్ఫాన్ మొయినుద్దీన్‌లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. జస్టిస్ జీ చంద్రయ్య గతంలో హైకోర్టు న్యాయమూర్తిగా, ఆనందరావు జిల్లా జడ్జిగా పనిచేసి రిటైర్ అయ్యారు. మహ్మద్ ఇర్ఫాన్ మొయినుద్దీన్‌ను (నాన్ జుడిషియల్) సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన సిఫారసులను గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఆమోదించారు. దీనితో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి


మిగతా 2వ పేజీలో




జస్టిస్ సీవీ రాములు
లోకాయుక్త



జస్టిస్ జీ చంద్రయ్య
మానవహక్కుల కమిషన్ చైర్మన్



జీ నిరంజన్‌రావు
ఉప లోకాయుక్త



ఆనందరావు
మానవహక్కుల కమిషన్ సభ్యుడు

# ట్రంప్‌కు దెబ్బ

అమెరికా అధ్యక్షుడిని అభిశంసించిన ప్రతినిధుల సభ

అధికార దుర్వినియోగం, కాంగ్రెస్‌ను అడ్డుకోవడం అభియోగాలపై ఓటింగ్

రెండింటిపైనా ట్రంప్‌కు వ్యతిరేకంగా నిర్ణయం

అమెరికా చరిత్రలో అభిశంసనకు గురైన మూడో అధ్యక్షునిగా అపకీర్తి

వచ్చే నెలలో సెనెట్‌లో అభిశంసన ప్రక్రియ

రిపబ్లికన్ల మెజారిటీ దృష్ట్యా వీగిపోయే అవకాశం

ప్రజాతీర్పును వమ్ముచేసే ప్రయత్నం: ట్రంప్ మండిపాటు




అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ



**దేశ** అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన నాటినుంచి ప్రపంచ రాజకీయాలలో సంచలనంగా మారిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆ దేశ ప్రతినిధుల సభ బుధవారం అభిశంసించింది. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, కాంగ్రెస్ కార్యకలాపాలను అడ్డుకున్నారని ఆయనపై అభియోగాలు మోపింది. అమెరికా చరిత్రలో అభిశంసనకు గురైన మూడో అధ్యక్షునిగా ట్రంప్ అపకీర్తిని తెచ్చుకున్నారు. రెండు అభియోగాలపై వేర్వేరుగా జరిగిన ఓటింగ్‌లో అభిశంసనకు డెమోక్రాట్లు అనుకూలంగా, రిపబ్లికన్లు వ్యతిరేకంగా ఓటు వేశారు. దీంతో ప్రతినిధుల సభ 230:197 ఓట్ల మెజారిటీతో ట్రంప్ అభిశంసనను ఆమోదించింది. సెనెట్ కూడా మూడింట రెండు వంతుల మెజారిటీతో ఈ అభిశంసనకు ఆమోదం తెలిపితేనే ట్రంప్ పదవికి ముప్పు ఏర్పడుతుంది. రిపబ్లికన్లు మెజారిటీగా ఉన్న సెనెట్‌లో అభిశంసనపై కనీసం చర్చ కూడా జరుగకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.


వివరాలు 5వ పేజీలో


## హైకోర్టుకు 183 సూపర్ న్యూమరరీ పోస్టులు

దిగువ కోర్టులకు 267 అదనపు పోస్టులు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

2

## గ్రామాల్లోనూ షీ టీంలు

మహిళాసంఘాల ఆధ్వర్యంలో..

మహిళలపై అరాచకాలను రూపుమాపేందుకు సీఎం కేసీఆర్ ప్రణాళిక

గ్రామాల్లో జరిగే విషయాలన్నింటిపైనా రికార్డు

స్త్రీ నిధి సర్వసభ్య సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి

2



లక్నోలో ఆందోళనకారులు మీడియా వాహనాలకు నిప్పుపెట్టిన దృశ్యం

# పౌర మంటలు

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న సీఏఏ నిరసనలు

ఆందోళనలతో దద్దరిల్లిన ఢిల్లీ.. మొబైల్ సేవల నిలిపివేత, 19 మెట్రోస్టేషన్లు మూత

కర్ణాటక, యూపీ, బీహార్‌లో హింసాత్మక ఘటనలు

మంగళూరులో ఇద్దరు, లక్నోలో ఒకరు మృతి

5

పలుచోట్ల లాఠీచార్జి, టియర్‌గ్యాస్ ప్రయోగం, రాళ్లదాడి ఘటనలు

చరిత్రకారుడు రామచంద్రగుహ, యోగేంద్రయాదవ్ తదితర ప్రముఖుల అరెస్ట్








10

## అనంతగిరిలో పారాచూట్

- పాములగుట్ట వద్ద ట్రయల్ రన్
- గ్లైడింగ్‌కు అనుకూల గాలులున్నాయని గుర్తింపు

ఏనుమాముల మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు



## క్వింటాలు మిర్చి @ 18,300

వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో రికార్డు

2

గత ఏడాది గరిష్ఠ ధర రూ.14 వేలు

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 90.00 | రిటైల్ లైవ్ | 112.00 |
| డ్రెస్డ్ | 162.00 | స్కిన్‌లెస్ | 185.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 425.00 | రంగారెడ్డి | 425.00 |
| మెదక్ | 425.00 | కరీంనగర్ | 428.00 |
| వరంగల్ | 428.00 | డజన్ ధర | 66.00 |



రామ్‌నాథ్ కోవింద్ రాక నేపథ్యంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్
గురువారం అధికారులతో కలిసి బొల్లారంలోని రాష్ట్రపతిభవన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

# నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి కోవింద్

- ఈ నెల 28 వరకు బొల్లారంలో శీతాకాల విడిది
- ఏర్పాట్లను పరిశీలించిన గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుక్రవారం హైదరాబాద్ వస్తున్నారు. ఈ నెల 28 వరకు బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌లో బసచేయనున్నారు. 22న తెలంగాణ రాష్ట్ర శాఖకు చెందిన రెడ్‌క్రాస్ సొసైటీ మొబైల్ యాప్‌ను ఆయన ఆవిష్కరిస్తారు. పాండిచ్చేరి యూనివర్సిటీ స్నాతకోత్సవం నేపథ్యంలో ఈ నెల 23న పుదుచ్చేరికి వెళ్లనున్నారు. అక్కడినుంచి 25న కన్యాకుమారికి వెళ్లి వివేకానంద రాక్ మెమోరియల్‌ను సందర్శిస్తారు. ఈ నెల 27న బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ప్రభుత్వ ప్రతినిధులు, మంత్రులు, అధికారులు, అకడమిక్స్ తదితరులతో ఆయన సమావేశం కానున్నట్టు రాష్ట్రపతి మీడియా కార్యదర్శి అజయ్ కుమార్‌సింగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రామ్‌నాథ్ కోవింద్ రాక నేపథ్యంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ గురువారం అధికారులతో కలిసి బొల్లారంలోని రాష్ట్రపతిభవన్‌లో ఏర్పాట్లను పరిశీలించారు.

# గోరటి వెంకన్నకు కబీర్ సమ్మాన్

మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రకటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రముఖ కవి, గాయకుడు గోరటి వెంకన్నకు కబీర్ సమ్మాన్ అవార్డు దక్కింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం వివిధ భాషలకు చెందిన సాహితీవేత్తలకు ఏటా ఈ పురస్కారాన్ని ఇచ్చి గౌరవిస్తుంది. ఇందులో భాగంగానే ఈ ఏడాదికి గోరటి వెంకన్నను అవార్డుకు ఎంపికచేసింది. వాగ్గేయకారుడుగా తెలంగాణలో విశేష ప్రజాదరణ పొందిన గోరటి వెంకన్నకు 'పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల' అనే పాట ద్వారా మరింత గుర్తింపు దక్కింది. తెలంగాణ జానపదాన్ని తన పాటల ద్వారా ఆయన విశ్వవ్యాప్తంచేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా గౌరారానికి చెందిన గోరటి వెంకన్న.. ఎక్కువ భాగం రైతుల జీవితాలను, తెలంగాణ పల్లె ప్రజల జీవన విధానాన్ని వివరించే పాటలను రాసి, స్వయంగా పాడారు. రచయితగా, గాయకుడిగా పలు పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. 2006లో ఉమ్మడి ఏపీలో కళారత్న పురస్కారం, 2016లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాళోజీ నారాయణరావు సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీరాములయ్య, కుబుసం, వేగుచుక్కలు, మహాయజ్ఞం, మైసమ్మ ఐపీఎస్, బతుకమ్మ, నగరం నిద్రపోతున్న వేళ వంటి పలు తెలుగు సినిమాలకు ఆయన రాసిన పాటలు పల్లె సంస్కృతి, జీవనస్థితులకు అద్దంపట్టాయి.



# హైకోర్టుకు 183 సూపర్ న్యూమరరీ పోస్టులు

దిగువ కోర్టులకు 267 అదనపు పోస్టులు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు 183 సూపర్ న్యూమరరీ పోస్టులను, దిగువ కోర్టులకు 267 అదనపు పోస్టులను మంజూరుచేసింది. ఈ పోస్టులన్నీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఆధ్వర్యంలో ఉంటాయి. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు.

**హైకోర్టుకు**

| పోస్టు పేరు | పోస్టుల సంఖ్య |
|---|---|
| జాయింట్ రిజిస్ట్రార్ | 1 |
| డిప్యూటీ రిజిస్ట్రార్ | 3 |
| అసిస్టెంట్ రిజిస్ట్రార్ | 10 |
| సెక్షన్ ఆఫీసర్/ కోర్టు ఆఫీసర్/ స్క్రూట్నీ ఆఫీసర్/అకౌంట్స్ ఆఫీసర్ | 50 |
| కోర్టు మాస్టర్ | 11 |
| డిప్యూటీ సెక్షన్ ఆఫీసర్ | 12 |
| అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ | 24 |
| ఎగ్జామినర్ | 3 |
| డ్రైవర్ | 30 |
| రికార్డ్ అసిస్టెంట్ | 39 |
| **మొత్తం** | **183** |

**దిగువ కోర్టులకు**

| పోస్టు పేరు | పోస్టుల సంఖ్య |
|---|---|
| పబ్లిక్ ప్రాసిక్యూటర్స్/ జేడీవోపీ | 4 |
| అడిషనల్‌ప బ్లిక్ ప్రాసిక్యూటర్స్‌గ్రేడ్ -1 | 116 |
| అడిషనల్‌ప బ్లిక్ ప్రాసిక్యూటర్స్‌గ్రేడ్ -2 | 39 |
| అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ | 101 |
| అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (లీగల్) | 1 (డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ హెడ్డాఫీస్) |
| అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ (జనరల్) | 1 ,, ,, |
| సూపరింటెండెంట్ | 2 ,, ,, |
| సీనియర్‌అ సిస్టెంట్ | 3 ,, ,, |
| **మొత్తం** | **267** |

# గ్రామాల్లోనూ షీ టీంలు

- మహిళలపై అరాచకాలను రూపుమాపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణాళిక
- మహిళాసంఘాల ఆధ్వర్యంలో షీ టీంల నిర్వహణ
- ఆర్థికంగా గ్రామీణప్రాంత మహిళలు బలోపేతంకావాలి
- స్త్రీ నిధి సర్వసభ్య సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి



రుణాల చెక్కును మహిళాసంఘాలకు అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహిళలపై జరిగే అరాచకాలను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు సీఎం కేసీఆర్ ప్రణాళిక సిద్ధంచేస్తున్నారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. ప్రతి గ్రామంలో షీ టీంలను ఏర్పాటుచేయాలని భావిస్తున్నారని తెలిపారు. గురువారం రాజేంద్రనగర్‌లోని ఎన్‌ఐఆర్డీలో నిర్వహించిన స్త్రీనిధి ఎనిమిదో వార్షిక సర్వసభ్య సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. మహిళల జోలికి రావడానికి భయపడాల్సిన పరిస్థితులు త్వరలోనే వస్తాయన్నారు. మహిళలపై అరాచకాలను నిరోధించాలని సీఎం కేసీఆర్ ప్రణాళిక రూపొందిస్తున్నారని, దీనికోసం తనతోపాటు హోంమంత్రి మహమూద్ అలీ, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌తో కలిపి కమిటీ వేశారని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులతోనే టీంలు ఉంటాయని, వారి ఆధ్వర్యంలోనే పనిచేస్తాయని చెప్పారు. చెడుతిరుగుళ్లు తిరిగే, తాగుబోతులు, మహిళలపై అరాచకాలకు పాల్పడేవారిని మహిళాసంఘాలు గుర్తించి, పోలీసులకు రిపోర్టుచేసేలా పూర్తి స్వేచ్ఛ కల్పిస్తామని తెలిపారు. ఎలాంటి చిన్న అఘాయిత్యం జరిగినా మహిళాసంఘాలే చర్యలు తీసుకునేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.

## మహిళలతోనే గ్రామీణాభివృద్ధి

మహిళలతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామీణ వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన బాధ్యత మహిళలపైనే ఉన్నదని మంత్రి ఎర్రబెల్లి అన్నారు. సీఎం కేసీఆర్ గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతానికి ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పి, వాటిని సంఘాలకు అప్పగిస్తున్నారని చెప్పారు. 30 రోజుల ప్రగతి ప్రణాళికలో మంచి భాగస్వామ్యం అందించారంటూ మహిళలను అభినందించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే మహిళలకు గౌరవం దక్కుతున్నదని చెప్పారు. స్త్రీనిధి ఎనిమిదేండ్లుగా ఒక మంచి ఆశయంకోసం పనిచేస్తున్నదని అన్నారు. స్త్రీనిధి సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నదని తెలిపారు. స్త్రీనిధి, సెర్ప్, మెప్మాలు నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని చెప్పారు. మహిళాసంఘాలు బ్యాంకర్లు పరస్పర స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా రూ.32 కోట్ల రుణాల చెక్కులను మహిళా సంఘాలకు మంత్రి అందించారు. స్త్రీనిధి సంస్థ ద్వారా విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులను పంపిణీచేశారు. స్త్రీనిధిలో మంచి పనితీరు కనబర్చినవారికి అవార్డులు ప్రదానంచేశారు. స్త్రీనిధిలో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డి, అధ్యక్షురాలు శ్రీలత పాల్గొన్నారు.

## మహిళల రక్షణలో మరింత వేగం: ఐజీ స్వాతిలక్రా

ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకొని మహిళల రక్షణకు షీటీంల పనితీరును మరింత బలోపేతం చేయనున్నట్టు మహిళా రక్షణ విభాగం ఐజీ స్వాతిలక్రా తెలిపారు. అన్ని జిల్లాల్లోని షీటీమ్స్‌కు ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వడం, ఫిర్యాదులపై పరిమిత సమయంలో చర్యలు తీసుకునే విషయాన్ని పర్యవేక్షించేందుకు రాష్ట్రస్థాయి నోడల్ షీటీంను ప్రత్యేకంగా ఏర్పాటుచేసినట్టు చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో ప్రత్యేక షీటీం విభాగాన్ని ఎస్పీ సుమతి, అదనపు డీసీపీ కవితలతో కలిసి ప్రారంభించారు.

# లోకాయుక్తగా జస్టిస్ రాములు

మొదటిపేజీ తరువాయి...

గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

## అనుభవశాలి జస్టిస్ సీవీ రాములు

జస్టిస్ సీవీ రాములు నిజామాబాద్ జిల్లా బోధన్ సమీపంలోని అచ్చనపల్లిలో 1949లో జన్మించారు. హైస్కూల్ విద్యను బోధన్‌లో, డిగ్రీ నిజామాబాద్ గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో పూర్తిచేశారు. ఔరంగాబాద్‌లోని మరాఠ్వాడా వర్సిటీలో ఎల్‌ఎల్‌బీ పూర్తిచేసిన ఆయన.. 1978లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. ఉమ్మడి ఏపీ హైకోర్టులో 24 ఏండ్లపాటు ప్రాక్టీస్‌చేశారు. 2002లో ఏపీ అదనపు న్యాయమూర్తిగా ఎలివేట్ అయ్యారు. 2004లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులై 2011లో రిటైర్ అయ్యారు.

## న్యాయకోవిదుడు జస్టిస్ జీ చంద్రయ్య

జస్టిస్ జీ చంద్రయ్య ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్‌లో 1954లో జన్మించారు. ప్రాథమిక విద్య స్వగ్రామంలో, బీఏ ఆదిలాబాద్‌లో పూర్తిచేశారు. ఉస్మానియా వర్సిటీలో ఎల్‌ఎల్‌బీ, ఎంఏ, ఎల్‌ఎల్‌ఎం పట్టాలు అందుకున్నారు. 1980లో ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదుచేసుకున్నారు. అనంతరం ఆయన పలు శాఖలకు ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. 2005 మేలో ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియామకమయ్యారు. 2016లో ఆయన రిటైర్ అయ్యారు.

# యాసంగి ఎరువులు సిద్ధం

**ముహూర్తం**

సూర్యోదయం: 6.44 గంటలకు

సూర్యాస్తమయం: 5.38 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, కృష్ణపక్షం నవమి రాత్రి 7.17 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: హస్త రాత్రి 9.08 వరకు, తదుపరి చిత్త, అమృతఘడియలు: మధ్యాహ్నం 3.31 నుంచి సాయంత్రం 5.00 వరకు, రాహుకాలం: ఉదయం 10.49 నుంచి మధ్యాహ్నం 12.11 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.54 నుంచి 9.38 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.32 నుంచి 1.16 వరకు, వర్జ్యం: ఉదయం 6.29 నుంచి 7.59 వరకు, తిరిగి శనివారం తె.జా. 4.43 నుంచి ఉదయం 6.13 వరకు.

- పంపిణీకి సిద్ధంగా 15.40 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటికే అన్ని జిల్లాలకు తరలింపు
- మార్క్‌ఫెడ్ వద్ద 1.52 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అత్యవసరనిల్వ
- ఎరువుల పంపిణీకి మరికొన్ని స్టాక్‌పాయింట్ల ఏర్పాటు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యాసంగి సీజన్‌కు అవసరమైన అన్నిరకాల ఎరువులను అధికారులు సిద్ధంగా ఉంచారు. మొత్తం 15.40 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంచేశారు. వీటిని ఇప్పటికే అన్ని జిల్లాలకు పంపిణీచేశారు. ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణస్థాయికి మించి వర్షపాతం నమోదయింది. ఇప్పటికీ ప్రాజెక్టుల్లో నీటినిల్వలు భారీగానే ఉండటంతోపాటు, భూగర్భజలాలు కూడా గణనీయంగా పెరిగాయి. దీనికితోడు కాళేశ్వరం తదితర నూతన ప్రాజెక్టులు అందుబాటులోకి రావడంతో ఈ యాసంగిలో పంటలసాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నదని వ్యవసాయశాఖ భావిస్తున్నది. ఈ సీజన్‌లో 31.95 లక్షల ఎకరాల్లో సాధారణ సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నది. రాష్ట్రంలో రైతులు యాసంగిలో సాధారణంగా మెట్టపంటలు సాగుచేస్తుంటారు. కానీ, ప్రస్తుతం సాగునీటి వసతులు పుష్కలంగా పెరిగిన నేపథ్యంలో వరి సాగు చేపట్టేందుకే సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితులను ముందే అంచనావేసిన వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, అధికారులు రాష్ట్రానికి అదనపు యూరియా కేటాయించాలంటూ కేంద్ర వ్యవసాయశాఖకు విజ్ఞప్తిచేశారు. రాష్ట్రప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రప్రభుత్వం.. 2019-20 యాసంగి సీజన్‌కు 15.40 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను కేటాయించింది. ఇందులో 8 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా.. 7.40 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ, పొటాష్, ఇతర రకాల ఎరువులు ఉన్నాయి.

## అక్టోబర్ నుంచే జిల్లాలకు ఎరువులు

**యాసంగిలో** సాగు విస్తీర్ణాన్ని ముందుగానే అంచనా వేసిన ప్రభుత్వం సీజన్ ప్రారంభానికి ముందే అక్టోబర్ రెండోవారం నుంచే క్షేత్రస్థాయిలో ఎరువుల నిల్వలు ఉంచేందుకు చర్యలు చేపట్టింది. 5 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను అక్టోబర్ చివరి నాటికే అధికారులు జిల్లాలకు సరఫరా చేశారు. డిసెంబర్ మొదటివారం నుంచి యాసంగి సాగు పనులు ప్రారంభంకావడంతో మరో 4.50 లక్షల మెట్రిక్ టన్నులు ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రాలు (పీఏసీఎస్), మార్కెట్లు, మార్క్‌ఫెడ్ కేంద్రాలకు తరలించి అందుబాటులో ఉంచారు. వీటితోపాటు మార్క్‌ఫెడ్ వద్ద 1.52 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్‌స్టాక్ యూరియా నిల్వలను అత్యవసర అవసరాల కింద సిద్ధంగా ఉంచినట్టు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. వానకాలం సీజన్‌లో కొన్నిచోట్ల ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న వ్యవసాయశాఖ.. యాసంగిలో అలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు అధికారులు వెల్లడించారు. గత సీజన్‌లో ఏర్పాటుచేసిన స్టాక్‌కేంద్రాలతోపాటు యాసంగి సీజన్‌కు మేడ్చల్, జనగామ, సిరిసిల్ల, వికారాబాద్ జిల్లా తాండూరు, సూర్యాపేట జిల్లా కోదాడలో అదనంగా నిల్వకేంద్రాలను ఏర్పాటుచేసినట్టు మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు.

# పోక్సో సత్వర విచారణ

మొదటిపేజీ తరువాయి...

జడ్జీలు నేతృత్వం వహిస్తారు. ఏడాదిపాటు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు కొనసాగనున్నాయి. వీటి ఏర్పాటుకు సంబంధించిన నిధులను న్యాయ పరిపాలన పద్దు నుంచి కేటాయించనున్నారు.

## మహిళా కేసుల ప్రత్యేక కోర్టులకు జడ్జీల నియామకం

రాష్ట్రంలో దిశ, సమత వంటి దారుణ ఘటనల నేపథ్యంలో హైకోర్టు స్పందించింది. మహిళలపై జరిగే లైంగికదాడి, హత్యలు, ఇతర నేరాల్లో సత్వర న్యాయం అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా ఇప్పటివరకు ఉన్న ఖాళీలను భర్తీచేయాలని నిర్ణయించింది. ఈ మేరకు విమెన్ అట్రాసిటీ ప్రత్యేక న్యాయస్థానాలకు జడ్జీలను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. వివిధ కోర్టుల నుంచి పదకొండుమంది న్యాయమూర్తులను మహిళల కేసుల ప్రత్యేక కోర్టులకు బదిలీచేసింది. వివిధ కోర్టులకు నియమితులైనవారి వివరాలు.. బీ శ్రీనివాసరావు (హైదరాబాద్), కే మారుతీదేవి (రంగారెడ్డి), వై జయప్రసాద్ (ఆదిలాబాద్), పీ ముక్తిదా (వరంగల్), పీ అన్నెరోస్ క్రిస్టియన్ (మహబూబ్‌నగర్), వీ శారదాదేవి (నల్లగొండ), కే అరుణకుమారి (ఖమ్మం), జే మైత్రేయి (కూకట్‌పల్లి), డీ మాధవి కృష్ణ (కరీంనగర్), ఎం శ్యాంశ్రీ (మెదక్), టీ నర్సిరెడ్డి (నిజామాబాద్). ప్రత్యేక కోర్టులకు జడ్జీలుగా నియమితులైనవారు ఈ నెల 28నాటికి విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో హైకోర్టు తెలిపింది. మహిళా కేసుల ప్రత్యేక కోర్టులకు న్యాయమూర్తుల నియామకంతో పెండింగ్‌లో ఉన్న కేసులలో బాధితులకు సత్వర న్యాయం అందనున్నది.

## దిశ, సమత ఘటనలతో ఆగ్రహావేశాలు

రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న దిశ, సమత ఘటనలతో ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. లైంగికదాడులు, హత్యాచారం కేసులలో సత్వర శిక్షలు అమలుచేస్తేనే ప్రజల్లో విశ్వాసం ఏర్పడుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పలుచర్యలు చేపట్టింది. దిశ కేసును వేగంగా విచారించేందుకు మహబూబ్‌నగర్‌లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టును సైతం ఏర్పాటుచేసింది. దర్యాప్తుక్రమంలో నిందితులు పోలీసులపై దాడిచేయడంతో ఆత్మరక్షణకోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో వారు చనిపోయారు. ఆసిఫాబాద్ సమత ఘటనలో బాధితులకు సత్వరన్యాయం అందించేందుకు ప్రభుత్వం ఆదిలాబాద్‌లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటుచేసింది. ఈ కేసులో పారిపోతున్న నిందితులను పోలీసులు చాకచక్యంగా అరెస్ట్‌చేశారు. వీరిపై విచారణ కొనసాగుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా విమెన్ అట్రాసిటీ కేసులలో కూడా వేగంగా విచారణ జరిపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది.

# ఎర్ర బంగారం @ 18,300!

- భారీ ధర పలికిన తేజ రకం మిర్చి
- ఏనుమాముల మార్కెట్‌లో రికార్డు
- గత ఏడాది గరిష్ఠ ధర రూ. 14 వేలు

**కాశీబుగ్గ:** వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం రికార్డుస్థాయిలో మిర్చి ధర పలికింది. గురువారం మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరుకు చెందిన గిరిజన రైతు గుగులోత్ వాలు ఏడు తేజరకం మిర్చిని మార్కెట్‌కు తీసుకొచ్చారు. శ్రీనివాస్ ఎంటర్‌ప్రైజెస్ అడ్తి వ్యాపారి ద్వారా నందిని ఎంటర్‌ప్రైజెస్ ఖరీదు వ్యాపారి క్వింటాల్‌కు రూ.18,300 ధరతో కొనుగోలుచేశారు. రికార్డుస్థాయిలో ధర పలుకడంపై రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో తేజ రకం క్వింటాల్ రూ.17 వేల వరకు పలుకుతున్నదని మార్కెట్ అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు మార్కెట్‌కు తేజ రకం మిర్చి 5,896 క్వింటాళ్లు వచ్చిందని, గురువారం 372 క్వింటాళ్లు వచ్చిందని చెప్పారు. ధరలు గరిష్ఠంగా రూ.18,300, మధ్య రకానికి రూ.15,500, కనిష్ఠంగా రూ.13,500 పలికాయి. సీజన్‌లో తాలు రకం మిర్చి 247 క్వింటాళ్ల వచ్చింది. తాలు రకం మిర్చి గరిష్ఠంగా రూ.ఐదు వేలు, మధ్య రకానికి రూ.నాలుగు వేలు, కనిష్ఠంగా రూ.2,500 పలికాయి. గత ఏడాది తేజ రకం మిర్చి గరిష్ఠంగా రూ.14 వేలు పలికింది.

# విప్ గొంగిడి సునీతకు తప్పిన ప్రమాదం

- ఆలేరులోని అతిథిగృహంలో ఊడిపడిన పెచ్చులు
- స్వల్ప గాయాలతో బయటపడిన విప్



చూపుడు వేలుకు పట్టీతో విప్ సునీత

**ఆలేరు టౌన్:** ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డికి తృటిలో ప్రమాదం తప్పింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ కానుకల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విప్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. అకస్మాత్తుగా భవనం పైకప్పు పెచ్చులూడి ఎదుట ఉన్న టీపాయ్‌పై పడింది. ఈ ఘటనలో విప్ సునీత కుడి చేతి చూపుడు వేలు, మోకాలుకు, కుడి కాలుకు గాయాలయ్యాయి. గొలనుకొండ సర్పంచ్ బైరపాక లక్ష్మి తీవ్రంగా గాయపడగా, మార్కెట్ కమిటీ మాజీ సభ్యురాలు మోరిగాడి ఇందిరకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక ఏరియా దవాఖానలో ఎమ్మెల్యే సునీతకు వైద్యులు చికిత్స అందించారు. సర్పంచ్ లక్ష్మి తలకు 18 కుట్లు వేశారు. విప్‌ను జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పరామర్శించారు.

## లోకం పోకడ




గుర్తు పట్టకుండా ముఖానికి పసుపు రాసుకొని తిరుగుతున్నాడు

# ఎరుపు రంగులో కార్గో బస్సులు

- ఆర్టీసీలో జనవరి 1 నుంచి సేవలు
- నష్టాల నుంచి గట్టెక్కించడంపై దృష్టి
- 24న గ్రేటర్ హైదరాబాద్ రీజియన్ ఉద్యోగులతో వనభోజనాలు
- ఉద్యోగుల భద్రతపై త్వరలో నివేదిక
- ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎర్రబస్సుగా ప్రజలకు సుపరిచితమైన ఆర్టీసీ బస్సులు సరుకు రవాణా (కార్గో) వాహనాలుగా రోడ్డెక్కనున్నాయి. ప్రస్తుతం సౌకర్యాన్ని బట్టి ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్‌లగ్జరీ, గరుడ బస్సులు వివిధ రంగులు డిజైన్లలో ఉన్నాయి. కానీ, ఒకప్పుడు అన్ని ఆర్టీసీ బస్సులు ఎరుపు రంగులోనే ఉండేవి. కొత్తగా కార్గో సేవలు ప్రారంభిస్తున్న నేపథ్యంలో సుపరిచితమైన ఎర్ర బస్సులనే కార్గోకు వినియోగించాలని ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. ఆర్టీసీని నష్టాల నుంచి గట్టెక్కించేందుకు వస్తురవాణాపైనా దృష్టి సారించాలని సీఎం కేసీఆర్ జనహితలో కార్మికులతో నిర్వహించిన ఆత్మీయసమ్మేళనంలో సూచించారు. ఈ నేపథ్యంలో జనవరి 1 నుంచి కార్గో సేవలు ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. సరుకు రవాణా బస్సులను ఎరుపురంగులో తీర్చిదిద్దడంతోపాటు సిబ్బందికి ప్రత్యేక డ్రెస్‌కోడ్ రూపకల్పన చేయనున్నారు. గురువారం ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ, ఈడీలతో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థలో ప్రవేశపెట్టబోతున్న కార్గో సర్వీసు బస్సులు ఎరుపురంగులో ఉండాలని నిర్ణయించారు. ఈ నెల 23 వరకు కార్గో బస్సులు తయారవుతాయని అధికారులు మంత్రికి వివరించారు. గత సమావేశంలో సీఎం కేసీఆర్ ప్రకటించిన నిర్ణయాలు ఏ మేరకు కార్యాచరణలోకి వస్తున్నాయో సంస్థ ఉన్నతాధికారులను మంత్రి అజయ్ అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులతో స్థానిక సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఆశించిన ఆదాయం సమకూర్చుకొనేందుకు తొలి ప్రాధాన్యంగా ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) పెంపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగభద్రతకు సంబంధించిన విధివిధానాల నివేదికను రూపొందిస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల్లో సుహృద్భావ వాతావరణాన్ని పెంపొందించేందుకు వనభోజనాల కార్యక్రమాన్ని గ్రేటర్ హైదరాబాద్ రీజియన్‌లో ఈ నెల 24న నిర్వహిస్తామని మంత్రి అజయ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఈడీలు పురుషోత్తం, యాదగిరి, టీవీ రావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాక్సిన్ ఆన్ వీల్స్

- అందుబాటులోకి తెచ్చిన ఐఐటియన్లు
- పుణె గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ప్రారంభం

**సంగారెడ్డి చౌరస్తా:** దేశంలోనే మొదటిసారిగా వ్యాక్సిన్ ఆన్ వీల్స్ సౌకర్యాన్ని స్థానిక ఐఐటియన్లు అందుబాటులోకి తెచ్చారు. పుణెలోని గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఐఐటీ హైదరాబాద్ సీఎఫ్‌హెచ్‌ఈ పరిశోధకులు ఈ సదుపాయాన్ని ప్రారంభించారు. చిన్నారులకు నిర్దిష్ట కాలవ్యవధిలో వ్యాక్సిన్లు వేయించాల్సి ఉంటుంది. సాధారణంగా దవాఖానలకు తీసుకెళ్లి వేయిస్తుంటారు. కానీ.. చిన్నారులు ఉన్న ఇండ్లకు వెళ్లి ఉచితంగా వ్యాక్సిన్లు వేసేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని స్థానిక ఐఐటియన్లు ప్రారంభించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- హైద్రాబాద్‌లోని సెంటర్ ఫర్ హెల్త్‌కేర్ ఎంటర్‌ప్రెన్యూషిప్ (సీఎఫ్‌హెచ్‌ఈ) పరిశోధకుడు జిగ్నేశ్‌పటేల్.. దేశంలోనే మొదటిసారిగా పుణెలోని పీసీఎంసీ ప్రాంతంలో ఈ నెల 15న వ్యాక్సిన్ ఆన్ వీల్స్ క్లినిక్‌ను ప్రారంభించారు. బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ప్రభుత్వానికి, సమాజానికి మద్దతుగా ఈ మిషన్ పనిచేస్తుందని జిగ్నేశ్‌పటేల్ చెప్పారు.





గురువారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో భాగవత సప్తాహంలో పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్ సతీమణి శోభ, కూతురు, మాజీ ఎంపీ కవిత, కోడలు శైలిమ తదితరులు



భాగవత సప్తాహంలో ప్రవచనాలు ఇస్తున్న చాగంటి కోటేశ్వరరావు

## బతుకడానికి డబ్బే ప్రధానం కాదు

- పసిపిల్లల నవ్వులో పరమాత్మను దర్శించాలి
- భాగవత సప్తాహంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు
- హాజరైన సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు

**కవాడిగూడ:** మనిషి సంతోషంగా బతుకడానికి కేవలం డబ్బే ప్రధానం కాదు.. అనేక అంశాలు ఉన్నాయని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు చెప్పారు. సంతోషంగా బతుకడానికి చిన్నపిల్లాడి నవ్వు చాలని చెప్పారు. పసిపిల్లలు అరమరికలు లేనివారని, వారి నవ్వులో పరమాత్ముని దర్శించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం) ప్రాంగణంలో నిర్వహిస్తున్న భాగవత సప్తాహంలో భాగంగా గురువారం ఆరోరోజు చాగంటి ప్రవచనామృతంతో శ్రోతలను ముగ్ధులను చేశారు. మకుటాయమనమైన కార్తీక దామోదర లీలలు, తృనావర్తోపాఖ్యాణం, విశ్వరూప సందర్శన ఘట్టాలను వీనులవిందుగా వివరించారు. కొన్నికోట్ల జన్మల తర్వాత వచ్చేది మనిషి జన్మఅని, ఆ జన్మను సార్థకం చేసేకొనే పనులపై దృష్టి సారించాలని చెప్పారు. భగవంతుడు కారుణ్యమూర్తి అని, మనం పాపాలుచేసినా, పుణ్యంచేసినా మళ్లీ జన్మ ప్రసాదిస్తారని పేర్కొన్నారు. పాపపుణ్యాలను అనుభవించడానికే శరీరం ఉన్నదని చెప్పారు. ఎప్పుడూ మంచి ఆలోచించాలని, మాట్లాడాలని.. ఎదుటి వారికి ఉపకారం చేయాలని కోరారు. ఎంతటి ఆపదవచ్చినా పుణ్యాత్ముడైన వ్యక్తిని పరమాత్ముడు రక్షిస్తాడని వివరించారు. మంచి పనులను చేయడానికి డబ్బు అవసరమేనని, కానీ డబ్బుకు బానిస కావొద్దని పేర్కొన్నారు. ధనవంతుల బిడ్డలమన్న గర్వం ఉండవద్దని సూచించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సతీమణి శోభ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత, మంత్రి కేటీఆర్ సతీమణి శైలిమ, ఎన్టీవీ అధినేత నరేంద్ర చౌదరి సతీమణి రమాదేవి, విజయరాజం, తెలంగాణ జాగృతి నాయకురాలు మంచాల వరలక్ష్మి, కార్పొరేటర్ ముఠాపద్మ తదితరులు పాల్గొన్నారు.



# అన్నివర్గాలకు సమన్యాయం



కోకాపేటలోక్రిస్టియన్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కొప్పుల ఈశ్వర్, సబితారెడ్డి

- స్వరాష్ట్రంలో సంపూర్ణ భద్రత: మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల
- సీఎం కేసీఆర్ పేదల మనిషి: మంత్రి సబితారెడ్డి
- కోకాపేటలో క్రిస్టియన్ భవనానికి శంకుస్థాపన
- మూడు జిల్లాల్లో శ్మశానవాటికలకు 63 ఎకరాలు కేటాయింపు

**మణికొండ, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో అన్నివర్గాలకు సమన్యాయాన్ని చేకూర్చేందుకు సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. హైదరాబాద్ శివారు కోకాపేటలో క్రిస్టియన్ భవనానికి గురువారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రాంత ప్రజలకు అభద్రత ఉండేదని, స్వరాష్ట్రంలో సం పూర్ణ భద్రతను కల్పిస్తూ అన్నివర్గాలకు సమన్యాయం చేస్తున్నామని చెప్పారు. ప్రజాసంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని అన్నిమతాలను గౌరవిస్తూ వారికి ఆత్మగౌరవ భవనాలను ప్రభుత్వమే నిర్మించడం దేశంలో ఎక్కడా లేదన్నారు. క్రిస్టియన్ల భవనానికి సీఎం కేసీఆర్ రెండెకరాల భూమితోపాటు రూ.పది కోట్లు మంజూరుచేశారని తెలిపారు. క్రిస్మస్‌కు ముందే క్రిస్టియన్ భవనానికి శంకుస్థాపన చేసుకోవడంతోసంతోషంగా ఉన్నదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.50 లక్షల మందికి ప్రభుత్వం క్రిస్మస్ కానుకలను అందజేసిందని తెలిపారు. క్రిస్మస్ రోజు ప్రత్యేక ప్రార్థనల కోసం ప్రభుత్వమే రూ.3 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో 63 ఎకరాల ప్రభుత్వ భూములను శ్మశానవాటికల ఏర్పాటుకు ప్రొసీడింగ్స్‌ను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లు హరీశ్, ఎంవీ రెడ్డి సమక్షంలో క్రిస్టియన్ మత పెద్దలకు మంత్రులు అందజేశారు. ఏడాదిలోగా భవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి కొప్పుల అన్నారు. మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. అన్ని కులాల ఆత్మగౌరవాలను కాపాడేందుకు సీఎం కేసీఆర్ విలువైన భూములను కుల సంఘ భవనాలను అందజేస్తున్నారని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ పేదల మనిషి, మనసున్న మహారాజని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు స్టీఫెన్‌సన్, రాజేశ్వర్‌రావు, మైనార్టీ వెల్ఫేర్ ప్రధానకార్యదర్శి అజయ్ మిశ్రా, ప్రిన్సిపల్ సెక్రటరీ అర్వింద్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, పోలీస్‌హౌసింగ్, మైనార్టీ కార్పొరేషన్ల చైర్మన్లు దామోదర్‌గుప్తా, సయ్యద్‌అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏడాది కాలం పూర్తిచేసుకున్న కేటీఆర్‌ను అభినందిస్తున్న మంత్రులు కొప్పుల ఈశ్వర్, పువ్వాడ అజయ్, ఎర్రబెల్లి, గంగుల, ఎమ్మెల్యేలు బాల్కసుమన్, సండ్ర వెంకటవీరయ్య, హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, నవీన్‌రావు, కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి

# మంత్రి కేటీఆర్‌కు అభినందనలు

- టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏడాది పూర్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏడాది పూర్తిచేసుకున్న మంత్రి కే తారకరామారావును పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు అభినందించారు. గురువారం ప్రగతిభవన్‌లో కేటీఆర్‌ను కలిసినవారు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీని ఏడాది కాలంలో విజయవంతంగా నడిపించి నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారని ప్రశంసించారు. తక్కువ సమయంలో పార్టీకి 60 లక్షల సభ్యత్వాలు చేయించడంలో కేటీఆర్ ఎంతో కృషిచేశారని ప్రశంసించారు. జిల్లా పార్టీ కార్యాలయాల నిర్మాణం, కమిటీల ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని విజయపథాన నడిపించడంలో తనదైన ముద్ర వేశారన్నారు. కేటీఆర్ నాయకత్వంలో పార్టీ మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. కేటీఆర్‌ను అభినందించినవారిలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పువ్వాడ అజయ్, గంగుల కమలాకర్, ప్రభుత్వవిప్‌లు బాల్కసుమన్, కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యేలు మల్లయ్యయాదవ్, హర్షవర్ధన్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

# లిస్బన్ పబ్‌లో అశ్లీల నృత్యాలు

- పంజాగుట్ట, టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి
- 21 మంది యువతులతోపాటు పలువురి అరెస్టు

**ఖైరతాబాద్:** హైదరాబాద్ కుందన్‌బాగ్‌లోని కంట్రీక్లబ్ ఆవరణలో ఉన్న లిస్బన్ పబ్‌లో నడుస్తున్న గలీజు దందా గుట్టును పోలీసులు రట్టుచేశారు. అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయన్న పక్కా సమాచారంతో బుధవారం అర్ధరాత్రి పంజాగుట్ట, వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్ పోలీసులు పబ్‌పై ఆకస్మిక దాడిచేశారు. అర్ధనగ్నంగా అశ్లీల నృత్యాలు చేస్తున్న 21 మంది యువతులు, మద్యం మత్తులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఏడుగురు యువకులతోపాటు పబ్ మేనేజర్ భరద్వాజ్, క్యాషియర్ శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు. వారి వద్దనుంచి సెల్‌ఫోన్లు, రూ. 1,47,480 నగదును స్వాధీనం చేసుకున్నారు. పబ్‌లోని సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు నిర్ధారించుకున్నారు.

**యువకులతో మద్యం తాగిస్తే నజరానాలు**

లిస్బన్ పబ్‌లో యువకులను ఆకట్టుకొనేలా అశ్లీల నృత్యాలు చేసేందుకు యాజమాన్యం.. యువతులను నియమించుకున్నట్టు సమాచారం. పబ్‌లోని ప్రత్యేక గదుల్లో వ్యభిచారం దందా సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. యువకులతో మద్యం తాగిస్తే అక్కడ పనిచేసే యువతులకు నజరానాలు ఇస్తున్నట్టు తెలిసింది. ఈ పబ్‌లో గత జూన్‌లోనే ఓ డ్యాన్సర్‌పై దాడి చేసిన ఘటన చోటుచేసుకోగా, అప్పట్లోనే అసాంఘిక కార్యకాలపాలపై కూడా పబ్ యాజమాన్యాన్ని పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు.



పబ్ నిర్వాహకుడు

# దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కమిటీలు

- జిల్లాస్థాయిలో నియామకానికి ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జిల్లాస్థాయిలో దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కమిటీల నియామకానికి అనుమతిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. కమిటీలో కలెక్టర్ ఎక్స్ అఫీషియో చైర్‌పర్సన్‌గా, ఎస్పీ వైస్‌చైర్మన్‌గా వ్యవహరిస్తారు. జెడ్పీ సీఈవో, డీఆర్డీఏ పీడీ, డీఎస్‌డబ్ల్యూవో, డీఈవో, పబ్లిక్ ప్రాసిక్యూటర్, సివిల్‌సర్జన్ లేదా డీసీహెచ్‌ఎస్, సైక్రియాటిస్ట్, లీడ్‌బ్యాంక్ మేనేజర్, మెప్మా పీడీ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, డీపీఆర్వో, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో యూసీడీపీ పీడీ, పంచాయతీరాజ్ ఎస్‌ఈ, జిల్లా ఉపాధి అధికారి, పరిశ్రమల డీఎం, జిల్లా సంక్షేమాధికారి సభ్యులుగా ఉంటారు.






పౌరసత్వ సవరణ చట్టంతో దేశంలో శాంతిభద్రతలు క్షీణించిపోతున్నాయి. దేశ ప్రజలందరూ ఈ చట్టంతో భయకంపితులవుతున్నారు. ఈ చట్టాన్ని వెనక్కితీసుకొని, యువతకు ఉద్యోగకల్పనకు కృషిచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి**

పొరుగు దేశాల నుంచి శరణార్థులుగా దేశంలోకి వచ్చిన హిందువులకు ఎక్కడ స్థిరనివాసం ఏర్పరుస్తారో కేంద్రం చెప్పాలి. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి ఓ స్పష్టమైన విధాన ప్రణాళిక ఉన్నట్లు లేదు.

**ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



**1942**

రెండో ప్రపంచయుద్ధం సమయంలో కలకత్తాపై బాంబులేసిన జపాన్.

**1971**

పాకిస్థాన్ ప్రధానిగా రాజీనామా చేసిన యాహ్యాఖాన్.





**1983**

నాలుగు వేల మంది అనుచరులతో లెబనాన్‌ను వీడిన యాసర్ అరాఫత్.

**మోతీలాల్ నెహ్రూపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసినందుకు రాజస్థాన్ పోలీసులు నటుడు పాయల్ రోహత్‌గీని అరెస్టు చేసి జైలుకు పంపడం చర్చనీయాంశమవుతున్నది. స్వాతంత్య్ర సమరయోధుడు మోతీలాల్‌ను కించపర్చటం సమర్థనీయం కాకపోయినా, భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవించాల్సిన అవసరమున్నది. వ్యక్తిగత పరువుకు నష్టం కలిగించే వ్యాఖ్యల పేరుతో అరెస్టులను సమర్థించలేం. పౌరుల భావస్వేచ్ఛను అణిచివేయరాదన్న స్ఫూర్తి ప్రధానమైనది.**

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

**తమిళనాడులోని ప్రభుత్వ దవాఖానలో ఓ గర్భిణీ బంధువులు, వైద్యుని మధ్య చోటుచేసుకున్న ఘర్షణ మరోసారి వైద్యుల రక్షణ సమస్య ముందుకు వచ్చింది. దవాఖానల్లో వైద్యులకు రక్షణలేకుండా పోతున్నదని ప్రభుత్వ వైద్యులు వాపోతున్నారు. పశ్చిమబెంగాల్‌లో దవాఖానలో ఓ వ్యక్తి చనిపోయినప్పుడు అతని బంధువులు ఇద్దరు వైద్యులపై దాడిచేశారు. దీంతో దేశవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యుల కోసం ప్రత్యేక చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వైద్యుల రక్షణకు కేంద్రం ప్రత్యేక చట్టం తేవాలని వైద్యులు కోరటం గమనార్హం.**

**ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్**



# ట్రంప్ అభిశంసన

దేశాధ్యక్షుడు ట్రంప్‌ను ప్రతినిధుల సభ అభిశంసించడం శతాబ్దాల అమెరికా చరిత్రలో అసాధారణం. వచ్చే ఏడాది జరిగే అధ్యక్ష ఎన్నికల్లో తమకు బలమైన ప్రత్యర్థిగా అవతరిస్తున్న జో బిడెన్‌ను ఉక్రెయిన్‌లో అవినీతి ఆరోపణలో ఇరికించేందుకు ఆ దేశ అధ్యక్షుడితో ఫోన్‌లో మాట్లాడిన ట్రంప్ అనూహ్యంగా దొరికిపోయాడు. ఆ తర్వాత దీనిపై దర్యాప్తు జరుపుతున్న ప్రతినిధుల సభకు సహకరించకపోగా, తన అధికారులు కూడా తోడ్పడకూడదనే ఆదేశాలు జారీచేశాడు. అందుకే ఆయనపై అధ్యక్ష పదవిలో ఉంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడటం ఒక ఆరోపణ అయితే, అభిశంసన ప్రక్రియ సాగుతున్నప్పుడు కాంగ్రెస్ దర్యాప్తునకు అడ్డుపడటం రెండవది. ఉక్రెయిన్ దేశానికి 400 మిలియన్ డాలర్ల సైనిక సహాయం అందించడానికి అమెరికా చట్టసభ ఆమోదించింది. అయితే ట్రంప్ దానిని వెంటనే విడుదల చేయకుండా ఉక్రెయిన్ అధ్యక్షుడితో బేరానికి దిగాడు. తమ ప్రత్యర్థి జో బిడెన్, ఆయన కుమారుడు హంటర్ బిడెన్‌పై దర్యాప్తు జరిపించాలని కోరాడు. ఒబామా హయాంలో ఉపాధ్యక్షుడిగా జో బిడెన్ పనిచేసినప్పుడు హంటర్ బిడెన్ ఉక్రెయిన్‌లోని ఒక కంపెనీలో కీలక పదవి నిర్వహించారు. అందువల్ల దీనిపై దర్యాప్తు సాగించి ప్రత్యర్థిని దెబ్బకొట్టాలని ట్రంప్ భావించాడనేది స్పష్టం. ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫోన్‌లో జరిపిన సంభాషణ వివరాలు బయటపడటంతో వివాదం చెలరేగింది. ప్రతినిధుల సభలో మెజారిటీ కలిగిన డెమొక్రాటిక్ పార్టీ సాక్ష్యాధారాలను సేకరించగలిగింది. ప్రతినిధుల సభ అభిశంసించడం వల్ల ట్రంప్ పదవికి ముప్పు ఏర్పడనప్పటికీ చరిత్రలో అదొక మాయని మచ్చగా నిలిచిపోతుంది.

**వైట్‌హౌజ్‌లోని ఉద్యోగిని మోనికా లెవిన్‌స్కీతో సంబంధం విషయమై అబద్ధమాడారనే ఆరోపణతో 1998లో బిల్ క్లింటన్‌ను ప్రతినిధుల సభ అభిశంసించింది. కానీ సెనేట్ తొలిగించలేదు. అభిశంసన మూలంగా ఆయన ప్రతిష్ఠ దెబ్బతినకపోగా, ప్రజామోదం పెరిగినట్టు అధ్యయనంలో వెల్లడైంది. మోనికా లెవిన్‌స్కీతో సంబంధం సంగతెట్లా ఉన్నా, దానిని సాకుగా తీసుకొని ఆయనను ప్రత్యర్థులు వెంటాడిన తీరును ప్రజలు ఆమోదించలేక పోయారు. ఇప్పుడు ట్రంప్ విధానాలు అమెరికాకే కాదు, మొత్తం భూగోళంపై మానవాళికి ముప్పు కలిగించేలా ఉన్నాయి.**

అమెరికాలో జనవేగులు ఏర్పడటమనే పోకడ కూడా గమనార్హమైనది. ప్రభుత్వంలో కానీ, ప్రైవేటు సంస్థల్లో కానీ చట్టవిరుద్ధ, సంఘ విద్రోహకర కార్యకలాపాలు సాగుతూ ఉంటే ఆ విషయం తెలిసినవారు బయటపెట్టవచ్చు. దీనిని బయటపెట్టడం వల్ల వారికి ఏదైనా హాని కలిగితే భద్రత కల్పించవలసి ఉంటుంది. అమెరికా ఎన్నికల్లో ప్రత్యర్థులను దెబ్బకొట్టడానికి ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడి తోడ్పాటు కోరడం అపరాధమే. అందువల్ల ఈ విషయం తెలిసిన ఒక గూఢచారి అమెరికా అధ్యక్ష భవనంలో ఉన్న తమ సన్నిహితుల ద్వారా ధ్రువీకరించుకొని బయటపెట్టారు. ఆ తర్వాత మరికొందరు జనవేగులు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడితో మాట్లాడటానికి ముందు వీరిరువురి మధ్య రాయబారం జరిపిన ఈయూలోని అమెరికా రాయబారి గార్డన్ సాండ్‌లాండ్ మొదట ట్రంప్‌నకు మద్దతుగా ఉన్నప్పటికీ, ఆ తర్వాత రహస్య విచారణలో వాస్తవాలు వెల్లడించినట్టు తెలుస్తున్నది. ఉక్రెయిన్‌లో అమెరికా రాయబారి కుర్ట్ వోకర్ కూడా ఇరువురు నాయకుల మధ్య వ్యవహారం నడిపారు. ఈ విషయమూ బయటకువచ్చింది. అధ్యక్షుడిని పదవీచ్యుతిడిని చేసే ప్రక్రియ రెండు దశల్లో ఉంటుంది. మొదట ప్రతినిధుల సభలో సాధారణ మెజారిటీతో అభిశంసించవచ్చు. కానీ అది నేరారోపణ వంటిది. దానిపై విచారణ దశ సెనేట్‌లో సాగుతుంది. ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో సాగే విచారణలో సెనేట్ సభ్యులంతా తీర్పరులుగా ఉంటారు. సెనేట్‌లో మూడింట రెండువంతుల మంది ట్రంప్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తేనే నెగ్గినట్టు. సెనేట్‌లోరి పబ్లికన్లకే మెజారిటీ ఉన్నందున ట్రంప్‌ను పదవీచ్యుతుడిని చేయడం కష్టం.

వచ్చే ఏడాది అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ అభిశంసన ప్రభావం ఎట్లా ఉంటుందనేది రెండు శిబిరాలూ దీనిని ఎట్లా ఉపయోగించుకుంటాయనే దాన్ని బట్టి ఉంటుంది. ఇప్పటివరకు అమెరికా అధ్యక్షులు ముగ్గురు అభిశంసనకు గురయ్యారు. 1868లో ఆంద్ర్యూ జాన్సన్‌ను ప్రతినిధుల సభ అభిశంసించింది. సెనేట్ విచారణలో మెజారిటీ సభ్యులు కూడా ఆయనకు వ్యతిరేకంగా ఓటు వేసినప్పటికీ, ఆయనను తొలిగించడానికి అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ లభించలేదు. ఒకేఒక్క ఓటుతో ఆయన బయటపడ్డారు. కానీ ఆ తర్వాత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా కూడా అవకాశం లభించలేదు. వైట్‌హౌజ్‌లోని ఉద్యోగిని మోనికా లెవిన్‌స్కీతో సంబంధం విషయమై అబద్ధమాడారనే ఆరోపణతో 1998లో బిల్ క్లింటన్‌ను ప్రతినిధుల సభ అభిశంసించింది. కానీ సెనేట్ తొలిగించలేదు. అభిశంసన మూలంగా ఆయన ప్రతిష్ఠ దెబ్బతినకపోగా, ప్రజామోదం పెరిగినట్టు అధ్యయనంలో వెల్లడైంది. మోనికా లెవిన్‌స్కీతో సంబంధం సంగతెట్లా ఉన్నా, దానిని సాకుగా తీసుకొని ఆయనను ప్రత్యర్థులు వెంటాడిన తీరును ప్రజలు ఆమోదించలేకపోయారు. ఇప్పుడు ట్రంప్ విధానాలు అమెరికాకే కాదు, మొత్తం భూగోళంపై మానవాళికి ముప్పు కలిగించేలా ఉన్నాయి. ఆయనకు మానవీయ, ప్రజాస్వామిక సంప్రదాయాల పట్ల నమ్మకం లేదు, ఎటువంటి విలువలు పట్టవు. డెమొక్రాటిక్ పార్టీ వారు, ప్రజాస్వామికవాదులు ట్రంప్ విధానాలు ఎట్లా చెరుపు చేస్తాయో ప్రజలకు వివరించగలుగాలె. లేకపోతే అభిశంసన వల్ల ఆయన లబ్ధి పొందే అవకాశం ఉన్నది.

**నీటిపారుదల**


**శ్రీధర్‌రావు దేశ్‌పాండే**
**సల్లా విజయ్‌కుమార్**


# పొంచి ఉన్న పోతిరెడ్డిపాడు ముప్పు

**పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని, దానికింద ఉన్న శ్రీశైలం కుడి ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచుతామని కొన్నిరోజుల కిందట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అసెంబ్లీలో ప్రకటించిన సంగతిని అన్ని పత్రికలు పతాక శీర్షికతో వార్తలు ప్రకటించినాయి. ఇటువంటి ఒక తీవ్ర నిర్ణయ పూర్వాపరాలను, మంచి చెడ్డలను, తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్టులపై పడే ప్రభావాన్ని తెలంగాణ సమాజం సీరియస్‌గా చర్చించుకోవలసి ఉన్నది. అందులో భాగంగానే ఈ వ్యాసం.**

1966 హెల్సింకి రూల్స్ నుంచి మొదలుకొని నేడు అమల్లో ఉన్న యునైటెడ్ నేషన్స్ వాటర్ కోర్సెస్ కన్వెన్షన్ (UNWC), 1997 వరకు నీటి వినియోగాల్లో బేసిన్లోని ప్రాంతాలకు సమన్యాయం, సహేతుకత (Equitable Andreasonable) ఆధారంగా నీటి కేటాయింపులుండాలని నిర్దేశిస్తున్నాయి. కానీ, కృష్ణా నదీజలాలను ఏ విధమైన సహజ న్యాయసూత్రాలు గానీ, అంతర్జాతీయ న్యాయ సూత్రాలు గానీ పట్టించుకోకుండా, భిన్నవాదాలతో కేవలం ఆంధ్ర ప్రాంతాల ప్రయోజనాలే ప్రాధాన్యంగా పరిగణించి, తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో తీవ్ర వివక్ష చూపించాయి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు. మొదట ఏదో విధంగా ప్రాజెక్టులను కట్టివేసి ఆ తర్వాత వాటి వినియోగాలను కొన్నేండ్ల తర్వాత ఇప్పటికే వాడుకలో ఉన్న, స్థిరపడ్డ వినియోగాలు (Established Utilisations)గా హక్కులు అడుగడం ఒక వ్యూహంగా ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుల పర్వం సాగింది. సామాన్య ప్రజానీకం ఎవరైనా అమాయకంగా, అరే! ఇన్నేండ్ల నుంచి వాడుతున్నవాళ్లను ఎట్లా కాదంటారు, వాళ్లకు నీటి కేటాయింపులు చేయడం సమంజసమే అంటారు. కానీ కృష్ణానది బేసిన్‌లోనే ఉన్న, తెలంగాణ ప్రాంతాలకు నీరందించే ప్రాజెక్టులను కుదించివేసి, కావాలని అసలు మొదలేపెట్టక, మొదలుపెట్టినా ఏదో ఒక సాకుతో సాగదీస్తూ పూర్తిచేయకపోవడం వల్ల ఎప్పటికీ ఆ ప్రాజెక్టుల కింద ఆయకట్టు వినియోగంలోకి రాక స్థిరపడిన వినియోగాలుగా చెప్పలేమనే విషయం ప్రజలకు వెంటనే అర్థం కాదు.

నదీజలాల వినియోగంలో సమన్యాయం కావాలనే ఒక ప్రధాన డిమాండుతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు కృష్ణా, గోదావరి జలాల వినియోగంతో ముడిపడి ఉన్నాయి. ఈ సందర్భంగా, సమన్యాయ వాటా ప్రకారం ఒకసారి కేటాయించినవి తర్వాతికాలంలో సమన్యాయ వాటాగా ఉండవు, ఉండాల్సిన అవసరం లేదని ఇండస్ కమిషన్ 1942లో స్పష్టం చేసిన మాటలు గుర్తుకుతెచ్చుకోవాలి. మారిన పరిస్థితుల్లో ఒక ప్రాజెక్టులో అంతవరకు వినియోగించిన నీళ్లు సర్వకాల సర్వావస్థల్లో అట్లాగే వినియోగించడం సాధ్యం కాదని కృష్ణా ట్రిబ్యునళ్లు వ్యక్తంచేశాయి. నేడు పోలవరం, పట్టిసీమల నుంచి కృష్ణానదికి మళ్లిస్తున్న గోదావరి జలాలు, సాంకేతిక పురోభివృద్ధి వల్ల వందలాది మీటర్ల ఎత్తుకు నదీజలాలను ఎత్తిపోయగలుగడం, సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ, వినియోగాల్లో నూతన నీటి సరఫరా విధానాల అమలు, తక్కువ పంటకాలం ఉండే ఆధునిక వంగడాల వినియోగం, నీరు ఎక్కువ అవసరమయ్యే వరి, చెరుకు వంటి పంటల నుంచి తక్కువ నీరు అవసరమయ్యే కూరగాయలు, పండ్లతోటలు, పూలతోటలు, ఉద్యానవన పంటలు, తృణధాన్యాలు, ఇతర ఆరుతడి పంటలకు మళ్లడం.. తదితరాల వల్ల నదీజలాల వినియోగంలో మిగులు కారణంగా మారిన పరిస్థితుల్లో తప్పనిసరిగా ప్రాజెక్టుల నీటి వినియోగాల్లో మార్పు చేయాల్సిన అవసరం ఉన్నది. ఇక్కడ మరొక విషయం పరిగణనలోకి తీసుకోవాలి. 'A river basin is a topographic entity. While political boundaries may change from time to time and the governments which exercise control over a basin may change in number orin nature, the limits of the watershed of a river remain fixed forall time. In case of scarcity of water in relation to requirements,the watershed boundary provides a definite area within whichto ration the waters; otherwise there would be no end to the claims that may be made on the scarce resource.' అని ప్రముఖ ఇంజినీర్ ఎన్డీ గుల్హాటి 1972లో వ్యక్తం చేశారు. బేసిన్‌లోని వ్యవసాయానికి అనుకూలమైన భూమి ఒక పంటకు సాగునీటి కోసం అలమటిస్తుంటే, బేసిన్ ఆవల భూముల్లో రెండో పంటకు, మూడో పంటకు సాగునీరు ఇవ్వాలనడం, ఎక్కడో ఐదారు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న భూములకు నీళ్లివ్వాలనడం సరికాదు. ఈ విషయాలన్నీ స్ఫురణలో ఉంచుకొని ప్రకాశం బ్యారేజీ వినియోగాలైనా, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వినియోగాలైనా చూడాలి.

నేడు అమల్లో ఉన్న ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఎగువ రాష్ర్టాలకు 75 శాతం డిపెండబిలిటీ వద్ద కేటాయించిన మొత్తాలు వాడుకున్నాక దిగువకు వచ్చే నీళ్లన్నీ మనం (తెలంగాణ-ఆంధ్రప్రదేశ్) వాడుకునే వెసులుబాటు ఉన్నది. ఆ నీళ్లపై హక్కు మాత్రం ఉండదు. భవిష్యత్తులో వచ్చే రివ్యూ ట్రిబ్యునళ్లు ఆ నీళ్లను నాలుగు రాష్ర్టాల మధ్య పంచవచ్చు. దాని ఆధారంగానే మనం పలు ప్రాజెక్టులు నాటి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఆంధ్రా ప్రాంతాల్లో నిర్మించింది. ఉదా: కల్వకుర్తి, హంద్రీ-నీవా మొదలైనవి.

ఇక్కడ మరొక ముఖ్యమైన అంశం గుర్తుంచుకోవాలి. మూడు రాష్ర్టాల (మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్) ప్రాజెక్టుల డిమాండ్లలో సరైనవిగా భావించిన (Worth Consideration) వాటిని పరిగణనలోకి తీసుకొని వాటన్నింటినీ రాష్ర్టాలపరంగా కలిపి ఆ మొత్తాన్ని గంపగుత్తగా (Enbloc or Mass Allocation) రాష్ర్టాలకు ఇస్తూ, ఈ కేటాయింపులు ఏ ప్రాజెక్టులకు ముడిపెట్టి ఇవ్వడం లేదు, ఆయా రాష్ర్టాల్లో ఎక్కడైనా, ఎట్లయినా, ఆయా రాష్ర్టాలకు కేటాయించిన మొత్తానికి మించకుండా వాడుకోవచ్చని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. అందువల్లనే, రాష్ట్ర విభజన తర్వాత ఆ గంపగుత్త కేటాయింపును, ప్రస్తుత కృష్ణా ట్రిబ్యునల్-IIకు ప్రాజెక్టుల వారీగా,రెండు తెలుగు రాష్ర్టాలకు కేటాయింపులు చేయాలని రిఫర్ చేయడం జరిగింది. అయితే ఆ తర్వాత జరిగే కేటాయింపులను కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు తమతమ రాష్ర్టాల్లో తమకు కేటాయించిన మొత్తం మించకుండా ఎక్కడైనా ఎట్లయినా వాడుకునే వెసులుబా టు ఉండకతప్పదు. రాష్ట్ర విభజన వల్ల ఏర్పడిన కృష్ణా బోర్డు వద్ద, ఇరు రాష్ర్టాల మధ్య ఒక తాత్కాలిక అవగాహన, అవసరాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం, ఉమ్మడి రాష్ట్రం చేసిన ప్రాజెక్టుల పరమైన తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు కేటాయించిన 299, 512 టీఎంసీలు (మొత్తం రెండు రాష్ర్టాలకు కలిపి 811 టీఎంసీలు) అదే నిష్పత్తిలో వాడుకోవాలని ప్రతిపాదించింది. పర్యవసానంగా ఏర్పడిన ఒప్పందం ద్వారానే నేడు 299, 512లకు మించకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు ఆయా ప్రాజెక్టుల వద్ద వాడుకుంటున్నాయి. అందువల్లనే నేడు ఆంధ్రప్రదేశ్ ప్రకాశం బ్యారేజీ వద్ద కాకుండా పోతిరెడ్డిపాడు, హెచ్ఎన్ఎస్ఎస్ తదితరాల వద్ద నుంచి వాడుకోగలుగుతున్నది. అట్లాగే, తెలంగాణ తన ప్రాజెక్టుల వాటాలోంచి కల్వకుర్తి, నెట్టెంపాడు తదితరాల వద్ద వాడుకోగలుగుతున్నది. ఈ నిష్పత్తిలో ఇరు రాష్ర్టాలు వాడుకోవడం తాత్కాలికంగా ప్రస్తుత ట్రిబ్యునల్ తన తీర్పు ఇచ్చేవరకు మాత్రమేనని గమనించాలి. అయితే, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ కెపాసిటీని విపరీతంగా పెంచివేస్తూ నిర్మిస్తామని చెప్పడం ఆందోళన కలిగించే విషయమే. 40 వేల నుంచి 80 వేల క్యూసెక్కులకు సామర్థ్యం పెంచడం సాధ్యమేనా అని సందేహం చాలామందికి కలుగడం సహజమే. ఒకసారి పోతిరెడ్డిపాడు, దానికి దిగువన గల కాలువ సామర్థ్యాల గురించి చూద్దాం.

1964లో ప్లానింగ్ కమిషన్ శ్రీశైలం ఒక జలవిద్యుత్ ప్రాజెక్టుగా మాత్రమే ఆమోదించింది. ఆ తర్వాత 1973లో బచావత్ ట్రిబ్యునల్ కూడా శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఏ విధమైన నీటి కేటాయింపులు చేయలేదు, కేవలం రిజర్వాయర్లో ఆవిరి నష్టాలకు మాత్రమే 33 టీఎంసీలుగా కేటాయింపులు చేసింది. అత్యధిక మొత్తంలో ప్రకాశం బ్యారేజీ, నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల(ఆంధ్ర ప్రాంతం)కు డిమాండ్లు ఉంచి 75 శాతం నికర జలాల రక్షణలు పొందినందు వల్ల ట్రిబ్యునల్ ఇంకా ఏ విధమైన కేటాయింపులు శ్రీశైలం నుంచి చేయలేదు. అందువల్ల ఇక శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కుడివైపుకు నీటిని పెన్నా తదితర బేసిన్లకు తీసుకువెళ్లాలంటే ఒక కెనాల్ కృష్ణా-పెన్నాల మధ్యగల ఎత్తయిన రిడ్జ్‌ను కట్ చేస్తూ తీయాల్సిన అవసరం ఉన్నది. ఎగువ రాష్ర్టాలు అప్పటికే, తమ బేసిన్ అవసరాలను కాదని ఒక లోటుబేసిన్ నుంచి బేసిన్ ఆవలకు తరలించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి కాబట్టి ఈ సమస్యను ఉమ్మడి రాష్ట్ర ఆంధ్రా పాలకులు చాలా చాకచక్యంగా అధిగమించారనవచ్చు. అయితే, కేవలం శ్రీశైలం కుడివైపున ఉన్న ఆంధ్ర ప్రయోజనాలపైనే శ్రద్ధ వహిస్తూ, ఎడమవైపు తెలంగాణ ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా వారి ప్రయోజనాలను కూడా కాపాడుతున్నట్లుగా చూపే ప్రాజెక్టులను ఉత్సవ విగ్రహాలుగా చూపించారు. (ఉదా: ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి).

అంతర్రాష్ట్ర ఒప్పందం ద్వారా తెలుగు గంగ ప్రాజెక్టును, ప్లానింగ్ కమిషన్ సాంక్షన్ చేయించడం ద్వారా శ్రీశైలం కుడి బ్రాంచ్ కెనాల్ న్యాయబద్ధమని చూపించే ప్రయత్నం చేశారు. 1973 నాటికి బచావత్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు వెలువడ్డాయి కాబట్టి, నాటి నుంచే మద్రాసుకు తాగునీరు కల్పించే మిషతో కుడివైపున ఒక కెనాల్‌ను తవ్వడానికి మూడు కృష్ణా బేసిన్ రాష్ర్టాల మధ్య ఒక ఒప్పందం కోసం ప్రయత్నాలు మొదలయ్యాయని జలరంగ నిపుణుల అంచనా. కేంద్ర సహాయం వల్లనే ఏపీ ఎక్కువ మొత్తంలో నీటిని పొంది కృష్ణా బేసిన్లో కొరత సృష్టించిందని నాడు మహారాష్ట్ర ట్రిబ్యునల్ ఎదుట పేర్కొనడం ఈ అభియోగానికి బలం చేకూర్చుతున్నది.

**రాష్ట్ర విభజన వల్ల ఏర్పడిన కృష్ణా బోర్డు వద్ద, ఇరు రాష్ర్టాల మధ్య ఒక తాత్కాలిక అవగాహన, అవసరాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం, ఉమ్మడి రాష్ట్రం చేసిన ప్రాజెక్టుల పరమైన తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు కేటాయించిన 299, 512 టీఎంసీలు (మొత్తం రెం డు రాష్ర్టాలకు కలిపి 811 టీఎంసీలు) అదే నిష్పత్తిలో వాడుకోవాలని ప్రతిపాదించింది. పర్యవసానంగా ఏర్పడిన ఒప్పందం ద్వారానే నేడు 299, 512లకు మించకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు ఆయా ప్రాజెక్టుల వద్ద వాడుకుంటున్నాయి.**


(ఇంకా ఉంది...)


# మానవత్వమే భారతావని ఆత్మ

**జాతీయం**




**సీహెచ్ పభాకర్‌రావు**


భారతదేశ సంస్కృతి, జాతీయత, విభిన్న జాతుల, నమ్మకాల సమున్నత సౌరభానికి, సహనశీలతకు నిదర్శనం. సనాతన ధర్మాన్ని ప్రవచించిన వేదకాలం నాటి నుంచి తన ధర్మం ఇతర ధర్మాలకు, ఆలోచనలకు ఆచరణలకు విరుద్ధమైనా, అందరితో, అన్నీ ధర్మాలతో, ఆలోచనలతో, తాత్త్విక చింతనతో సహజీవనం చేసింది. అలా సామరస్య సమ్మున్నత స్థాయిని కలిగిన గొప్ప జీవన ధర్మాన్ని, పద్ధతులను అలవర్చుకున్న దేశం మనది.

నేటి ఆధునిక భారతదేశాన్ని మన రాజ్యాంగం సెక్యులర్ దేశంగా అభివర్ణించింది. కానీ కొందరు నేడు సెక్యులర్ అనే పదం పశ్చిమ దేశాల నుంచి వచ్చిందని, ఆ భావన పరాయి భావన అని, భారతదేశమంతా ఒకటే మతాన్ని అవలంబించాలని అంటున్నారు! అలాంటి నేటి పెద్దలు, వేల ఏండ్ల కిందటనే మన దేశంలో అనేక మత భావనలకు మూలమైన తాత్త్విక భావనలు అవతరించాయనే విషయాన్ని మరిచిపోయారు. క్రైస్తవం, ఆ తర్వాత వచ్చిన ఇస్లాం మతాలే ఇతర మతాలు అన్నట్లుగా ద్వేషిస్తున్నారు. గత చరిత్రను మరిచిపోయి మనుషుల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు, రాజకీయాలు చేస్తున్నారు. గత మూడు నాలుగు దశాబ్దాలుగా సెక్యులరిజం అంటేనే దేశ ద్రోహుల భాషగా అభివర్ణించే విద్వేష పూరిత భావనలు దేశంలో ప్రబలిపోయాయి.

భరత వర్షం, భరత ఖండం అనే పదాలకు నేటి పరిభాషలో, రూపంలో ఒక భౌగోళిక స్వరూపం అనేదే లేదనే విషయాన్ని గ్రహించలేని కుహనా మేధావులంతా కొత్త సిద్ధాంతాలను ప్రతిపాదిస్తున్నారు. దేశాన్ని, ప్రజలను మతాలపరంగా విభజించి, తమ రాజకీయ అవసరాలను తీర్చుకుంటున్నారు. వ్యక్తిగతమైన మతాన్ని ముందుకుతెచ్చి, దేశ ప్రజల్లో విద్వేష భావాలను రెచ్చగొడుతున్నారు. అగ్రవర్ణాలకు అనుకూలమైన హిందూ మత సిద్ధాంతానికి కొత్త రూపం ఇస్తూ, ఇతర మతాలనే కాకుండా తమ భావాలను, ఆలోచనలను వ్యతిరేకించే అందరిని దేశ ద్రోహులుగా చిత్రీకరించే భావ దారిద్ర్యం 1920-30ల మధ్యే ప్రారంభమైంది.

ముఖ్యంగా స్వాతంత్ర్య పోరాట సమయంలో కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించేవారు హిందువు , హిందుత్వం, హిందూ రాజ్యం అనే కొత్త సిద్ధాంతాన్ని తెరపైకి తెచ్చారు. చరిత్రలో రాజ్యాధికారం కోసం ఇప్పుడు తప్ప మరెప్పుడు కూడా మతం అనే వ్యక్తిగతమైన అంశం తెరపైకి రాలేదు.

పర్షియన్ దేశాల నుంచి మన దేశానికి దండయాత్రలు చేసింది రాజ్యకాంక్షతోనే కానీ మతాలకు వ్యతిరేకంగా కాదు. భారతదేశంపై జరిగిన దండయాత్రలను మత యుద్ధాలని అనలేం. అలాగే మనదేశంలో తన సామ్రాజ్యాన్ని విస్తరించుకున్న సముద్రగుప్తుని కంటే ముందుకాలం నుంచి తూర్పు ఆసియా దేశంలోని బర్మా, టిబెట్, భూటాన్, సుమిత్ర, జావా, మలేషియా, శ్రీలంక, ఆ చుట్టుపక్కల ఉన్న అనేక దీవులను ఆక్రమించుకున్న సమయంలో వారందరికీ ఉన్న ఒకేఒక ఆశయం రాజ్య విస్తరణతో పాటు, ధన సముపార్జన. అశోకుని కాలం నుంచి బౌద్ధ మత ప్రచారాన్ని ప్రారంభించారు. కానీ మతం మార్చుకొమ్మని రాజులు దండయాత్రలు చేయలేదు. రాజు ఆదరించిన మతాన్ని ప్రజలు ఆదరించి, ఆచరించారు. కొన్నిసార్లు తిరస్కరించారు. ఎవరికి నచ్చిన మతాన్ని వారు ఆచరించారు. ఇలా చెప్పుకుంటూపోతే మన సనాతన ధర్మంలో, చరిత్రలో అనేక ఉదాహరణలున్నాయి.

వేల ఏండ్ల సంస్కృతి, నాగరికత కలిగిన భారతదేశంలో ఎన్నడూ కూడా మత ప్రతిపాదికన ప్రజలను విభజించి పాలించే వ్యవస్థ, పాలకులు లేరు. రాజకీయాధికార ఆకాంక్షతోనే, గత శతాబ్ది ప్రారంభం నుంచే కొన్ని రాజకీయశక్తులు తమ రాజకీయ అవసరాల కోసం మొదలుపెట్టారు. నేడు కూడా మతాన్ని రాజ్యాధికారం కోసమే వాడుకుంటున్నారనేది స్పష్టం.

మన పొరుగు దేశాల్లో హిందువులను ఇతర మైనార్టీలను అధిక సంఖ్యాకులైన మతస్థులు హింసిస్తున్నారనే విషయంలో ఎవరికీ ఆక్షేపణలు ఉండనక్కర లేదు. కానీ మత సామరస్యానికి, మత సహనానికి ప్రపంచానికే ఆదర్శమైన మన దేశంలో నేడు మతం ఆధారంగానే పౌరసత్వం ఇవ్వాలనే నిర్ణయాన్ని అందరూ వ్యతిరేకిస్తున్నారు. దశాబ్దాల తరబడి తమ జాతి ఉనికికే ప్రమాదం వస్తుందని, తమ జనాభా కంటే వలస వచ్చినవారే ఎక్కువై, సంస్కృతి, సంప్రదాయాలు అణిచివేయబడుతున్నాయని, చివరికి రాజకీయాధికారానికి దూరమయ్యామని ఉత్తర భారత దేశంలోని రాష్ర్టాల ప్రజలు ఉద్యమాలు చేస్తున్నారు.

అస్సాంను విభజించి పలు రాష్ర్టాలుగా విభజించారు. ఆయా రాష్ర్టాల్లో ఇతర రాష్ర్టాల ప్రజలు ప్రవేశించాలంటే 'ఇన్నర్ లైన్ పర్మిషన్ పాస్' తీసుకోవాలి. ఆంగ్లేయులు తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి, ఇతర ప్రాంతాల భారతీయ పెట్టుబడిదారులు ఈశాన్య భారతంలోని అటవీ సంపద, తేయాకు పంటను, క్రూడాయిల్ సంపదను ఆధారంగా చేసుకొని వ్యాపా రం చేయకుండా 1873లో ఈ పర్మిషన్ పద్ధతిని ప్రవేశపెట్టారు. అదే పద్ధతి నేటికీ, అంటే 2019లో కూడా కొనసాగుతున్నది.

ఈశాన్య రాష్ర్టాల్లో ఎక్కువగా నాటి తూర్పుబెంగాల్ నుంచి అధిక మొత్తంలో బెంగాల్ మాట్లాడే ప్రజలు జీవనోపాధి కోసం ఈశాన్య రాష్ర్టాలకు వలస వచ్చారు. అలాగే తమిళనాడుకు శ్రీలంకలో 1970-90 మధ్యలో జరిగిన హింసాకాండకు భయపడి లక్షల సంఖ్యలో తమిళులు, పాకిస్థాన్‌లో జరుగుతున్న హింస కు తట్టుకోలేక హిందువులు, సిక్కులు, క్రైస్తవులతో పాటు, ఇతర అల్పసంఖ్యాకులైన పార్శీలు, అహ్మదీయులు, షియాలు కూడా భారతదేశానికి, ముఖ్యంగా పంజాబ్ రాష్ర్టానికి శరణార్థులుగా వలసవచ్చారు.

ఇన్నాళ్లుగా శరణార్థులుగా ఉన్న వీరందరిలో ఇస్లాం మతాన్ని ఆచరించే అన్ని తెగలవారికి తప్ప మిగతా వారందరికీ భారతదేశ పౌరసత్వాన్ని ఇవ్వాలని నేటి బీజేపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇది పూర్తిగా మతపరమైన వివక్ష అని దేశ ప్రజలంతా నిరసిస్తూ ఉద్యమిస్తున్నారు. ఇది భారతదేశ వేద సంస్కృతికి, సనతాన ధర్మనిష్ఠకు, ఆచరణకు వ్యతిరేక దిశలో ప్రయాణించడం అని బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. శాంతి సహనాలను ప్రవచించిన భారతావని మౌలిక రూపానికే మచ్చ ఇది అని బీజేపీ చర్యను నిరసిస్తున్నది.


**ఇన్నాళ్లుగా శరణార్థులుగా ఉన్న వీరందరిలో ఇస్లాం మతాన్ని ఆచరించే అన్ని తెగలవారికి తప్ప మిగతా వారందరికీ భారతదేశ పౌరసత్వాన్ని ఇవ్వాలని నేటి బీజేపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇది పూర్తిగా మతపర మైన వివక్ష అని దేశ ప్రజలంతా నిరసిస్తూ ఉద్యమిస్తున్నారు. ఇది భారతదేశ వేద సంస్కృతికి, సనతాన ధర్మనిష్టకు, ఆచరణకు వ్యతిరేక దిశలో ప్రయాణించడం అని బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. శాంతి సహనాలను ప్రవచించిన భారతావని మౌలిక రూపానికే మచ్చ ఇది అని బీజేపీ చర్యను నిరసిస్తున్నది.**


**జనగళం**

### విజయవంతంగా ముగిద్దాం

తెలంగాణలో అతిపెద్ద గిరిజన జాతర పండుగైన మేడారం జాతరకు ముహూర్తం ఖరారైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే ఈ గిరిజన పండుగ కోసం మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తిచేయాలి. ప్రజలకు ఏ మాత్రం అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వం ఏర్పాట్లను ఇప్పటికే మొదలుపెట్టడం సంతోషదాయకం. ప్రజలు కూడా సహకరించి ఈ పండుగను విజయవంతంగా నిర్వహించుకోవాలి.

**- ఎ.రాజేంద్ర, హన్మకొండ**

### ముదావహం

విశాఖపట్నం వేదికగా రెండో వన్డేల్లో భారతజట్టు సమిష్టిగా రాణించింది. బ్యాట్స్‌మెన్లు బ్యాట్లతో విజృంభించగా, పేసర్లు తమ ప్రతాపం చూపించారు. స్పిన్నర్లు బాల్‌ను గిరగిరా తిప్పేసి మ్యాచ్‌ను తమ చేతుల్లోకి లాగేసుకున్నారు. మొదటి నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన భారతజట్టు కీలక మ్యాచ్‌లో విజయం సాధించటం ముదావహం.

**- పుల్కం సంపత్ కుమార్, రాములపల్లె, జగిత్యాల**

### పేర్లనమోదుకు అవకాశం ఇవ్వాలె

రాష్ట్రంలో రేషన్ కార్డులున్న వారు తమ పిల్లల పేర్లను వాటిలో చేర్చేందుకు అధికారులు సహకరించటం లేదు. ప్రత్యేక సందర్భాల్లో తప్ప, పిల్లల పేర్లు చేర్చే అవకాశం లేదని అధికారులు అంటున్నారు. దీంతో ఎన్నో పేద కుటుంబాలు పిల్లల పేర్లు రేషన్‌కార్డుల్లో చేరక ఇబ్బందులు పడుతున్నారు. రేషన్‌కార్డుల్లో పేర్లు లేకపోవటంతో చదువుకునే క్రమంలో కూడా విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అలాగే ఆరోగ్య శ్రీ, సీఎంఆర్‌ఎఫ్ ఫలాలు పొందేందుకు రేషన్ కార్డుల్లో పేర్లు తప్పనిసరిగా ఉండాలి. కాబట్టి తెల్లరేషన్ కార్డులు ఉన్న పేదలకు ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు తమ తమ కార్డుల్లో పేర్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా ఆదేశాలిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. కాబట్టి దీనికోసం ప్రభుత్వం ఓ కార్యక్రమాన్ని ప్రకటించి, రేషన్ కార్డుల్లో పేర్లు చేర్చేందుకు అధికారులకు ఆదేశాలివ్వాలి.

**- గద్దం వేణుగోపాల్, మానకొండూర్, కరీంనగర్**


**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

## గద్దె దించడం సాధ్యపడకపోవచ్చు!

- ట్రంప్ అభిశంసనపై రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్య
- అభిశంసన అమెరికా అంతర్గత అంశమన్న ఉక్రెయిన్

**మాస్కో, డిసెంబర్ 19:** అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగాలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆ దేశ ప్రతినిధుల సభ అభిశంసించిన నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్‌ను గద్దె దించడం సాధ్యపడక పోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. 'ట్రంప్‌పై పెట్టిన అభిశంసన తీర్మానం రిపబ్లికన్ల మెజారిటీ కలిగిన సెనేట్‌లో ఆమోదం పొందాలి. తమ ప్రతినిధిని శ్వేత సౌధం నుంచి పంపించే నిర్ణయాన్ని రిపబ్లికన్లు తీసుకుంటారని నేను అనుకోవడం లేదు' అని అన్నారు. మరోవైపు, ట్రంప్‌పై అభిశంసన అనేది అమెరికా అంతర్గత అంశమని ఉక్రెయిన్ గురువారం ప్రకటించింది.

## శవాన్ని ఈడ్చుకొచ్చి.. వేలాడదీయండి!

- మరణశిక్ష అమలుకు ముందే ముషారఫ్ మరణించినా ఊరుకోవద్దు
- వెల్లడైన పాక్ ప్రత్యేక కోర్టు తీర్పు వివరాలు
- తీవ్రంగా ఖండించిన ఆ దేశ సైన్యం

**ఇస్లామాబాద్, డిసెంబర్ 16:** దేశద్రోహం కేసులో పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌కు మరణశిక్ష విధిస్తూ ఇటీవల ఆ దేశ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పు పూర్తి వివరాలు గురువారం వెల్లడయ్యాయి. మరణశిక్ష అమలుకు ముందే ముషారఫ్ ఒకవేళ చనిపోయినా అతడి మృతదేహాన్ని మూడు రోజులపాటు వేలాడదీయాలని ప్రత్యేక కోర్టు తన తీర్పులో పేర్కొంది. ప్రత్యేక కోర్టుకు నేతృత్వం వహించిన పెషావర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వఖార్ అహ్మద్ సేథ్ తీర్పును వెలువరిస్తూ 'ముషారఫ్‌ను అదుపులోకి తీసుకోవడానికి అన్ని విధాల ప్రయత్నించండి. అనంతరం అతడికి చట్ట ప్రకారం మరణశిక్ష అమలు చేయండి. ఒకవేళ శిక్ష అమలు కంటే ముందే అతడు చనిపోతే.. అతడి మృతదేహాన్ని ఇస్లామాబాద్‌లోని అధ్యక్ష భవనం, ప్రధాని కార్యాలయం, పార్లమెంట్, సుప్రీంకోర్టు ఉండే ప్రాంతానికి సమీపంలోని డెమోక్రటిక్ చౌక్ వద్దకు ఈడ్చుకెళ్లి మూడు రోజులపాటు వేలాడదీయండి' అని పేర్కొన్నారు.



167 పేజీలున్న ఈ తీర్పుపై పాక్ సైన్యం మరోసారి మండపడింది. మానవ హక్కులు, మత పరమైన, నాగరికత పరమైన విలువలకు విరుద్ధంగా కోర్టు తీర్పు ఉన్నదని తెలిపింది. తీర్పుపై ప్రధాని ఇమ్రాన్‌ఖాన్, సైన్యాధిపతి జనరల్ బజ్వా కలిసి చర్చించారని, కొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నారని, వాటిని త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొంది. మరోవైపు తనపై పెంచుకున్న వ్యక్తిగత కక్ష ఆధారంగానే తీర్పు ఇచ్చినట్లు తెలుస్తున్నదని ముషారఫ్ పేర్కొన్న కొన్ని గంటల వ్యవధిలోనే తీర్పు పూర్తి వివరాలు వెల్లడి కావడం విశేషం.

## నీ పని పడతాం!

### కమెడియన్ కునాల్ కమ్రాకు బీజేపీ నేత బెదిరింపు

**ముంబై:** నీ పని పట్టడం ఖాయమంటూ ప్రముఖ హాస్య కళాకారుడు కునాల్ కమ్రాను ముంబై బీజేపీ ప్రధాన కార్యదర్శి మోహిత్ భారతీయ బెదిరించారు. బీజేపీ ఐటీ విభాగం జాతీయ ఇంచార్జ్ అమిత్ మాలవీయ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన ఓ గ్రాఫిక్‌పై వ్యంగ్యంగా స్పందిస్తూ కునాల్ తిరిగి పోస్టు చేశారు. 'ప్రియమైన ప్రధాని మోదీ.. మీడియా, బాలీవుడ్, 353 మంది ఎంపీలు, దేశంలోని ప్రముఖులు, అవినీతి నేరగాళ్లు, రేపిస్టులు, ఆర్ఎస్ఎస్, ఎన్ఆర్ఐ మాఫియా మీ వెంటే ఉన్నారు. కానీ మేం మిమ్మల్ని వ్యతిరేకిస్తున్నాం. ఎందుకంటే దేశానికి మీ అవసరం లేదు' అని అందులో పేర్కొన్నారు. కునాల్ చేసిన పోస్టుపై మోహిత్ భారతీయ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. 'నేను చెబుతున్నా.. నీ పని పడతాం' అంటూ ట్వీట్ చేశారు.



# ట్రంప్ దిగాల్సిందే!

**అమెరికా అధ్యక్షుడిని అభిశంసించిన ఆ దేశ ప్రతినిధుల సభ**

- అధికార దుర్వినియోగం, కాంగ్రెస్‌ను అడ్డుకోవడం అభియోగాలపై ఓటింగ్
- రెండింటిపైనా ట్రంప్‌కు వ్యతిరేకంగా నిర్ణయం
- అమెరికా చరిత్రలో అభిశంసనకు గురైన మూడో అధ్యక్షునిగా అపకీర్తి
- ట్రంప్‌కు అండగా రిపబ్లికన్లు.. వచ్చే నెలలో సెనేట్‌లో అభిశంసన ప్రక్రియ
- ప్రజాతీర్పును వమ్ము చేసే ప్రయత్నం: ట్రంప్ మండిపాటు



అమెరికా ప్రతినిధుల సభలో ట్రంప్ అభిశంసనపై ఓటింగ్ సందర్భంగా నిలబడిన సభ్యులు

**వాషింగ్టన్, డిసెంబర్ 19:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆ దేశ ప్రతినిధుల సభ అభిశంసించింది. ట్రంప్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, కాంగ్రెస్ (చట్టసభ) కార్యకలాపాలను అడ్డుకున్నారని ప్రతినిధుల సభ పేర్కొంది. అమెరికా చరిత్రలో అభిశంసనకు గురైన మూడో అధ్యక్షునిగా ట్రంప్ అపకీర్తిని మూటగట్టుకున్నారు. వచ్చే ఏడాది సెనేట్‌లో జరుగబోయే విచారణ ట్రంప్ పదవికి కీలకం కానుంది. సెనేట్ కూడా ఆయనను అభిశంసిస్తే ట్రంప్ గద్దె దిగాల్సి వస్తుంది. ప్రతినిధుల సభలో ట్రంప్ అభిశంసనపై బుధవారం రాత్రి కీలకమైన ఓటింగ్ జరిగింది. రెండు అభియోగాలపై వేర్వేరుగా ఓటింగ్ నిర్వహించారు. ట్రంప్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగంపై అనుకూలంగా 230, వ్యతిరేకంగా 197 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌ను అడ్డుకున్నారన్న అభియోగానికి అనుకూలంగా 229, వ్యతిరేకంగా 198 ఓట్లు వచ్చాయి. డెమొక్రటిక్ పార్టీ సభ్యులంతా ట్రంప్‌ను అభిశంసించగా, రిపబ్లికన్లందరూ ట్రంప్‌కు అండగా నిలువటం విశేషం. కాగా రెండో అభిశంసన తీర్మానాన్ని ఒక డెమొక్రాట్ సభ్యుడు కూడా వ్యతిరేకించడం గమనార్హం. ట్రంప్ అభిశంసనను అమెరికా చరిత్రలో 'అత్యంత సిగ్గుచేటైన' రాజకీయ పరిణామంగా అధ్యక్షభవనం వైట్‌హౌస్ అభివర్ణించింది. ప్రతినిధుల సభలోని డెమొక్రటిక్ పార్టీ సభ్యులుగా ఉన్న నలుగురు భారత సంతతి సభ్యులు ట్రంప్ అభిశంసనకు అనుకూలంగా ఓటు వేశారు. ఇక తదుపరి విచారణ సెనేట్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన జరుగనుంది. 243 ఏండ్ల అమెరికా చరిత్రలో అభిశంసనకు గురై పదవి కోల్పోయిన అధ్యక్షులెవరూ లేరు. 'ట్రంప్ అభిశంసనకు అనుకూలంగా నేను ఓటు వేశాను. ఆయన మన ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమించారు' అని భారత సంతతికి చెందిన సభ్యుడు రాజా కృష్ణమూర్తి తన మద్దతుదారులకు పంపిన ఈమెయిల్‌లో పేర్కొన్నారు.

**అధ్యక్ష పదవికి ఢోకా లేదు!**

ట్రంప్‌ను అమెరికా ప్రతినిధుల సభ అభిశంసించినా, దీనికి సెనేట్‌లో మూడింట రెండు వంతుల మంది ఆమోదం తెలిపితేనే ఆయన పదవికి ముప్పు వాటిల్లుతుంది. ప్రస్తుతం వంద మంది ఉన్న సెనేట్‌లో రిపబ్లికన్లు 53 మంది ఉన్నారు. ప్రతినిధుల సభలో జరిగిన ఓటింగ్‌లో రిపబ్లికన్లందరూ ట్రంప్‌కు పూర్తి మద్దతుగా నిలిచినట్టు తెలుస్తున్నది. సభలో డెమొక్రాట్లు 232, రిపబ్లికన్లు 197 మంది, ఒక ఇండిపెండెంట్ సభ్యుడు ఉండగా, నాలుగు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. సెనేట్‌లో అభిశంసన తీర్మానం చర్చకు కూడా రాకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ వచ్చినా.. అభియోగాలను రద్దు చేయాలని ఏ ఒక్క సభ్యుడు తీర్మానం ప్రవేశపెట్టినా.. సాధారణ మెజారిటీతో ఆమోదింపజేసుకోవచ్చని అంటున్నారు.

### అభియోగాలేమిటి?

అభిశంసన తీర్మానంలో.. ట్రంప్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నది మొదటి అభియోగం. 2020 అధ్యక్ష ఎన్నికల్లో గెలిచేందుకు ట్రంప్ అక్రమాలకు పాల్పడుతున్నారని డెమొక్రాట్లు ఆరోపిస్తున్నారు. వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో తనపై ప్రత్యర్థిగా నిలువబోతున్న జో బిడెన్‌పై అవినీతి అభియోగాలు మోపి, దర్యాప్తు చేపట్టాలని ఉక్రెయిన్ కొత్త అధ్యక్షుడు వోలోడైమిర్ జెలెన్‌స్కీపై ట్రంప్ ఒత్తిడి తెచ్చారని చెప్తున్నారు. జో బిడెన్ కుమారుడు హంటర్ బిడెన్‌కు ఉక్రెయిన్‌లోని గ్యాస్ కంపెనీల్లో వాటాలున్నాయి. ఒబామా హయాంలో ఉపాధ్యక్షునిగా ఉన్న జో బిడెన్ తన అధికారాన్ని ఉపయోగించి కుమారునికి ఉక్రెయిన్‌లో లబ్ధి చేకూర్చారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేయించాలని ట్రంప్ వోలోడైమిర్‌పై ఒత్తిడి తెచ్చారని అంటున్నారు. తాను చెప్పినట్టు వినకపోతే ఉక్రెయిన్‌కు ప్రకటించిన 400 మిలియన్ డాలర్ల భద్రతా సహాయాన్ని నిలిపివేస్తానని ట్రంప్ బెదిరించినట్టు ఆరోపణలు వచ్చాయి. అధికార దుర్వినియోగం ఆరోపణలపై దర్యాప్తు జరిపేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్‌ను అడ్డుకుంటున్నారన్నది ట్రంప్‌పై మోపిన రెండో అభియోగం. పాలనా యంత్రాంగంలోని అధికారులను దర్యాప్తుకు సహకరించకుండా అడ్డుకున్నారని, ఇది రాజ్యాంగాన్ని ధిక్కరించడమేనని డెమొక్రాట్లు ఆరోపించారు. తాము ఏ సమాచారం కోరినా ఇవ్వలేదని తెలిపారు. అధ్యక్షుడు నియంతగా వ్యవహరించడంతో చట్టసభ (కాంగ్రెస్)గా తన విధులను సక్రమంగా నిర్వర్తించలేకపోయిందని పేర్కొన్నారు.

### తటస్థంగా తులసీ గబ్బార్డ్



అభిశంసన తీర్మానంపై డెమొక్రాట్ సభ్యురాలు, భారత సంతతికి చెందిన తులసీ గబ్బార్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా ఓటు వేయలేదు. ఆమె తటస్థంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఆమె వైఖరి ట్రంప్‌కు అనుకూలంగా మారిపోయింది. మరో డెమొక్రాటిక్ సభ్యుడు జోయి మన్చిన్ ట్రంప్‌కు అనుకూలంగా ఓటు వేశారు.



### నేను ఏ తప్పూ చేయలేదు: ట్రంప్

వచ్చే ఏడాది జరుగనున్న అధ్యక్ష ఎన్నికల్లో మరోమారు బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్న ట్రంప్ తాను ఏ తప్పూ చేయలేదని చెప్పారు. స్పీకర్ నాన్సీ పెలోసీ ఆధ్వర్యంలో తనపై గత సెప్టెంబర్‌లో జరిగిన అభిశంసన విచారణ పచ్చి బూటకమని అన్నారు. తాను పదవిలోకి వచ్చిన మొదటి రోజునుంచి డెమొక్రాట్లు అభిశంసించేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. 'డెమొక్రాట్ సభ్యులు మూడేండ్ల నుంచి నేను చేయని వాటిని చేసినట్టు చెప్పి, నాపై బోగస్ ఆరోపణలు చేస్తూ, కుంభకోణాలు మోపుతూ చివరికి కోట్ల మంది దేశభక్తులైన అమెరికన్లు బ్యాలెట్ ద్వారా ఇచ్చిన తీర్పును ఈ రాత్రి(బుధవారం) కాలరాయడానికి ప్రయత్నించారు' అంటూ మండిపడ్డారు. మిచిగన్‌లో జరిగిన ఒక సభలో ఆయన మాట్లాడుతూ, 'మూర్ఖురాలైన నాన్సీ పెలోసీకి చెందిన డెమొక్రాట్ సభ్యులు తమకు తాము శాశ్వతమైన అవమానాన్ని మూటగట్టుకున్నారు' అంటూ ఎద్దేవా చేశారు. తాను కూడా డెమొక్రాట్లలా వ్యవహరించి ఉంటే వారు అభిశంసనను ఎదుర్కోకుండానే నేరుగా జైలుకు వెళ్లి రెండేండ్లు గడిచిపోయి ఉండేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ అభిశంసన అమెరికాచరిత్రలో అత్యంత సిగ్గుచేటైన రాజకీయ పరిణామం అని వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి స్టెఫనీ గ్రీషమ్ వ్యాఖ్యానించారు. 'ఒక్క రిపబ్లికన్ మద్దతును కూడా వారు పొందలేదు. ట్రంప్ తప్పు చేసినట్టు ఒక్క సాక్ష్యాధారం కూడా చూపలేకపోయారు. చట్టవ్యతిరేకమై అంశాలను సభలో ప్రవేశపెట్టారు' అంటూ ఆమె ధ్వజమెత్తారు.

## ఇప్పటివరకు ముగ్గురు అధ్యక్షులు



ఆండ్రూ జాన్సన్



రిచర్డ్ నిక్సన్



బిల్ క్లింటన్

**అమెరికా** చరిత్రలో డొనాల్డ్ ట్రంప్‌తో కలిపి ఇప్పటివరకు ముగ్గురు అధ్యక్షులు అభిశంసనకు గురయ్యారు. వాటర్‌గేట్ కుంభకోణంలో రిచర్డ్ నిక్సన్ కూడా అభిశంసనకు గురయ్యేవారే కానీ, అభిశంసన ప్రక్రియకు ముందే ఆయన అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు.

**ఆండ్రూ జాన్సన్**

అమెరికా చరిత్రలో మొదటిసారి 1868లో నాటి అధ్యక్షుడు ఆండ్రూ జాన్సన్ అభిశంసనకు గురయ్యారు. యుద్ధ శాఖ మంత్రిగా ఉన్న ఎడ్వర్డ్ స్టాంటన్‌ను పదవి నుంచి తొలిగించడంతో వివాదం మొదలైంది. జాన్సన్ ముందుగా స్టాంటన్‌ను సస్పెండ్ చేసి, ఆయన స్థానంలో వేరొకరిని నియమించారు. కానీ కాంగ్రెస్ జోక్యం చేసుకొని స్టాంటన్‌ను మళ్లీ నియమించింది. దీంతో జాన్సన్ ఈసారి ఆయనను పూర్తిగా పదవి నుంచి తొలిగించారు. దీనిపై ప్రతినిధుల సభ జాన్సన్‌ను 126:47 ఓట్లతో అభిశంసించింది.

**రిచర్డ్ నిక్సన్**

ఆండ్రూ జాన్సన్ అభిశంసన జరిగి వంద సంవత్సరాలు దాటిన తరువాత మరో అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ అభిశంసన ముప్పును ఎదుర్కొన్నారు. 1974లో జరిగిన వాటర్‌గేట్ కుంభకోణం నేపథ్యంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణ మీద నిక్సన్‌పై సభా కమిటీ విచారణ జరిపేందుకు ప్రతినిధుల సభ 410:4 ఓట్లతో ఆమోదం తెలిపింది. అయితే సభ ఆయనను అభిశంసించకముందే నిక్సన్ తన పదవికి రాజీనామా చేశారు.

**బిల్ క్లింటన్**

అమెరికాలో అభిశంసనకు గురైన రెండో అధ్యక్షుడు బిల్ క్లింటన్. 1994లో పాలా జోన్స్ అనే మహిళ ఆయనపై లైంగిక వేధింపుల కేసు పెట్టింది.1998 జనవరిలో జోన్స్ కేసులో విచారణ సందర్భంగా.. మోనికా లెవెన్‌స్కీతో తనకు వివాహేతర సంబంధం లేదని క్లింటన్ ప్రమాణం చేసి చెప్పాడు. 1998 జూలైలో లెవెన్‌స్కీతో వివాహేతర సంబంధంపై అబద్ధం చెప్పానని ఒప్పుకున్నాడు. అక్టోబర్‌లో.. క్లింటన్‌తో జరిపిన సంభాషణల రికార్డులను లెవెన్‌స్కీ బయటపెట్టారు. దీంతో ప్రతినిధుల సభ 1998 డిసెంబర్ 11న క్లింటన్‌ను 228-206 ఓట్ల మెజారిటీతో అభిశంసించింది. కానీ సెనేట్‌లో క్లింటన్ 55:45 ఓట్లతో నెగ్గుకొచ్చారు.

### ఐరాస పర్యవేక్షణలో

## రెఫరెండానికి సిద్ధమా?

- ఓడిపోతే గద్దె దిగాలి
- మోదీ సర్కారుకు మమత సవాల్



**కోల్‌కతా, డిసెంబర్ 19:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ) అమలు కోసం ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణలో ప్రజాభిప్రాయ సేకరణ(రెఫరెండం) నిర్వహించడానికి సిద్ధమా అని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మోదీ సర్కారుకు సవాల్ విసిరారు. రెఫరెండంలో ఓడిపోతే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకొచ్చిన సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా మమత వరుసగా మూడో రోజు గురువారం కోల్‌కతాలో నిర్వహించిన నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. 'బీజేపీకి మెజారిటీ ఉన్నంత మాత్రాన నచ్చింది చేస్తామంటే కుదరదు. బీజేపీకి దమ్ముంటే.. సీఏఏ, ఎన్నార్సీ కోసం ఐరాస పర్యవేక్షణలో రెఫరెండం జరపాలి. ప్రజల మద్దతును వాళ్లు కూడగట్టకపోతే సర్కారు నుంచి దిగిపోవాలి' అని మమత అన్నారు. సీఏఏకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన ప్రదర్శనలను హిందూ, ముస్లింల మధ్య పోరాటంగా ఏమార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని ఆమె ఆరోపించారు. నేరస్థులు, అవినీతిపరులను సాధువులుగా మార్చేందుకు బీజేపీ ఓ వాషింగ్ మెషిన్‌గా పనిచేస్తున్నదని మమత మండిపడ్డారు.





నిరసన ప్రదర్శనకు అనుమతించాలంటూ ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో పోలీసులకు గులాబీపూలు అందిస్తున్న నిరసనకారులు.. అహ్మదాబాద్‌లో గాయపడిన పోలీసు

## నాడు మన్మోహన్ సమర్థించారు

### 2003 నాటి ప్రసంగం వీడియోను విడుదల చేసిన బీజేపీ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 19:** పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో బీజేపీ ఎదురుదాడికి దిగింది. 2003లో వాజపేయి హయాంలో రాజ్యసభలో కాంగ్రెస్ పక్షనేతగా ఉన్న మన్మోహన్‌సింగ్ ఉపన్యాసానికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఆ వీడియోలో పౌరసత్వ సవరణ బిల్లును మన్మోహన్ సమర్థిస్తూ మాట్లాడినట్లు ఉన్నది. బంగ్లాదేశ్ తదితర దేశాల నుంచి భారత్‌కు శరణార్థులుగా వచ్చిన వారికి భారత పౌరసత్వం ఇవ్వడానికి చాలా ఉదారమైన విధానాన్ని పాటించాల్సిన అవసరం ఉన్నదని మన్మోహన్ సింగ్ ఆ వీడియోలో చెప్పారు. 2003లో పౌరసత్వ సవరణ బిల్లుపై చర్చకు సంబంధించిందే ఈ వీడియో. అయితే నాడు శరణార్థులకు పౌరసత్వం ఇవ్వాలని సూచించిన కాంగ్రెస్.. నేడు వ్యతిరేకిస్తున్నదని బీజేపీ విమర్శించింది.

## నాటికీ నేటికీ పోలికేమిటి: కాంగ్రెస్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 19:** బంగ్లాదేశ్ నుంచి వచ్చిన మైనారిటీలకు పౌరసత్వం ఇవ్వవచ్చంటూ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ 2003లో చేసిన వ్యాఖ్యల వీడియోను బీజేపీ బయటపెట్టడంపై కాంగ్రెస్ మండిపడింది. నేటి ఉద్రిక్త పరిస్థితుల్లో అటువంటి పోలికలు తేవడం 'బూటకం, మోసం' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ ధ్వజమెత్తారు. ఇతర దేశాల నుంచి వచ్చిన మైనారిటీలకు పౌరసత్వం ఇచ్చేందుకు వాజపేయి, మన్మోహన్‌సింగ్ సర్కార్ సహా గత ప్రభుత్వాలేవీ చట్టాన్ని మార్చలేదని గుర్తు చేశారు. 'ఓ నోటిఫికేషన్ ద్వారా కొంతమందికి పౌరసత్వంఇ వ్వవచ్చు. కానీ మీరు ఏకంగా కొత్త చట్టాన్ని తెచ్చారు' అని విమర్శించారు.

# జనాగ్రహం!



మంగళూరులో పోలీసుల కాల్పులు

- దేశవ్యాప్తంగా కొనసాగుతున్న సీఏఏ వ్యతిరేకత
- అట్టుడికిన ఢిల్లీ.. మొబైల్ సేవల నిలిపివేత, 19 మెట్రో స్టేషన్లు మూత
- కర్ణాటక, యూపీ, బీహార్, గుజరాత్‌లో హింసాత్మక ఘటనలు
- మంగళూరులో ఇద్దరు, లక్నోలో ఒకరు మృతి
- చరిత్రకారుడు రామచంద్రగుహ, యోగేంద్ర యాదవ్ అరెస్ట్



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ప్రదర్శనకు భారీగా హాజరైన నిరసనకారులు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 19:** పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీతోపాటు బీహార్, యూపీ, కర్ణాటక, గుజరాత్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసులపైకి రాళ్లదాడులు, నిరసనకారులపై లాఠీచార్జీలు, కాల్పులతో ప్రధాన నగరాలు రణరంగంగా మారాయి. మంగళూరులో జరిగిన ఘర్షణలో ఇద్దరు, లక్నోలో ఒకరు మృతిచెందారు. అదేసమయంలో పశ్చిమబెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతియుత వాతావరణం కనిపించింది. హైదరాబాద్‌లోనూ శాంతియుతంగా ర్యాలీలు నిర్వహించారు.

**అట్టుడికిన దేశ రాజధాని**

పౌరచట్టానికి వ్యతిరేకంగా దేశరాజధాని ఢిల్లీ గురువారం కూడా అట్టుడికింది. ర్యాలీలు నిర్వహిస్తామన్న విద్యార్థిసంఘాలు, వామపక్ష పార్టీల ప్రకటన నేపథ్యంలో అనేక ఆంక్షలు విధించారు. పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు మొబైల్ సేవలను నిలిపివేశారు. ఎర్రకోట ప్రాంతంలో 144 సెక్షన్‌ను ధిక్కరించి వందల మంది తరలిరాగా పోలీసులు వారందరినీ బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. జంతర్ మంతర్, సునేహ్రి మసీదు ప్రాంతంలో వేల మంది నిరసనకారులు గుమిగూడారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ మెట్రో రైలు సంస్థ 19 స్టేషన్లను మూసివేసింది. ఆందోళనకారులు ఎన్‌హెచ్-8 సహా పలు హైవేలను దిగ్బంధించడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆందోళనలు, ట్రాఫిక్ జామ్ వల్ల సిబ్బంది సమయానికి రాకపోవడం తదితర కారణాలతో ఇండిగో విమానయాన సంస్థ 19 విమానాలను రద్దుచేయగా, పలు సంస్థలకు చెందిన 16 విమానాలు ఆలస్యంగా నడిచాయి.

**యూపీ రణరంగం**

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో భారీ హింస చోటుచేసుకుంది. పరివర్తన్ చౌక్‌లో నిరసనకారులు విధ్వంసం సృష్టించారు. నాలుగు మీడియా వ్యాన్లు, మూడు బస్సులు, 10 కార్లు, 20 బైక్‌లకు నిప్పు పెట్టారు. వారిని అదుపుచేసేందుకు పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒక పౌరుడు మృతిచెందాడు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కుమార్ లల్లూను పోలీసులు అరెస్ట్‌చేశాయి. మదేయ్‌గంజ్ ప్రాంతంలో పోలీస్ ఔట్‌పోస్ట్‌కు, అక్కడున్న వాహనాలకు నిప్పు పెట్టారు. సమాజ్‌వాదీ, కాంగ్రెస్ పార్టీల నేతలు అసెంబ్లీ భవనం ముందు నిరసన తెలిపారు. సంభాల్ జిల్లాకేంద్రంలో ఒక ఆర్టీసీ బస్సుకు నిరసనకారులు నిప్పుపెట్టారు. కుషీనగర్‌లో ఆందోళనకారులు పోలీసులపైకి రాళ్లురువ్వారు. బెనారస్ హిందూ యూనివర్సిటీకి చెందిన దాదాపు 20 మంది విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**కర్ణాటకలో ఇద్దరు మృతి**

సీఏఏకు వ్యతిరేకంగా కర్ణాటకలో భారీ నిరసనలు కొనసాగాయి. మంగళూరులో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య ఘర్షణ చెలరేగింది. దీంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు పౌరులు మృతిచెందారు. 20 మంది పోలీసులు గాయపడ్డారు. నగరంలోని బస్‌డిపోపై నిరసనకారులు విరుచుకుపడి రాళ్లదాడి చేశారు. బెంగళూరులో సీపీఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. టౌన్‌హాల్ ప్రాంతంలో నిషేధాజ్ఞలను ఉల్లంఘించి నిరసనలో పాల్గొన్న చరిత్రకారుడు రామచంద్ర గుహను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మైసూరు, బళ్లారి, హుబ్బళ్లి, కలబురగి, హసన్ తదితర ప్రాంతాల్లోనూ నిరసనలు కొనసాగాయి. బెంగళూరులోని ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో శనివారం రాత్రి వరకు 144 సెక్షన్ కొనసాగిస్తున్నట్టు అధికారులు చెప్పారు.

**బీహార్‌లో ఉద్రిక్తత**

బీహార్‌లో జన్ అధికార్ పార్టీ, వివాదాస్పద ఎంపీ పప్పూయాదవ్ ఆధ్వర్యంలో వందల మంది నిరసనకారులు పాట్నాలోని రాజేంద్ర నగర్ రైల్వేస్టేషన్‌ను ముట్టడించారు. ఓ అంబులెన్స్‌ను అడ్డుకొని ధ్వంసం చేశారు. జెహనాబాద్ జిల్లాలో హైవేలను దిగ్బంధించారు.

- గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిరసనకారులు పోలీసులపై దాడిచేశారు. ఈ ఘటనలో దాదాపు 12 మంది పోలీసులు గాయపడ్డారు. షా అలంలో టియర్ గ్యాస్ ప్రయోగించారు.
- ముంబైలోని ఆగస్ట్ క్రాంతి మైదాన్‌లో కాంగ్రెస్, ఎన్సీపీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. శివసేన పాల్గొనలేదు.
- కొన్నాళ్లుగా హింసతో అట్టుడుకుతున్న పశ్చిమబెంగాల్, అసోం, మేఘాలయ తదితర ప్రాంతాల్లో గురువారం శాంతియుత వాతావరణం నెలకొన్నది. గౌహతి హైకోర్టు ఆదేశం మేరకు అసోంలో శుక్రవారం నుంచి ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.
- మధ్యప్రదేశ్‌లో ముందస్తుగా 44జిల్లాల్లో 144 సెక్షన్ విధించారు.
- పశ్చిమబెంగాల్‌లో రైల్వే ఆస్తుల ధ్వంసంపై రాష్ట్రప్రభుత్వానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్టు రైల్వేశాఖ ప్రకటించింది.

### పలువురు ప్రముఖుల నిర్బంధం



బెంగళూరులో రామచంద్రగుహ



ఢిల్లీలో యోగేంద్ర అరెస్ట్

ఢిల్లీలో నిరసనల్లో పాల్గొనడానికి ప్రయత్నించిన వివిధ పార్టీల నేతలు సీతారాం ఏచూరి, డీ రాజా, బృందా కారత్, నీలోత్పల్ బసు, అజయ్ మాకెన్, సందీప్ దీక్షిత్, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, స్వరాజ్ అభియాన్ సంస్థ అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్, విద్యార్థి నేతలు ఉమర్ ఖలీద్, సాయి బాలాజీ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'స్వాతంత్ర్య సమరయోధులు అష్ఫఖుల్లా ఖాన్, రామ్‌ప్రసాద్ బిస్మిల్ వర్ధంతి రోజే తనను అరెస్ట్ చేయడం గౌరవంగా భావిస్తున్నా' అని యోగేంద్ర యాదవ్ ట్వీట్ చేశారు. బెంగళూరులో చరిత్రకారుడు రామచంద్ర గుహను అదుపులోకి తీసుకున్నారు. 'ప్రజా నిరసనను చూసి కేంద్రం భయపడింది' అని గుహ వ్యాఖ్యానించారు.

### అమలుచేసి తీరుతాం



**పొరుగు** దేశాల నుంచి భారత్‌కు శరణార్థులుగా వచ్చిన వాళ్లు దాదాపు 28-30 ఏండ్లుగా ఇక్కడ నివసిస్తున్నారు. వాళ్లకు భారత పౌరసత్వం లేకపోవడంతో పిల్లలను పాఠశాలల్లో చేర్చలేకపోతున్నారు. సొంతిల్లు కొనుక్కోలేకపోతున్నారు. వారి బాధలను దృష్టిలో ఉంచుకొనే శరణార్థులకు పౌరసత్వం ఇచ్చి తీరాలని నిర్ణయించాం. అందుకే సీఏఏను తీసుకొచ్చాం. కానీ ప్రతిపక్షాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. అయినా మేము వెనుకడుగు వేసేదిలేదు. సీఏఏను అమలు చేస్తాం. ఎన్నార్సీనీ తీసుకొస్తాం'

– జేపీ నడ్డా, బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు



'**లక్నో**, సంభల్‌లో హింసపై కఠిన చర్యలు చేపడుతాం. ప్రజాఆస్తులకు నష్టం కలిగించిన వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటాం. వాటిని వేలం వేసి నష్టాన్ని భర్తీ చేస్తాం. హింసకు పాల్పడిన వారిని సీసీటీవీల ద్వారా గుర్తించి, వారిపై ప్రతీకారం తీర్చుకుంటాం. సీఏఏ ఏ మతం లేదా వర్గానికి వ్యతిరేకం కాదు. ఇతర దేశాల నుంచి వచ్చిన శరణార్థులకు రక్షణగా, సహాయంగా ఉంటుంది. సీఏఏ వ్యతిరేకత పేరుతో కాంగ్రెస్, ఎస్పీ, వామపక్ష పార్టీలు దేశాన్ని అగ్నిగుండంగా మార్చాయి'

–ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్

**ఇతర** దేశాల నుంచి శరణార్థులుగా వచ్చిన హిందువులకు ఎక్కడ ఆశ్రయం కల్పిస్తారు? దీని గురించి మీకేమైనా ప్రణాళిక ఉన్నదా? మహారాష్ట్ర-కర్ణాటక మధ్యనున్న సరిహద్దు జిల్లా బెళగావి వాస్తవానికి మా రాష్ట్రానికి చెందినది. కానీ ప్రస్తుతం అది కర్ణాటకలో ఉన్నది. బెళగావి కోసం మేము పోరాడున్నా కేంద్రం మాత్రం కర్ణాటకకే అండగా ఉన్నది.

–ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర సీఎం

## హైదరాబాద్‌లో శాంతియుత నిరసనలు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** సీఏఏకు వ్యతిరేకంగా గురువారం హైదరాబాద్‌లోని పలుచోట్ల వివిధ సంఘాల ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. చార్మినార్, మక్కామసీద్ వద్ద పలు ముస్లిం సంఘాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా 33 మంది మహిళలుసహా 50మందికి పైగా అదుపులోకి తీసుకున్నామని దక్షిణ మండల ఇంచార్జి డీసీపీ అవినాశ్ మహంతి తెలిపారు. నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద వివిధ సంఘాలు నిర్వహించిన ర్యాలీలో ప్రొఫెసర్లు కోదండరాం, హరగోపాల్ పాల్గొన్నారు. సీఏఏను రద్దు చేయాలని, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసుల లాఠీ ఛార్జీ ఘటనపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పోలీసులు వారిని అడ్డుకొని మొయినాబాద్ స్టేషన్‌కు తరలించారు. ఉస్మానియా యూనివర్సిటీ లా విద్యార్థులు.. లా కాలేజీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు ర్యాలీ నిర్వహించారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నాంపల్లిలోని కేర్ హాస్పిటల్ చౌరస్తా నుంచి పబ్లిక్ గార్డెన్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రపంచంలో ఎక్కడా సీఏఏ వంటి చట్టం లేదని నారాయణ మండిపడ్డారు. ర్యాలీలకు అనుమతి లేనందున పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.



నాంపల్లిలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణను అరెస్టు చేస్తున్న పోలీసులు




క్రిస్మస్ వేడుకల సందర్భంగా గురువారం రాత్రి వనపర్తి జిల్లా కేంద్రంలోని దాచలక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున క్రిస్మస్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. అనంతరం క్రైస్తవులతో కలిసి విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్వేతామొహంతి, ట్రైనీ కలెక్టర్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- వనపర్తి కల్చరల్

## సమత కేసులో అభియోగాలు నమోదు

**ఆదిలాబాద్, నమస్తేతెలంగాణప్రతినిధి:** సమత కేసులో నాలుగో రోజైన గురువారం కూడా ఆదిలాబాద్ ప్రత్యేక కోర్టులో విచారణ కొనసాగింది. ఈ కేసులో ముగ్గురు నిందితులు షేక్ బాబా, షేక్ షాబొద్దీన్, షేక్ మగ్దూమ్‌లను పోలీసులు బందోబస్తు నడుమ ప్రత్యేక కోర్టుకు తీసుకొచ్చారు. ముగ్గురు నిందితులపై కోర్టు నేరారోపణ అభియోగాలను ఖరారు చేసింది. నిందితులను విచారించిన కోర్టు.. వారు నేరాన్ని ఒప్పుకోకపోవడంతో నేరారోపణ అభియోగాలను నమోదు చేసింది. వారి తరఫున న్యాయవాది డిశ్చార్జి పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం కేసు శుక్రవారానికి వాయిదా పడింది. ఈ కేసులో సాక్షులను ప్రవేశపెట్టేందుకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలున్నాయి. కేసు విచారణ అనంతరం నిందితులను బందోబస్తు మధ్య ఆదిలాబాద్ జైలుకు తరలించారు.

**కేసులో సరైన సాక్ష్యాలు లేవు: న్యాయవాది రహీం**

నిందితుల తరఫున న్యాయవాది రహీం కోర్టులో వాదనలు వినిపించారు. నిందితులను పోలీసులు ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని కోర్టుకు తెలిపారు. పోలీసులు చేసిన అభియోగాలన్నీ నిరాధారమైనవని, ఈ కేసులో నిందితులకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాలు లేకపోయినా తప్పుడు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. నమోదైన నేరాభియోగాలను రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు డిశ్చార్జ్ పిటిషన్ వేయనున్నట్టు రహీం తెలిపారు.

## కరంటు షాక్‌తో రెండు జింకలు మృతి



**నారాయణఖేడ్, నమస్తే తెలంగాణ:** పంటల రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగలి రెండు కృష్ణ జింకలు మృత్యువాత పడిన ఘటన సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం చాప్టా(కె) శివారులో చోటుచేసుకున్నది. ప్రకాశ్‌రావు అనే రైతు అడవి పందుల నుంచి తన వరి పంటను కాపాడుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు బుధవారం రాత్రి కృష్ణజింకలు తగిలి మృతి చెందాయని నారాయణఖేడ్ అటవీశాఖ రేంజ్ అధికారి దేవీలాల్ తెలిపారు. జింకల కళేబరాలకు పోస్టుమార్టం చేసి, పొలం యజమాని ప్రకాశ్‌రావును అరెస్టు చేశామన్నారు.

## అడిషనల్ డీసీపీ అక్రమ ఆస్తులు 10 కోట్లు

- రెండు రోజులపాటు సోదాలు జరిపిన ఏసీబీ
- అరెస్టుచేసి రిమాండ్‌కు తరలింపు

**హైదరాబాద్‌సిటీబ్యూరో, నమస్తేతెలంగాణ:** సిద్దిపేట అదనపు డీసీపీ గోవిందు నరసింహారెడ్డి ఆదాయానికి మించిన ఆస్తుల లెక్కలను ఏసీబీ అధికారులు గురువారం తేల్చారు. రెండు రోజులుగా సాగిన సోదాల్లో దాదాపు రూ.5 కోట్లకుపైగా అక్రమంగా సంపాదించిన ఆస్తులను గుర్తించారు. మార్కెట్ విలు వ ప్రకారం రూ.10 కోట్లకుపైగానే ఉంటుందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. అక్రమ ఆస్తుల చిట్టా తేలడంతో ఏసీబీ అధికారులు గురువారం నరసింహారెడ్డిని అరెస్టు చేశారు. సిద్దిపేట, హైదరాబాద్, మహబూబ్‌నగర్, జహీరాబాద్, షాద్‌నగర్ అయ్యవారిపల్లెలోని నర్సింహారెడ్డి, ఆయన బం ధువుల ఇండ్లపై 48గంటలపాటు ఏసీబీ అధికారులు సోదా లు నిర్వహించారు. ఈ సోదాల్లో కేజీన్నర బంగారు ఆభరణాలు, రూ.5.33 లక్షల నగదు, రూ.6.37 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, గోల్కొండ ప్రాంతంలో ఖరీదైన విల్లా, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి, జహీరాబాద్‌లో 14 ప్లాట్లు, సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 20 ఎకరాల వ్యవసాయ భూమి, రెండు ఖరీదైన కార్లు ఉన్నట్టు గుర్తించారు. ప్రభుత్వపరంగా వీటి విలువ రూ.5.02 కోట్లుగా నిర్ధారించారు. నర్సింహారెడ్డిని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరుచగా చంచల్‌గూడ జైలుకు తరలించారు.

**తాండూరులోనూ సోదాలు**

**తాండూరు రూరల్:** అదనపు డీసీపీ నర్సింహారెడ్డికి వికారాబాద్ జిల్లా తాండూరు మండలం ఓగిపూర్ గ్రామంలో ఆస్తులు ఉన్నాయనే సమాచారం మేరకు ఏసీబీ అధికారులు పరిశీలించారు. ఏ మేరకు ఆస్తులున్నాయనే విషయమై వివరాలు వెల్లడి కాలేదు.





మేడారం జాతర అభివృద్ధి పనులను మంత్రికి వివరిస్తున్న కలెక్టర్, అధికారులు

## మేడారం జాతర పనుల్లో వేగం పెంచాలి

- భక్తుల కోసం 8,400 టాయిలెట్స్ నిర్మించాలి
- మంత్రి సత్యవతి రాథోడ్

**ములుగు ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** మేడారం జాతర పనుల్లో వేగం పెంచాలని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులను ఆదేశించారు. గురువారం జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కలెక్టర్ నారాయణరెడ్డి, ఐటీడీఏ పీవో చక్రధర్‌రావుతో కలిసి జాతర పనులను పరిశీలించారు. అనంతరం అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అధికారులతో మేడారం పనులపై సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మేడారం జాతరకు వచ్చే భక్తుల కోసం సకాలంలోఅన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జంపన్నవాగులో భక్తులు పుణ్య స్నానాలను ఆచరిస్తారని, వాగులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నీటి మట్టాలు ఒకే విధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 7 వేల మందికి వసతి సౌకర్యం కల్పించే విధంగా ఏడు షెడ్ల నిర్మాణం చేపట్టాలని చెప్పారు. వచ్చే ఫిబ్రవరి 5 నుంచి 8వరకు జరిగే ఈ జాతరకు కోటిన్నర మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో మేడారంలో 8,400 టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలని అన్నారు. భక్తులకు స్వచ్ఛమైన రక్షిత తాగు నీటి వసతిని 24 గంటల పాటు అందించాలన్నారు.

# వడ్డీలేని రుణాలివ్వాలి

- మహిళా సంఘాలకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని కేంద్రాన్ని కోరాం
- సీఎం కేసీఆర్ కృషితో ఎస్సారార్‌కు జలకళ
- అధిక ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి సారించాలి
- ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** 'ఆర్థిక మంత్రిగా ఉన్న మీరు దేశంలోని మహిళలందరికీ వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి' అని నిర్మలా సీతారామన్‌ను కోరినట్టు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనాన్ని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. సిద్దిపేటలో క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇటీవల ఢిల్లీలో జరిగిన రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశంలో ఆర్థిక మాంద్యం, ఆర్థిక క్రమశిక్షణ పైనే చర్చ జరిగిందన్నారు. వడ్డీ లేని రుణాలు దేశంలో కొన్ని జిల్లాలకే ఇస్తున్నారని, అన్ని జిల్లాలకు ఇవ్వాలని నిర్మలా సీతారామన్‌ను తాను కోరినట్టు వెల్లడించారు. దేశంలోని అన్ని స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వాలని, అప్పుడే దేశ మహిళలంతా ఆర్థిక స్వావలంబన సాధిస్తారని చెప్పానన్నారు. స్వయం సహాయక సంఘాలకిచ్చే మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశానని తెలిపారు. ఇందుకు అన్ని రాష్ట్రాల మంత్రులు కలిసి ప్రతిపాదించాలని నిర్మలా సీతారామన్ సూచించారని వివరించారు. మహిళలు 90 శాతం బ్యాంకులకు రు ణాలు కడుతున్నారని, ఆడవాళ్లకు రుణాలు ఇవ్వడం వల్ల ఉపాధి కార్యక్రమాలు చేపట్టడం వల్ల ఆర్థిక వ్యవస్థ బాగు పడుతుందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.



సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో మహిళా సంఘాలకు చెక్కు అందిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ నారదాసు, ఎమ్మెల్యే రసమయి తదితరులు

**ప్రాజెక్టుల నిర్మాణంతో కరువు దూరం**

అనంతగిరి(అన్నపూర్ణ), తోటపల్లి రిజర్వాయర్లతో బెజ్జంకి మండలంలో కరువు దూరమవుతుందని, చెరువులు, బోరు బావులు, కుంటల్లో నీళ్లు ఫుల్‌గా ఉంటాయని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మహిళలు పాడి వైపు దృష్టి సారించాలని, ప్రతి ఇంటికి రెండు ఆవులను పెంచుకోవాలని చెప్పారు. శనిగరం మధ్యతరహా ప్రాజెక్టులో ఎప్పటికీ నీరు ఉంటుందని ఎండా కాలంలోనూ నీళ్లు ఉంటాయని పేర్కొంటూ యాసంగి పంటకు కూడా నీరు అందుతుందన్నారు. సీఎం కేసీఆర్ వల్ల శ్రీరాజరాజేశ్వర జలాశయం జలకళను సంతరించుకున్నదని తెలిపారు. ఈ ప్రాంత రైతులు పత్తి, మక్కజొన్న, వరి పంటలు పండిస్తున్నట్టు వివరించారు. ఆరుతడి పంటలను సాగు చేసి డబ్బులు ఎక్కువగా సంపాదించవచ్చని సూచించారు. చిన్న చిక్కుడు, కీరదోస, మిర్చి, వంకాయ పంటలతో లక్షలు సంపాదించవచ్చన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలతో లాభసాటి వ్యవసాయం చేయాలని, అధిక ఆదాయం వచ్చే పంటలపై దృష్టి సారించాలని కోరారు. బెజ్జంకి మండలంలో మహిళా భవనాలు మంజూరు చేస్తామని తెలిపారు.

## హాజీపూర్ ఘటనపై సాక్షుల విచారణ

ఈనెల 26కు వాయిదా

**రామగిరి:** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్‌లో వరుస హత్యల కేసు నిందితుడు శ్రీనివాస్‌రెడ్డిని గురువారం నల్లగొండ జిల్లా కోర్టులో హాజరుపరిచారు. 44మంది సాక్షులను జడ్జి ముందుంచి వారానికి ఐదు రోజుల చొప్పున ఇప్పటివరకు 22 సార్లు ట్రయల్స్ చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు కంటే వేగంగా విచారణ జరిపారు. సాక్షులు చెప్పిన విషయాలను నిందితుడు శ్రీనివాసరెడ్డిని జడ్జి ప్రశ్నించగా సమాధానం ఇవ్వలేదు. దీంతో మిగతా విచారణ ఈనెల 26కు వాయిదా వేశారు. 29 అక్టోబర్ 2019నుంచి కోర్టులో విచారణ ప్రారంభం కాగా శ్రీనివాసరెడ్డిపై నమోదైన సెక్షన్లు 376/3... 366, 376/ఎ, 302, 201పై విచారణ సాగింది. ఈ నెల చివరిలోగా శిక్ష ఖరారయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. విచారణ అధికారిగా భువనగిరి డీసీపీ భుజంగరావు, స్పెషల్ పీపీగా రంగారెడ్డి కోర్టు పీపీ సామల రంగారెడ్డిని ప్రభుత్వం నియమించింది.

## ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం

- ఆగిఉన్న వాహనాన్ని ఢీకొన్న కంటెయినర్.. డ్రైవర్ మృతి

**దుండిగల్, నమస్తే తెలంగాణ:** ఔటర్ రింగ్‌రోడ్‌పై ప్రమాదంలో కంటెయినర్ డ్రైవర్ మృతి చెందాడు. తమిళనాడుకు చెందిన మర్దు పాండే (32) మహారాష్ట్రలోని పుణెలో పార్సిల్‌లోడ్‌తో హైదరాబాద్ శివారు కొంపల్లికి బయలుదేరాడు. గురువారం తెల్లవారుజామున పటాన్‌చెరువు వద్ద ఔటర్ ఎక్కి దుండిగల్ ఎగ్జిట్‌కు కొద్దిదూరంలో రోడ్డుపక్కన నిలిపి ఉంచిన గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టాడు.డ్రైవర్ పాండే రెండుకాళ్లు ఛిద్రమయ్యాయి. సూరారంలో దవాఖానకు తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు.

**కంటెయినర్– వ్యాన్ ఢీ: ఇద్దరి దుర్మరణం**

**డిచ్‌పల్లి, నమస్తేతెలంగాణ:** నిజామాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఆర్మూర్‌కు చెందిన షేక్ కరీం(35), ఎస్‌కే ముజాయిద్ అలియాస్ ముజ్జు(22), రమేశ్ కలిసి కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం నుంచి కోళ్ల వ్యాన్‌తో ఆర్మూర్‌కు బయలుదేరారు. సాంపల్లి క్రాస్‌వద్ద భారీ కంటెయినర్ వాహనం రోడ్డు క్రాస్ చేస్తుండగా, వీరి వ్యాన్ ఢీకొన్నది. ప్రమాదంలో కరీం, ముజ్జు అక్కడికక్కడే మృతి చెందారు.



యాగశాలలో గోమాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్, యాగ నిర్వాహకులు

## వైభవంగా కొనసాగుతున్న అతిరుద్ర యాగం

**రెడ్డికాలనీ(వరంగల్ అర్బన్):** హన్మకొండ హయగ్రీవాచారి మైదానంలో నిర్వహిస్తున్న అతిరుద్ర యాగం వైభవంగా కొనసాగుతున్నది. ఐదో రోజైన గురువారం పలువురు ప్రముఖులు యాగంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైదిక నిర్వాహకులు ఫణిశశాంక్‌శర్మ, గోపికృష్ణలు మాట్లాడుతూ.. చారిత్రక వరంగల్ నగరంలో 50 ఏండ్ల తర్వాత యాగ నిర్వాహకులు తాటిపల్లి శ్రీనివాస్–రోజారాణి ఆధ్వర్యంలో గంగు ఉపేంద్రశర్మ పర్యవేక్షణలో అతిరుద్ర యాగం నిర్వహించడం గొప్ప అనుభూతి అన్నారు. పవిత్ర శత చండీ యాగం విశేష పూజలు జగన్మాతను ఆరాధించడం కోసం చండీ పారాయణం నిర్వహించి హోమం నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్–రేవతి దంపతులు యాగశాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తదితరులు పూజలు చేశారు. యాగశాల ప్రాంగణంలో సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు త్రిదండి రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో యాగ ప్రాంగణంలో లక్ష్మీనారాయణ స్వాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

# ఆర్టీసీకే శఠగోపం

- బస్‌పాస్‌ల జారీలో మాయాజాలం
- ప్రైవేట్ ఏజెన్సీ ఆపరేటర్ల నిర్వాకం
- స్టూడెంట్ పాస్‌ల పేరిట జనరల్ పాస్‌ల జారీ
- డబ్బులు దండుకుంటున్న ఆపరేటర్లు
- వరంగల్ రీజియన్‌లో వెలుగులోకి..

**సుబేదారి(వరంగల్ అర్బన్):** ఆర్టీసీకే శఠగోపం పెడుతున్నారు బస్‌పాస్ జారీ చేసే ఆపరేటర్లు. విద్యార్థులకు ఇస్తున్న రాయితీని అడ్డుపెట్టుకొని.. బస్‌పాస్‌లను జారీ చేసే ఏజెన్సీ నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నారు. ఏకంగా సాఫ్ట్‌వేర్‌ను మార్చేసి పెద్ద మొత్తంలో దండుకుంటున్నారు. గురువారం ఈ వ్యవహారం వరంగల్ రీజినల్‌లో వెలుగుచూసింది. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలో అడ్మిషన్ పొందిన విద్యార్థులలో బస్‌పాస్ అవసరం ఉన్నవారికి వారి పేర్లతో జాబితాను సదరు విద్యా సంస్థల వారు ఆన్‌లైన్‌లో స్థానిక డిపో మేనేజర్ కార్యాలయానికి పంపిస్తారు. ఈ జాబితా ఆధారంగా విద్యార్థులకు బస్‌పాస్‌లు జారీ చేస్తారు. బస్‌పాస్‌లు జారీచేసే ప్రక్రియను ఆర్టీసీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నెటెక్సల్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ కాంట్రాక్టు పొందింది. ఈ ఏజెన్సీ 2017 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల వద్ద కౌంటర్ల ద్వారా అన్ని రకాల పాస్‌లను జారీ చేస్తున్నది. ఇక్కడ పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు స్టూడెంట్ బస్‌పాస్‌ల పేరుతో అక్రమ సంపాదనకు తెగబడ్డారు.

**ఎడిట్ ఆప్షన్‌తో..**

బస్‌పాస్‌ల జారీ కౌంటర్‌లో షిఫ్టులవారీగా పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు ఎక్కడా అనుమానం రాకుండా సాఫ్ట్‌వేర్‌ను మార్చి డబ్బులు లాగుతున్నారు. కొందరు విద్యార్థులు ఒకటి, రెండు నెలలు డిపో కౌంటర్ వద్ద డబ్బులు చెల్లించి పాస్ తీసుకొని, తర్వాత నెలనుంచి రెన్యువల్ చేసుకోలేని విద్యార్థుల జాబితాను సదరు ఏజెన్సీ కంప్యూటర్ ఆపరేటర్లు దగ్గర పెట్టుకుంటారు. డిపోకు సీజన్, నెల వారీ బస్‌పాస్‌ల కోసం వచ్చేవారి నుంచి స్టూడెంట్ పేర్ల మీద కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేసి, స్టూడెం ట్ బస్‌పాస్ మీద ఉన్న రేట్‌ను ఆర్టీసీకి ఆన్‌లైన్‌లో చెల్లించి, తర్వాత ఎడిట్ ఆప్షన్‌లోకి వెళ్లి సీజన్, నెల టికెట్ ధరలను తీసుకుంటున్నారు. ఇలా కొన్నాళ్లుగా ఈ దందా ఆర్టీసీ డిపోల్లో కొనసాగుతున్నది. ఈ వ్యవహారాన్ని పసిగట్టిన ఓ వ్యక్తి లిఖితపూర్వకంగా వరంగల్ ఆర్‌ఎంకు ఫిర్యాదు చేయడంతో అధికారులు వరంగల్ డిపో–1లో విచారణ చేయగా నిజమేనని తేలిం ది. దీంతో ఇక్కడ పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు రాకేశ్, శ్రీకాంత్, వినయ్, అశ్విన్‌పై డీఎం సురేశ్ గురువారం హన్మకొండ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవీందర్ తెలిపారు. స్టూడెంట్ పాస్‌ల పేరుతో సీజన్, నెల వారీ పాస్ లు ఇస్తూ ఒక్కరోజే రూ.9,400 అక్రమంగా సంపాదించినట్టు ఆర్టీసీ అధికారుల విచారణలో తేలింది. హన్మకొండ డిపో బస్‌పాస్ కౌంటర్ వద్ద ఇదే తరహాలో అక్రమాలు వెలుగులోకి రావడంతో అక్కడ పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లపై డీఎం సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ డిపోల్లో విచారణ చేపడితే ఈ తరహా మోసం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

## ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతం

యువకుడి దుర్మరణం

**దామరచర్ల:** పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి పర్యటన సందర్భంగా స్వాగత ఫ్లెక్సీ కడుతూ ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలొదిలాడు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలో గురువారం ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వీర్లపాలెంలో పర్యటనకు వస్తున్న నల్గొండ ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు ఉత్త్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతూ మండల నాయకులు ఫ్లెక్సీలు కట్టేందుకు ఉపక్రమించారు. ఈ క్రమంలో దామరచర్లకు చెందిన జానపాటి మహేశ్(23) బస్టాండులోని ఓ భవనంపైకి ఎక్కి ఫ్లెక్సీ కట్టేక్రమంలో 11 కేవీ విద్యుత్తు వైర్లకు తగిలి షాకుతో కుప్పకూలిపోయాడు. మిర్యాలగూడ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కొడుకు చనిపోయిన విషయాన్ని తెలుసుకున్న మహేశ్ తల్లిదండ్రులు, మంగమ్మ, సైదులు బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని న్యాయం చేయాలని నార్కట్‌పల్లి–అద్దంకి ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. పోలీసులు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. కాగా, ఈ ఘటనతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన రద్దు చేసుకున్నారు. మిర్యాలగూడ ఏరియా దవాఖానకు వెళ్లి మహేశ్ కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సాయం కింద రూ.లక్ష అందజేశారు.

## తేనెటీగల దాడిలో వృద్ధుడి మృతి

**తానూర్:** నిర్మల్ జిల్లా తానూర్‌కు చెందిన హర్కేకర్ పోతన్న (86) తేనెటీగల దాడిలో మృతి చెందాడు. హర్కేకర్ పోతన్న బుధవా రం ఇంటి దగ్గరలో ఉన్న పొలం వద్దకు వెళ్లి చెత్త కుప్పకు నిప్పు అంటించాడు. నిప్పు పెట్టిన ప్రాంతంలో చెట్టుకు తేనేపట్టు ఉండటంతో పెద్ద మొత్తంలో తేనెటీగలు పోతన్నపై దాడి చేశాయి. దూరం పరిగెత్తినా అవి వదలకపోవడంతో కుప్పకూలి పోయాడు. పక్కనే ఉన్న కుమారులు గమనించి భైంసా ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

## తల్లిని కడతేర్చిన కొడుకు

**మానకొండూర్ రూరల్:** ఓ వ్యక్తి క్షణికావేశంలో తల్లినే కడతేర్చాడు. ఈ ఘటన కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లిలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. సదాశివపల్లికి చెందిన మియాపురం తిరుపతి తన భార్య గీత, తల్లి మియాపురం లక్ష్మి(65)తో కలిసి నివసిస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి తిరుపతి సెల్‌ఫోన్ చూస్తుండగా భార్య అభ్యంతరం తెలపడంతో వీరి మధ్య గొడవ జరిగింది. వీరిని అదుపు చేసేందుకు లక్ష్మి ప్రయత్నించగా కోపోద్రిక్తుడైన తిరుపతి.. తల్లిని మంచంపై నుంచి కింద పడేశాడు. ఈ క్రమంలో అతని భార్య గీత తప్పించుకొని అదే గ్రామంలో ఉన్న ఆడపడుచు మాధవి వద్దకు పరుగెత్తింది. ఆడపడుచుతోపాటు చుట్టు పక్కల వారు వచ్చే సరికే తల్లిని జుట్టుపట్టి నేలకు పలుసార్లు మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తిరుపతి మానసిక పరిస్థితి సరిగాలేదని గమనించిన చుట్టుపక్కల వారు అతడిని పట్టుకొని కరీంనగర్ దవాఖానాకు తరలించారు. మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

# అభివృద్ధిలో రోల్ మోడల్‌గా తెలంగాణ

- సింగపూర్, గోవా తరహాలో సిరిసిల్లను తీర్చిదిద్దుతా
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తేతెలంగాణ, మెట్‌పల్లి రూరల్:** ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో చేపడుతున్న అభివృద్ధి పనులతో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. చుక్కనీరు లేని చోట 25 టీఎంసీల నీటిని నిల్వ చేసిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. టీహబ్, తదితర కార్యక్రమాలతో ప్రపంచ దేశాల దృష్టి తెలంగాణవైపు ఆకర్షించేలా ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ కృషి చేస్తున్నారన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పర్యటించారు. జిల్లా అధికారులతో కలిసి శ్రీరాజరాజేశ్వర జలాశయం బ్యాక్ వాటర్ ప్రాంతమైన రామప్ప గుట్ట, కరకట్టలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ కృషితో సిరిసిల్ల రాష్ట్రానికే ఆదర్శంగా మారిందన్నారు. సింగపూర్, గోవా తరహాలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి మానేరు బ్యాక్ వాటర్ భౌగోళికంగా అనువుగా ఉందని మంత్రి పేర్కొన్నారు. మానేరులో బోటింగ్, చిల్డ్రన్స్ పార్కు, రోప్‌వే, ఐలాండ్, కాటేజీలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట పంపుహౌస్‌ను కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి పరిశీలించారు. రాజేశ్వర్‌రావుపేట పంపుహౌస్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని,త్వరలోనే ఇక్కడకు సర్వే బృందాన్ని పంపిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, జిల్లాఅధికార ప్రతినిధి తోట ఆగయ్య తదితరులు ఉన్నారు.



సిరిసిల్లలో పర్యాటక కేంద్రం మ్యాప్‌ను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు ఎల్పీజీ పైపు లైన్

**వనపర్తి రూరల్:** కర్ణాటకలోని హసన్ నుంచి గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల మీదుగా హైదరాబాద్‌లోని చర్లపల్లి వరకు హెచ్‌పీసీఎల్ ఎల్పీజీ పైపు లైన్ ఏర్పాటు చేయనున్నట్టు హెచ్‌పీసీఎల్ కంపెనీ ప్రతినిధి వినోద్ తెలిపారు. గురువారం వనపర్తి మండలంలోని పెద్దగూడెం గ్రామ పంచాయతీలో హెచ్‌పీసీఎల్ కంపెనీ ప్రతినిధులు వినోద్, నాగిరెడ్డి, తాసిల్దార్ రాజేందర్‌గౌడ్ రైతులతో సమావేశమయ్యారు. పెద్దగూడెం శివారులో 8 ఎకరాలలో సెక్షన్ లైజింగ్ వాల్వ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ పైపులైన్ ఏర్పాటుతో రాష్ట్రంలో గ్యాస్ కొరత లేకుండా చేయాలన్న సంకల్పం నెరవేరుతుందని తెలిపారు.

## ఎస్సారార్‌కు గోదారి పరుగులు

- 23.085 టీఎంసీల నిల్వ
- లక్ష్మి పంప్‌హౌస్‌లో నడుస్తున్న నాలుగు పంపులు

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** కాళేశ్వరం ప్రాజెక్టు లింక్–2లోని నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో మోటర్లు నిరంతరాయంగా గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నాయి. గురువారం పెద్దపల్లి జిల్లా నందిమేడారంలోని నందిపంప్‌హౌస్‌లో 4, 5, 6వ మోటర్లు ఎత్తిపోశాయి. అక్కడి నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్‌కు చేరుకుంటున్నాయి. ఇక్కడి 1, 6, 7వ పంపులు ఎత్తిపోస్తుండటంతో గ్రావిటీ కాల్వ ద్వారా వరద కాల్వకు చేరుకుంటున్నాయి. ఇక్కడి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయం వైపు కాళేశ్వర జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. ఈనెల 5వ తేదీ నుంచి ఇప్పటివరకు గాయత్రి పంపుహౌస్ నుంచి 8.667 టీఎంసీల నీటిని ఎస్సారార్‌కు తరలించినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం ఆరు గంటల వరకు 23.085 టీఎంసీల నీరు నిలువ ఉన్నది. రివర్స్ స్లూయిస్ (తూముల) ద్వారా దిగువకు ఎల్ ఎండీకి 9,450 క్యూసెక్కుల నీరు చేరుతున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మి పంప్‌హౌస్‌లో గురువారం నాలుగు మోటర్లు ద్వారా సరస్వతి బరాజ్‌కు 8,680 క్యూసెక్కుల నీటిని తరలించారు. ఈ బరాజ్‌లో 7.39 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఇంజినీర్లు తెలిపారు.



టీఆర్‌ఎస్‌లో చేరిన సర్పంచులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

## ఆడబిడ్డలకు అండగా సీఎం కేసీఆర్

- మంత్రి జగదీశ్‌రెడ్డి

**శివాజీనగర్(నల్గొండ), సూర్యాపేట రూరల్:** సీఎం కేసీఆర్ ఆడబిడ్డలకు తండ్రిలా అండగా ఉంటున్నాడని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నల్లగొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. మొదట నల్గొండ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి నివాసంలో 329 మంది లబ్ధిదారులకు రూ.3.29 కోట్ల కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికలలో ఎలాంటి హామీ ఇవ్వనప్పటికీ ఆడపిల్లలు కుటుంబానికి భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టిందని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలుకాని సంక్షేమ పథకాలు ఒక్క తెలంగాణలో అమలవుతున్నాయని చెప్పారు. అనంతరం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీఆర్‌ఎస్ కార్యాలయంలో మంత్రి సమక్షంలో సూర్యాపేట మండలం కేటీఅన్నారం సర్పంచ్ బైరెడ్డి అలివేలుభీంరెడ్డి, కాసరబాద సర్పంచ్ కొల్లు రేణుక నరేశ్‌లతోపాటు కాంగ్రెస్, బీజేపీలకు చెందిన సుమారు 300 మంది కార్యకర్తలు టీఆర్‌ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో నల్గొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, సూర్యాపేట ఎంపీపీ, జెడ్పీటీసీలు రవీందర్‌రెడ్డి, జీడి భిక్షం, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, పెద్దిరెడ్డి రాజా తదితరులు పాల్గొన్నారు.

## సాంబార్ పాత్రలో పడి చిన్నారి దుర్మరణం

**గట్టు:** సాంబార్ పాత్రలో పడి ఓ చిన్నారి దుర్మరణం చెందింది. వివరాల్లోకి వెళితే.. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టులోని మానవపాడు బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు టిఫిన్ పెట్టిన తరువాత సిబ్బంది మధ్యాహ్న భోజనం కోసం వంట చేశారు. వేడిగా ఉన్న ఆహార పదార్థాల పాత్రలను వంట గది నుంచి పక్కనే ఉన్న డైనింగ్ హాల్‌కు తీసుకువచ్చారు. ఆ సమయంలో పాఠశాల అసిస్టెంట్ కేర్‌టేకర్ లక్ష్మి డైనింగ్ హాల్‌కు వెళ్లారు. వంటకు తీసుకున్న వస్తువులన్నింటినీ డైలీ రిజిస్టర్‌లో నమోదు చేస్తున్న సమయంలో ఆమె కూతురు రిష్మిక(3) పక్కనే ఉన్న సాంబార్ పాత్ర వద్దకు వెళ్లింది. పాత్రపై ఉన్న మూతను తోసి అందులో చేతులు పెట్టే ప్రయత్నం చేస్తుండగా జారి అందులో పడిపోయింది. గమనించిన సిబ్బంది పాపను బయటకు తీసేసరికే శరీరమంతా కాలిపోయి అపస్మారక స్థితిలోకి చేరింది. కర్నూల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది.



రిష్మిక (ఫైల్)




# జాక్‌పాట్ కమిన్స్

ఐపీఎల్ 13వ సీజన్ వేలం

| టాప్-5 స్వదేశీ క్రికెటర్లు | | టాప్-5 విదేశీ క్రికెటర్లు | |
|---|---|---|---|
| పీయూష్ చావ్లా | (6.75) | కమిన్స్ | (15.5) |
| వరుణ్ చక్రవర్తి | (4) | మ్యాక్స్‌వెల్ | (10.75) |
| ఉతప్ప | (3) | క్రిస్ మోరిస్ | (10) |
| ఉనాద్కత్ | (3) | కాట్రెల్ | (8.5) |
| యశస్వి జైస్వాల్ | (2.4) | కౌల్టర్ నైల్ | (8) |

(రూ.కోట్లలో)

## లీగ్‌లో అత్యధిక ధర పలికిన విదేశీ ఆటగాడిగా రికార్డు

### మ్యాక్స్‌వెల్, మోరిస్‌కు భారీ సొమ్ము.. కోట్లు కొల్లగొట్టిన కాట్రెల్, హెట్‌మైర్

**ప్రతిభకు పట్టంగట్టే ఐపీఎల్ వేలంలో ఆస్ట్రేలియా ఆటగాళ్లు అదరగొట్టారు. కంగారూ పేసర్ పాట్ కమిన్స్ (కోల్‌కతా నైట్‌రైడర్స్) లీగ్ చరిత్రలో అత్యధిక ధర పలికిన విదేశీ ఆటగాడిగా నిలిస్తే.. మ్యాక్స్‌వెల్ కోసం పంజాబ్ పది కోట్లకు పైగా ఖర్చుపెట్టింది. ఎప్పట్లాగే వ్యూహాత్మకంగా వ్యవహరించిన చెన్నై.. పియూష్ చావ్లా కోసం అత్యధిక ధర వెచ్చిస్తే.. లైమ్‌లైట్‌లో లేని క్రిస్ మోరిస్ కోసం బెంగళూరు పది కోట్లు కేటాయించి ఆశ్చర్యపరిచింది. యువ సంచలనం యశస్వీ జైస్వాల్ 2.4 కోట్లు కొల్లగొడితే.. అండర్-19 సారథి ప్రియం గార్గ్ 1.9 కోట్లు ఖాతాలో వేసుకున్నాడు. మొత్తంగా వేలంలో జట్లన్నీ కలిపి ఆటగాళ్ల కోసం 140 కోట్లు కుమ్మరించాయి.**


గురువారం కోల్‌కతాలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌సీబీ కోచ్ మైక్ హెస్సెన్, కోల్‌కతా కోచ్ బ్రెండన్ మెకల్లమ్

**కోల్‌కతా:** పుష్కరకాలం పూర్తిచేసుకున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 13వ సీజన్ కోసం జరిగిన వేలం పాటలో ఆస్ట్రేలియా ఆటగాళ్ల పంట పండింది. కంగారూ పేసర్ పాట్ కమిన్స్ అత్యధికంగా రూ. 15.5 కోట్ల ధర పలుకగా.. మ్యాక్స్‌వెల్ రూ. 10.75 కోట్లు దక్కించుకున్నాడు. ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న కమిన్స్ ఇటీవలికాలంలో అద్భుతంగా రాణిస్తుండటంతో.. లీగ్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ విదేశీ ప్లేయర్‌కు పెట్టనంత భారీ మొత్తానికి కోల్‌కతా నైట్ రైడర్స్ అతడిని సొంతం చేసుకుంది. వేలం ఆరంభంలో కమిన్స్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య పోటీ నెలకొంది. సూపర్ పేస్‌కు తోడు అవసరమైతే బ్యాట్‌తోనూ రాణించగల ఆటగాడి కోసం రెండు ఫ్రాంచైజీలు ఎంత ఖర్చుపెట్టేందుకైనా వెనుకాడలేదు. దీంతో ధర పెరుగుతూ వెళ్లింది. చివర్లో పోటీకొచ్చిన కోల్‌కతా అత్యధిక ధరతో కమిన్స్‌ను సొంతం చేసుకుంది. ఇప్పటి వరకు జరిగిన వేలంపాటల్లో ఓ విదేశీ ఆటగాడి కోసం వెచ్చించిన అత్యధిక మొత్తం ఇదే కావడం గమనార్హం. గతంలో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ కోసం రైజింగ్ పుణె సూపర్‌జెయింట్స్ (2017) రూ. 14.50 కోట్లు కేటాయించింది.

**మ్యాక్స్‌కు మ్యాక్సిమమ్**

మానసిక ఒత్తిడి కారణంగా మూడు నెలల నుంచి క్రికెట్‌కు దూరంగా ఉంటున్న 31 ఏండ్ల మ్యాక్స్‌వెల్‌ను కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు దక్కించుకుంది. చేతిలో భారీ మొత్తం (రూ.42.70 కోట్లు)తో వేలానికి వచ్చిన పంజాబ్ అందుకు తగ్గట్లే ఖర్చుపెట్టింది. మ్యాక్స్ కోసం ఢిల్లీ ఫ్రాంచైజీ పోటీపడటంతో అతడి ధర అమాంతం పైకి ఎగబాకింది. ఆసీస్ పేసర్ కౌల్టర్ నైల్ కూడా భారీ ధర పలకడం విశేషం. నైల్ కోసం ముంబై ఇండియన్స్ రూ. 8 కోట్లు వెచ్చించింది. ఆస్ట్రేలియా పరిమిత ఓవర్ల కెప్టెన్ ఆరోన్ ఫించ్‌ను రూ.4.40 కోట్లకు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు చేజిక్కించుకుంటే.. ఆల్‌రౌండర్ స్టొయినిస్ రూ. 4.8 కోట్లకు ఢిల్లీ చెంతకు చేరాడు. మొన్నటి వరకు కోల్‌కతా తరపున ఓపెనింగ్ చేసిన క్రిస్ లిన్‌ను.. అతడి ప్రాథమిక ధర రూ.2 కోట్లతో ముంబై ఇండియన్స్ సొంతం చేసుకోగా.. హజల్‌వుడ్‌ను బేస్ ప్రైస్ రూ. 2 కోట్లకు చెన్నై చేజిక్కించుకుంది.




## పియూష్ పంట పండింది

భారత వెటరన్ స్పిన్నర్ పియూష్ చావ్లాను రూ. 6.75 కోట్లకు చెన్నై సూపర్ కింగ్స్ సొంతం చేసుకుంది. వేలంపాటలో ఆచితూచి వ్యవహరించే చెన్నై.. పియూష్ కోసం ఇంత భారీ మొత్తం ఖర్చు పెట్టడం ఆశ్చర్యం కలిగించినా.. మాస్టర్ మైండ్ ధోనీ ప్లాన్‌లో భాగంగానే ఈ ఎంపిక జరిగిందనేది అందరికీ అర్థమవుతున్నది. ఈసారి వేలంలో భారత ఆటగాడికి దక్కిన అత్యధిక మొత్తం ఇదే కావడం విశేషం. చాన్నాళ్లుగా కోల్‌కతా కీలక ఆటగాడిగా ఉన్న రాబిన్ ఊతప్పను రూ. 3 కోట్లు పెట్టి రాజస్థాన్ చేజిక్కించుకుంది. జైదేవ్ ఉనాద్కత్‌ను రూ. 3 కోట్లు పెట్టి రాజస్థాన్ తిరిగి దక్కించుకోగా.. అన్‌క్యాప్డ్ ప్లేయర్లలో వరుణ్ చక్రవర్తి కోసం కోల్‌కతా రూ. 4 కోట్లు కేటాయించింది.

**మోరిస్ ఊహించనంత..**

ఇటీవలి కాలంలో పెద్దగా ప్రభావం చూపలేకపోతున్న దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ క్రిస్ మోరిస్ అనూహ్య ధర పలికాడు. కోహ్లీ సారథ్యంలోని బెంగళూరు జట్టు.. మోరిస్ కోసం ఏకంగా పది కోట్లు వెచ్చించింది. వికెట్ తీయగానే సైనికుల తరహాలో సెల్యూట్ కొడుతూ సందడి చేసే వెస్టిండీస్ పేసర్ షెల్డన్ కాట్రెల్‌కు కూడా ఎవరూ ఊహించని విధంగా రూ. 8.50 కోట్లు దక్కాయి. 50 లక్షల బేస్ ప్రైస్‌తో వేలానికి వచ్చిన కాట్రెల్‌కు పంజాబ్ కోట్లు కట్టబెట్టింది. ఇటీవల నిలకడగా రాణిస్తున్న విండీస్ నయా హిట్టర్ షిమ్రాన్ హెట్‌మైర్‌ను రూ. 7.75 కోట్లు పోసి ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకుంది. మోర్గాన్‌ను రూ. 5.25 కోట్లతో కోల్‌కతా కొనుక్కుంది. అయితే.. కెప్టెన్‌గా మాత్రం దినేశ్ కార్తీక్‌నే కొనసాగిస్తామని.. మోర్గాన్ అతడికి సహాయ సహకారాలు అందిస్తాడని కోచ్ బ్రెండన్ మెక్కల్లమ్ పేర్కొన్నాడు.

**యువ ఆటగాళ్ల జోరు**

భారత అండర్-19 జట్టు ఆటగాళ్ల కోసం కూడా ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి. అందులో సంచలన ఆటగాడు యశస్వీ జైస్వాల్ (రాజస్థాన్ రాయల్స్) అత్యధికంగా రూ. 2.4 కోట్లకు అమ్ముడుపోగా.. యువ సారథి ప్రియం గార్గ్‌ను రూ. 1.9 కోట్లకు సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంతం చేసుకుంది. కార్తీక్ త్యాగిని రూ. 1.3 కోట్లకు రాజస్థాన్ దక్కించుకుంది.

**పూజారాకు మొండిచేయి**

భారత టెస్టు స్పెషలిస్టులు చతేశ్వర్ పుజారా, హనుమ విహారిని ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయలేదు. దక్షిణాఫ్రికా స్టార్ పేసర్ స్టెయిన్‌ను బేస్ ప్రైస్ రూ. 2 కోట్లకు బెంగళూరు తిరిగి సొంతం చేసుకుంది. ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన 14 ఏండ్ల యువ ఆటగాడు నూర్ అహ్మద్ కూడా అమ్ముడుపోలేదు. వేలంలో అత్యధిక వయసున్న ప్రవీణ్ తాంబే (48 ఏండ్లు)ను ప్రాథమిక ధర రూ.20 లక్షలకు కోల్‌కతా చేజిక్కించుకుంది.

**సన్‌రైజర్స్‌లో సందీప్**



హైదరాబాద్‌కు చెందిన బావనక సందీప్‌ను అతడి ప్రాథమిక ధర రూ.20 లక్షలకు సన్‌రైజర్స్ జట్టు సొంతం చేసుకుంది. ఐపీఎల్‌కు ఎంపిక కావడంపై సందీప్ ఆనందం వ్యక్తం చేశాడు. సన్‌రైజర్స్‌తో కలిసేందుకు ఉత్సుకతతో ఎదురు చూస్తున్నట్లు ట్విట్టర్‌లో పేర్కొన్నాడు.

**అయ్యో పాపం!**

గప్టిల్, గ్రాండ్‌హోమ్, లూయిస్, హోల్డర్, షై హోప్, బ్రాత్‌వైట్, ముస్తఫిజుర్, ఆండ్రూ టై, కటింగ్, జాంపా, ప్లంకెట్‌ను ఎవరు కొనుగోలు చేయలేదు.

| | |
|---|---|
| **సన్‌రైజర్స్ హైదరాబాద్** | |
| మిషెల్ మార్ష్ | 2 కోట్లు |
| ప్రియంగార్గ్ | 1.9 కోట్లు |
| విరాట్‌సింగ్ | 1.9 కోట్లు |
| అలెన్ | 50 లక్షలు |
| బావనక సందీప్ | 20 లక్షలు |
| సంజయ్ యాదవ్ | 20 లక్షలు |
| అబ్దుల్ సమద్ | 20 లక్షలు |
| **కోల్‌కతా నైట్‌రైడర్స్** | |
| ప్యాట్ కమిన్స్ | 15.5 కోట్లు |
| మోర్గాన్ | 5.25 కోట్లు |
| వరుణ్ చక్రవర్తి | 4.00 కోట్లు |
| బాంటన్ | 1.00 కోటి |
| రాహుల్ త్రిపాఠి | 60 లక్షలు |
| సిద్ధార్థ్ | 20 లక్షలు |
| ప్రవీణ్ తాంబే | 20 లక్షలు |
| నిఖిల్ శంకర్ | 20 లక్షలు |
| క్రిస్ గ్రీన్ | 20 లక్షలు |
| **కింగ్స్ ఎలెవన్ పంజాబ్** | |
| మ్యాక్స్‌వెల్ | 10.75కోట్లు |
| కాట్రెల్ | 8.5కోట్లు |
| క్రిస్ జోర్డన్ | 3.00 కోట్లు |
| రవి బిష్ణోయ్ | 2.00 కోట్లు |
| నీషమ్ | 50లక్షలు |
| దీపక్ హుడా | 50 లక్షలు |
| ఇషాన్ పొరెల్ | 20 లక్షలు |
| ప్రభ్‌సిమ్రన్ సింగ్ | 20 లక్షలు |
| తజిందర్ ధిల్లాన్ | 20 లక్షలు |
| **ముంబై ఇండియన్స్** | |
| కౌల్టర్ నైల్ | 8.00కోట్లు |
| క్రిస్ లిన్ | 2.00 కోట్లు |
| సౌరభ్ తివారీ | 50 లక్షలు |
| దిగ్విజయ్ దేశ్‌ముఖ్ | 20 లక్షలు |
| ప్రిన్స్ బల్వంత్ రాయ్ | 20 లక్షలు |
| మోహ్‌సిన్ ఖాన్ | 20 లక్షలు |
| **ఢిల్లీ క్యాపిటల్స్** | |
| హెట్‌మైర్ | 7.75కోట్లు |
| అలెక్స్ క్యారీ | 2.4కోట్లు |
| జేసన్ రాయ్ | 1.5కోట్లు |
| క్రిస్ వోక్స్ | 1.5కోట్లు |
| స్టొయినిస్ | 4.8కోట్లు |
| మోహిత్ శర్మ | 50 లక్షలు |
| తుషార్ దేశ్‌పాండే | 20 లక్షలు |
| లలిత్ యాదవ్ | 20 లక్షలు |
| **చెన్నై సూపర్‌కింగ్స్** | |
| పియూష్ చావ్లా | 6.75కోట్లు |
| సామ్ కరన్ | 5.5కోట్లు |
| హజిల్‌వుడ్ | 2.00 కోట్లు |
| సాయి కిషోర్ | 20 లక్షలు |
| **రాజస్థాన్ రాయల్స్** | |
| ఉతప్ప | 3.00 కోట్లు |
| ఉనాద్కత్ | 3.00 కోట్లు |
| యశస్వి జైస్వాల్ | 2.4 కోట్లు |
| కార్తీక్ త్యాగి | 1.3 కోట్లు |
| అండ్రూ టై | 1.00 కోట్లు |
| టామ్ కరాన్ | 1.00 కోట్లు |
| అనూజ్ రావత్ | 80 లక్షలు |
| మిల్లర్ | 75లక్షలు |
| ఒషానో థామస్ | 50 లక్షలు |
| అనిరుధ్ అశోక్ | 20 లక్షలు |
| ఆకాశ్ సింగ్ | 20 లక్షలు |
| **బెంగళూరు** | |
| క్రిస్ మోరిస్ | 10.00 కోట్లు |
| ఫించ్ | 4.4 కోట్లు |
| కేన్ రిచర్డ్‌సన్ | 4.00 కోట్లు |
| స్టెయిన్ | 2.00 కోట్లు |
| ఉదానా | 50 లక్షలు |
| షాబాజ్ అహ్మద్ | 20 లక్షలు |
| ఫిలిప్ | 20 లక్షలు |
| పవన్ దేశ్‌పాండే | 20 లక్షలు |

మొత్తం ఆటగాళ్లు **62** విదేశీ ప్లేయర్లు **29**

**ఏ దేశం వాళ్లెందరు..**

| | |
|---|---|
| భారత్ | 34 |
| ఆస్ట్రేలియా | 12 |
| ఇంగ్లండ్ | 7 |
| వెస్టిండీస్ | 4 |
| దక్షిణాఫ్రికా | 3 |
| న్యూజిలాండ్ | 1 |
| శ్రీలంక | 1 |

## పానీపూరి టు కరోడ్‌పతి




**క్రికెట్** ఆడేందుకు ఒకప్పుడు పానీపూరి అమ్ముకొని జీవనం సాగించిన యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్ శ్రమకు ప్రతిఫలం దక్కింది. దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేస్తున్న ఈ 17ఏండ్ల సంచలన బ్యాట్స్‌మన్‌ను ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ రూ.2.40కోట్లకు సొంతం చేసుకుంది. ముంబై ఇండియన్స్, కోల్‌కతా, పంజాబ్ జట్లు కూడా తీవ్రంగా ప్రయత్నించగా చివరికి యశస్విని రాజస్థాన్ దక్కించుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో జన్మించిన జైస్వాల్ క్రికెట్‌పై ఇష్టంతో 11ఏండ్ల వయసులోనే ఇంట్లో నుంచి వచ్చేసి ముంబైలో ఓ టెంట్‌లో ఏండ్ల తరబడి తలదాచుకున్నాడు. జీవనం కోసం పానీపూరీ అమ్మడంతో పాటు అనేక పనులు చేశాడు. అదే క్రమంలో ముంబైలోని ఆజాద్ మైదానంలో క్రికెట్ ప్రాక్టీస్ చేస్తూ వివిధ టోర్నీల్లో సత్తాచాటాడు. క్రమంగా ఎదుగుతూ దేశవాళీ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో ముంబై తరపున 154 బంతుల్లోనే డజను సిక్సర్ల సాయంతో అలవోకగా ద్విశతకం బాదాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో డబుల్ సెంచరీ చేసిన అత్యంత పిన్నవయస్కుడిగా రికార్డు సృష్టించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ సీజన్ లిస్ట్-ఏ క్రికెట్‌లో 112బ్యాటింగ్ సగటుతో అతడు 564 పరుగులు చేశాడు. వచ్చే ఏడాది ప్రారంభంలో దక్షిణాఫ్రికాలో జరిగే అండర్-19 ప్రపంచకప్‌కు యశస్వి జైస్వాల్ ఎంపికైన సంగతి తెలిసిందే. ''చాలా ఆనందంగా ఉంది. రాజస్థాన్ ద్వారా ఎంత వీలైతే అంత నేర్చుకోవాలనుకుంటున్నా' జైస్వాల్ అన్నాడు.

## పంజాబ్ కెప్టెన్‌గా రాహుల్



జట్టులో సమూల మార్పులు చేసిన పంజాబ్ కింగ్స్ ఎలెవెన్ వచ్చే ఏడాది సీజన్‌కు కెప్టెన్‌గా టీమ్‌ఇండియా ఓపెనర్ కేఎల్ రాహుల్‌ను నియమించింది. అతడిలో మంచి బ్యాట్స్‌మెన్‌ను మాత్రమే కాకుండా అద్భుతమైన సారథిని చూస్తారని పంజాబ్ జట్టు సహ యజమాని నెస్‌వాడియా బుధవారం ప్రకటించాడు. అతడి ఎంపికను అందరూ సమర్థించారని చెప్పాడు. కొత్త హెడ్‌కోచ్ అనిల్ కుంబ్లే సైతం యువ ఆటగాళ్లకే ప్రాధాన్యమిచ్చి వచ్చే సీజన్‌లో మంచి ఫలితాలు రాబట్టాలని పట్టుదలగా ఉన్నట్టు స్పష్టమైన సంకేతాలిస్తున్నాడు. స్వదేశంలో విండీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో రెండు అర్ధ శతకాలతో అదరగొట్టిన కేఎల్ రాహుల్.. రెండో వన్డేలోనూ సెంచరీ చేసి కొన్నాళ్లుగా ఎదుర్కొంటున్న విమర్శలకు బ్యాట్‌తో బదులిచ్చాడు. 2018లో రూ.11కోట్లకు రాహుల్‌ను పంజాబ్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

**బ్యాటింగ్ కోచ్‌గా జాఫర్**

వెటరన్ బ్యాట్స్‌మన్ వసీం జాఫర్ పంజాబ్ కింగ్స్ ఎలెవెన్ జట్టు బ్యాటింగ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. భారత్ తరఫున 31టెస్టులు ఆడిన అతడు.. దేశవాళీల్లో విదర్భ తరపున పరుగుల వరద పారిస్తూనే ఉన్నాడు. 254కు పైగా ఫస్ట్‌క్లాస్‌మ్యాచ్‌లు ఆడి 20వేలకు పైగా పరుగులు సాధించాడు.

## ఫైనల్లో భారత్ ఓటమి

**ముంబై:** ముక్కోణపు బాలికల ఫుట్‌బాల్ టోర్నీ ఫైనల్లో భారత్ ఓటమి పాలైంది. గురువారం ఇక్కడ జరిగిన ఫైనల్లో భారత అండర్-17 జట్టు 0-4తో స్వీడన్ చేతిలో ఓటమి పాలైంది. టోర్నీ ఆరంభం నుంచి మెరుగైన ప్రదర్శన కనబర్చిన స్వీడన్ ప్లేయర్లు ఫైనల్లోనూ అదే దూకుడు కొనసాగించి.. మన అమ్మాయిలకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా టైటిల్ చేజిక్కించుకున్నారు. స్వీడన్ తరపున రుసుల్ కఫాజి (4వ ని.లో), ఎల్మా నెహగే (16వ ని.లో) ఎవెలినా దుల్జన్ (18వ ని.లో), మటిల్డా విన్‌బెర్గ్ (61వ ని.లో) ఒక్కో గోల్ చేశారు.

## పాక్ 191 ఆలౌట్

**కరాచీ:** సొంతగడ్డపై శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో పాకిస్థాన్ బ్యాట్స్‌మెన్ ఆకట్టుకోలేకపోయారు. ఫలితంగా పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 59.3 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌటైంది. తొలి టెస్టు సెంచరీ హీరో బాబర్ ఆజమ్ (60), అసద్ షఫీక్ (63) అర్ధ శతకాలు సాధించగా.. ఆబిద్ అలీ (38) ఫర్వాలేదనిపించాడు. లంక బౌలర్లు లహిరు (4/49), ఎంబుల్దెనియా (4/71) రాణించారు అనంతరం గురువారం ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 64 పరుగులు చేసింది.

## కష్టాల్లో హైదరాబాద్




**పాటియాలా:** పంజాబ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్ ఘోరంగా విఫలమవడంతో హైదరాబాద్ జట్టు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. పంజాబ్ కెప్టెన్ మన్‌దీప్ సింగ్(204నాటౌట్) అజేయ ద్విశతకంతో సత్తాచాటాడు. మ్యాచ్ మూడో రోజైన గురువారం ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు కోల్పోయి 30పరుగులే చేయగలిగింది. క్రీజులో హిమాలయ్ అగర్వాల్(14నాటౌట్), చామా మిళింద్(0నాటౌట్) ఉండగా.. ఇంకా 171 పరుగులు వెనుకబడి ఉంది. రెండో ఇన్నింగ్స్ కోసం బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టుకు ఓపెనర్ అక్షత్ రెడ్డి(4) రూపంలో ఆదిలోనే షాక్ తగలగా.. కాసేపటికే శశిధర్(4) కూడా వెనుదిరిగాడు. ఆ తర్వాత కూడా కెప్టెన్ తన్మయ్ అగర్వాల్(5), భావనక సందీప్(1), కొల్లా సుమంత్(2) వెంట వెంటనే ఔటవడంతో హైదరాబాద్ కష్టాల్లో పడింది. పంజాబ్ బౌలర్లలో పండోవ్ రెండు, సందీప్ శర్మ, సన్వీర్ సింగ్, మార్కండే తలో వికెట్ పడగొట్టారు. శుక్రవారం చివరి రోజు ఆట. అంతకుముందు 4వికెట్లకు 167 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు బరిలోకి దిగిన పంజాబ్.. మన్‌దీప్ సింగ్(204నాటౌట్) అజేయ ద్విశతకంతో చెలరేగడంతో ఆరు వికెట్లకు 443 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 242పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే. మరో మ్యాచ్‌లో అక్షత్ వశిష్ఠ్ రెండో ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లతో సత్తా చాటడంతో హిమాచల్ ప్రదేశ్ 71పరుగుల తేడాతో తమిళనాడుపై విజయం సాధించింది.

## భువనేశ్వర్‌లో భారత్, వెస్టిండీస్

**భువనేశ్వర్:** వన్డే సిరీస్‌లో చెరో మ్యాచ్ నెగ్గి సమంగా నిలిచిన భారత్, వెస్టిండీస్ జట్లు చివరిదైన మూడో మ్యాచ్ కోసం గురువారమే భువనేశ్వర్‌కు చేరుకున్నాయి. ఆదివారం కటక్‌లోని బారాబతి స్టేడియంలో ఇరు జట్లు ఆఖరి వన్డే ఆడనున్నాయి. అంతకుముందు రెండు రోజులపాటు నెట్స్‌లో చెమటోడ్చనున్నాయి. శుక్రవారం ఉదయం వెస్టిండీస్ జట్టు సాధన చేయనుండగా.. టీమ్‌ఇండియా మధ్యాహ్నం గ్రౌండ్‌లో దిగనుంది.

**దీపక్‌కు గాయం.. సైనీకి పిలుపు**

టీమ్‌ఇండియా పేసర్ దీపక్ చాహర్ గాయం కారణంగా మూడో వన్డేకు దూరమయ్యాడు. అయితే ఈ మ్యాచ్‌కు దీపక్ అందుబాటులో ఉండటం లేదు. వెన్ను నొప్పి కారణంగా అతడు సిరీస్ నుంచి తప్పుకోవడంతో.. భారత జట్టు అతడి స్థానంలో నవ్‌దీప్ సైనీని తీసుకుంది.




## ట్రయల్స్ నిర్వహించాల్సిందే




**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో పాల్గొనే అథ్లెట్లందరికీ ట్రయల్స్ నిర్వహించడం మంచిదని.. అలా చేస్తేనే అత్యుత్తమ ప్లేయర్లు ముందడుగు వేస్తారని సిడ్నీ ఒలింపిక్స్ (2000) కాంస్య పతక విజేత కరణం మల్లీశ్వరి పేర్కొంది. టోక్యో ఒలింపిక్స్‌కు బాక్సర్ల ఎంపిక విషయంలో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ అభ్యంతరాలు వ్యక్తంచేసిన నేపథ్యంలో మల్లీశ్వరి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'జూనియర్, సీనియర్ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికి ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశం కల్పించాలి. అందులో (ట్రయల్స్) అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారే ముందడుగువేస్తారు. ఈ ప్రక్రియ కూడా నిష్పక్షపాతంగా నిర్వహించాలి. అప్పుడే అసలు టాలెంట్ బయటపడుతుంది' అని మల్లీశ్వరి తెలిపింది. టోక్యో ఒలింపిక్స్‌లో వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను పతకం నెగ్గుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది.

## భారత్ @108

**న్యూఢిల్లీ:** భారత ఫుట్‌బాల్ జట్టు ఫిఫా ర్యాంకింగ్స్‌లో 108వ స్థానంతో ఈ ఏడాదిని ముగించింది. గతేడాదితో పోల్చుకుంటే సునీల్ ఛెత్రీ సేన 11 స్థానాలు దిగజారింది. 2018 చివర్లో 97వ ర్యాంక్‌లో ఉన్న భారత్.. ప్రస్తుతం 108కి పడిపోయింది. ఈ ఏడాది పెద్దగా ఆకట్టుకోలేకపోయిన భారత్ వరుస పరాజయాలతో పాయింట్లు కోల్పోయింది. ఏప్రిల్ నెలలో భారత్ అత్యుత్తమంగా 101వ స్థానంలో నిలిచింది. ఆసియా ర్యాంకుల్లో 19వ ప్లేస్ దక్కించుకుంది. తాజా ర్యాకింగ్స్‌లో బెల్జియం అగ్రస్థానంలో ఉండగా.. ప్రపంచ చాంపియన్ ఫ్రాన్స్ ద్వితీయ స్థానంతో 2019ని ముగించింది. ఆ తర్వాత వరుసగా బ్రెజిల్, ఇంగ్లండ్, ఉరుగ్వే టాప్-5లో ఉన్నాయి.



వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో పారాచూట్ గ్లైడింగ్ ట్రయల్ దృశ్యం

## అనంతగిరికి పర్యాటక సిరి

పాములగుట్ట వద్ద పారాచూట్ ట్రయల్ రన్

అనుకూల ప్రాంతంగా గుర్తింపు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ/వికారాబాద్ రూరల్:** వికారాబాద్ జిల్లా అనంతగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటున్నది. ఇందుకోసం అనంతగిరిలో పారాచూట్ గ్లైడింగ్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేపట్టింది. సిక్కింకు చెందిన నిర్వాహకులతోపాటు రాష్ట్ర పర్యాటకశాఖ అధికారుల బృందం రెండు రోజులపాటు ఇక్కడి జైదుపల్లి సమీపంలోని పాములగుట్ట వద్ద ట్రయల్ రన్ నిర్వహించింది. గ్లైడింగ్ ఏర్పాటుకు అనుకూలమైన గాలులు వీస్తున్నట్టు నిర్వాహకులు గుర్తించారు. పర్యాటకుల కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై త్వరలో ప్రభుత్వానికి నివేదికను అందజేయనున్నారు. ఈ ట్రయల్ రన్‌ను వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ గురువారం పరిశీలించారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అనంతగిరిలో పారాచూట్ గ్లైడింగ్‌ను ఏర్పాటు చేస్తుండటం సంతోషకరమని పేర్కొన్నారు.



హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిర్వహించే క్రిస్మస్ విందు కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరుకానున్న నేపథ్యంలో సిద్ధమైన వేదిక

## హాస్యనటుడు అలీకి మాతృవియోగం

ఇంటికి వెళ్లి పరామర్శించిన అగ్రహీరో చిరంజీవి

పలువురు సినీ ప్రముఖుల సంతాపం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ఖైరతాబాద్:** ప్రముఖ హాస్యనటుడు అలీ మాతృమూర్తి జైతున్ బీబీ బుధవారం రాత్రి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె మృతదేహాన్ని గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని అలీ స్వగృహానికి తరలించారు. ఓ షూటింగ్ నిమిత్తం రాంచీలో ఉన్న అలీ.. తల్లి మరణవార్త తెలుసుకొని వెంటనే హైదరాబాద్‌కు చేరుకున్నారు. అగ్ర హీరో చిరంజీవి.. ఇంటికి వెళ్లి అలీని పరామర్శించారు. అలీ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) సభ్యులు, పలువురు సినీ ప్రముఖులు ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. సంతాపం ప్రకటించారు. గురువారం రాత్రి పంజాగుట్టలోని మజీద్ ఏ ఖుబూర్‌లో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. అలీ కుటుంబానికి పవన్‌కల్యాణ్ ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మాతృమూర్తిపై ప్రేమను అలీ పలు సందర్భాల్లో గుర్తుచేసుకొనేవారు.



# గ్రీన్‌చాలెంజ్‌లో ప్రముఖులు

మొక్కలునాటిన మంత్రులు, ఉన్నతాధికారులు, సినీనటులు • విధిగా మొక్కలను రక్షించాలని పిలుపు



గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా మొక్క నాటుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, తీగల అనితారెడ్డి, అజయ్ మిశ్రా, రాజేశ్వర్ తివారీ తదితరులు



బంజారాహిల్స్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, ప్రతిరోజూ పండగే సినిమా బృందం సాయిధరమ్ తేజ్, రాశీఖన్నా

**హైదరాబాద్/బడంగ్‌పేట/భువనగిరి, నమస్తే తెలంగాణ:**

హరితహారం స్ఫూర్తితో రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్‌చాలెంజ్ అన్ని వర్గాలను ఆకట్టుకుంటున్నది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని మజీద్ గడ్డ జంగిల్ క్యాంప్‌లో గురువారం ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, అటవీ, పర్యావరణశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్ శోభ గ్రీన్‌చాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి మొక్కలు నాటారు. సీఎస్ ఎస్కే జోషి ఇటీవల విసిరిన గ్రీన్‌చాలెంజ్‌నుస్వీకరించిన రాజేశ్‌తివారీ మూడు మొక్కలు నాటి సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ నర్సింగ్‌రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు పేర్లను నామినేట్ చేశారు. అక్కడే ఉన్న అజయ్ మిశ్రా మొక్కలు నాటి.. రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీపీ రఘుమారెడ్డి, హర్షగూడ సర్పంచ్ పాండునాయకుల పేర్లను గ్రీన్‌చాలెంజ్‌కు నామినేట్‌చేశారు. సీఎస్ జోషి తదితరులు చేసిన చాలెంజ్‌ను స్వీకరించిన పీసీసీఎఫ్ ఆర్ శోభ ఆరు మొక్కలు నాటారు. అనంతరం ఏపీ పీసీసీఎఫ్ ఎస్ ప్రతీప్‌కుమార్, తెలంగాణ అదనపు పీసీసీఎఫ్ ఆర్ ఎండ్రోట్రియల్, పర్గెయిస్ లోకేశ్ జైస్వాల్, స్వర్గం శ్రీనివాస్ సీసీఫ్ సునీతా భగవత్‌కు చాలెంజ్ విసిరారు. ఫిల్మ్ న్యూస్ క్యాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రీన్‌చాలెంజ్ నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని శ్రీ నికేతన్‌కాలనీ పార్కులో ప్రతిరోజూ పండగే టీంతోపాటు మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో సినీహీరో సాయి ధరమ్ తేజ్, హీరోయిన్ రాశీ ఖన్నా, దర్శకుడు మారుతి, సహ నిర్మాత ఎస్‌కేఎన్, ఫిల్మ్ న్యూస్ క్యాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు రాంబాబు, శేఖర్, ప్రధాన కార్యదర్శి నాయుడు, కాలనీవాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీ సంతోష్‌కుమార్ చేపట్టిన ఈ కార్యకమం ఎంతగానో ఆకర్షించిందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఎంపీ సంతోష్‌కుమార్ విసిరిన గ్రీన్‌చాలెంజ్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా జాయింట్ కలెక్టర్ రమేశ్ స్వీకరించారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో మూడు మొక్కలు నాటారు. అనంతరం వనపర్తి జేసీ వేణుగోపాల్, నిర్మల్ జేసీ భాస్కర్‌రావు, వరంగల్ రూరల్ జేసీ ఆర్ మహేందర్‌రెడ్డి పేర్లను గ్రీన్ చాలెంజ్‌కు నామినేట్‌చేశారు.

## 'దహెగాంలో రెవెన్యూ దగా'పై ఆర్డీవో ఆరా

నమస్తే ఎఫెక్ట్

• బాధిత రైతుల రికార్డులు పరిశీలన

**దహెగాం:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని గిరివెల్లి, కల్వాడ గ్రామ రైతుల భూసమస్యలపై 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో బుధవారం వచ్చిన 'దహెగాం లో రెవెన్యూ దగా' కథనంపై ఆర్డీవో శివకుమార్ స్పందించారు. స్థానిక తాసిల్ కార్యాలయంలో గురువారం సంబంధిత రికార్డులను పరిశీలించారు. సర్వేనంబర్లను తనిఖీచేయడంతోపాటు, సమస్య పరిష్కారంలో జాప్యంపై ఆరాతీశారు. వందల సంఖ్యలో రెవెన్యూ సమస్యలు పెండింగ్‌లో ఉండటంపై ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, వీఆర్వోలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 15 రోజుల్లో నివేదిక సమర్పిం చాలని తాసిల్దార్ సాయన్నను ఆదేశించారు.



మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణకు పుష్పగుచ్ఛం ఇస్తున్న టీవీజేఏ కార్యవర్గ సభ్యులు

## వీడియో జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తెలంగాణ జర్నలిస్టులకు కల్పించే అన్ని సౌకర్యాలను వీడియో జర్నలిస్టులకు వర్తింపజేస్తామని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ చెప్పారు. గురువారం మీడియా అకాడమీ కార్యాలయంలో తెలంగాణ వీడియో జర్నలిస్టు అసోసియేషన్ (టీవీజేఏ) నూతన కార్యవర్గసభ్యులు చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టెమ్జూ అధ్యక్షుడు ఇస్మాయిల్, టీయూడబ్ల్యూజే కోశాధికారి మారుతిసాగర్, టెమ్జూ కార్యదర్శి రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు. టీవీజేఏ నూతన అధ్యక్షుడిగా పీ ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా జనార్దన్ రెడ్డి, కోశాధికారిగా భిక్షపతి, సంయుక్త కార్యదర్శిగా రవికిరణ్ ఎన్నికయ్యారు.



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో మసీద్‌గడ్డ జంగిల్ క్యాంప్ (ఫారెస్ట్ అర్బన్ పార్క్)ను గురువారం అటవీ, పర్యావరణశాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ప్రారంభించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సైకిల్ ట్రాక్‌లో సైకిల్ తొక్కారు. వాకింగ్, రన్నింగ్, సైక్లింగ్ ట్రాక్‌తోపాటు క్యాంపింగ్ ఫెసిలిటీస్‌ను వారు పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీశ్‌కుమార్, చీఫ్ సెక్రటరీ రాజేశ్‌తివారీ తదితరులు పాల్గొన్నారు. **- నమస్తే తెలంగాణ, బడంగ్‌పేట**



**ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో గ్రంథాలయం**

పుణె రూరల్ రిలేషన్స్ ఆర్గనైజేషన్ సహకారంతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని గురువారం ప్రారంభిస్తున్న రాచకొండ సీపీ మహేశ్ భగవత్, ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి తదితరులు **- నమస్తే తెలంగాణ, ఉప్పల్**

## పారదర్శకంగా అడ్మిషన్లు చేపట్టండి

ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యాలకు కమిషనర్ ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఇంటర్నేషనల్ స్కూళ్లు, సీబీఎస్‌ఈ పాఠశాలలను నియంత్రించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదేనని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ చెప్పారు. ఇంటర్నేషనల్ స్కూళ్లలో ప్రతియేటా నిర్వహించే అడ్మిషన్ల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. రాష్ట్రంలోని పలు ఇంటర్నేషనల్ స్కూళ్లు, సీబీఎస్‌ఈ పాఠశాలల యాజమాన్యాలతో గురువారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆ స్కూళ్లలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్నేషనల్ స్కూళ్లలో అడ్మిషన్ల తేదీలు విడుదలచేయాలని, వాటి వివరాలను నోటీస్‌బోర్డు పెట్టాలని ఆదేశించారు.






## ఆదర్శంగా తెలంగాణ జైళ్లశాఖ

జైళ్లశాఖ స్పోర్ట్స్ మీట్‌లో డీజీపీ మహేందర్‌రెడ్డి

**మాదన్నపేట:** దేశంలోని ఇతర రాష్ట్రాల జైళ్లశాఖలకు తెలంగాణ జైళ్లశాఖ ఆదర్శంగా నిలిచిందని డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి అన్నారు. జైళ్లశాఖ సిబ్బంది పోలీస్‌శాఖకు స్ఫూర్తిదాయకంగా ఉండాలని కోరారు. చంచల్‌గూడలోని సీకా మైదానంలో రాష్ట్ర జైళ్లశాఖ ఆరో స్పోర్ట్స్ మీట్‌కు డీజీపీ మహేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. తొలుత ఆయన క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో జైళ్లశాఖ డీజీ రాజీవ్ త్రివేది, ఐజీ సైదయ్య, డీఐజీలు రాజేశ్, ఎంబీ భాస్కర్, సూపరింటెండెంట్లు శ్రీనివాస్, వెంకటలక్ష్మి, సంపత్‌కుమార్, సీకా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జైళ్ల శాఖ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

## విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి పెంచొద్దు

• ఇంటర్ విద్య కమిషనర్ ఒమర్ జలీల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు మార్చిలో నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలంటే భయంపోగొట్టి, వారిలో కలిగే ఒత్తిడిని తగ్గించాలని ఇంటర్ విద్య కమిషనర్ సయ్యద్ ఒమర్ జలీల్ సూచించారు. గురువారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్యభవన్‌లో 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఒక్కరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జలీల్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆత్మహత్యలు, పరీక్షల వల్ల కలిగే భయాలు తగ్గించే అంశంపై ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల అధ్యాపకులకు, ప్రిన్సిపాళ్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు ముగిశాయని చెప్పారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు వీరేందర్‌గౌడ్, యండమూరి వీరేంద్రనాథ్, గంపా నాగేశ్వరరావు, ఇంటర్ విద్య డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.







నమస్తే తెలంగాణ
జిందగీ
శుక్రవారం 20 డిసెంబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

కరీంనగర్

రాబోయే క్రిస్మస్‌కు ఏంజెల్‌లా మెరిసిపోవాలనుకుంటున్నారా? ప్రతియేటా తెలుపుదుస్తులు ధరించి బోర్‌కొడుతుంటే ఈ సారి కొత్తగా కలర్‌ఫుల్‌గా ట్రై చేయండి. నచ్చినరంగులో స్కర్ట్, లెహంగా, క్రాప్‌టాప్‌లను నచ్చినట్టుగా డిజైన్ చేయించుకోండి. ఈ మోడల్స్‌లో మీరు ఎలా ఉంటారో ఊహించుకునేందుకు కొన్ని డిజైన్లను మీ ముందు ఉంచుతున్నాం.

# కలర్‌ఫుల్ ఏంజెల్స్!



ప్యూర్ రాసిల్క్ లెహంగా సెట్. లెహంగాకు పువ్వులుగా ఎంబ్రాయిడరీ వర్క్ ఇచ్చాం. అంచులకు కట్ వర్క్ చేశాం. బ్లౌజ్ మొత్తానికి హెవీగా వర్క్ కుట్టాం. హాఫ్ హ్యాండ్స్ కుట్టాం. చున్నీ లేకపోయినా ఆ క్రాప్‌టాప్ చక్కగా ఉంటుంది.

ఫుల్‌హ్యాండ్స్ వేసుకోవడానికి ఎక్కువమంది ఇష్టపడతారు. అందుకే ఈ లెహంగాను ఎంచుకున్నాం. ఇన్‌ఫో వెస్ట్రన్ స్టైల్‌లో బ్లౌజ్‌కి హెవీగా ఎంబ్రాయిడరీ వర్క్ చేశాం. ట్రెండీగా ఉండేందుకు ట్రాన్స్‌పరెంట్ స్లీవ్స్ కుట్టాం. బ్లౌజ్ హెవీగా ఉంది కాబట్టి లెహంగా మీద కొంచెం మినిమల్ వర్క్ ఇచ్చాం. రెడ్‌కలర్‌కు కాంట్రాస్ట్ దుపట్టా ఎంచుకున్నాం. దుపట్టాకు కట్‌వర్క్ చేశాం.



వి. స్వాతి
స్వాతి వెల్దండి డిజైన్ స్టూడియో
బంజారాహిల్స్, హైదరాబాద్
8179668098

పెండ్లి, పండుగ ఏదైనా ఉందంటే వేరే ఏమీ ఆలోచించకుండా పాస్టల్ పింక్ స్కర్ట్ ధరించడమే. టాప్‌కి హెవీగా ఎంబ్రాయిడరీ వర్క్ చేశాం. ట్రెండీ లుక్‌కోసం హాఫ్ షోల్డర్ హ్యాండ్స్ కుట్టాం. అంచులకు కట్ వర్క్ చేశాం. ఎక్కువ ఘేరా ఉన్న లెహంగా పెండ్లికూతురికి బాగుంటుంది.

## అందానికి సైందవ లవణం



- ముఖంపై నల్లటి వలయాలు తొలగిపోవడానికి గోరువెచ్చని నీటిలో కొద్దిగా సైందవ లవణాన్ని కలుపుకొని ముఖానికి రాసుకోవాలి. ఇలా తరచుగా చేయడం వల్ల మృతకణాలు తొలగిపోతాయి. నల్లటి వలయాల సమస్య నుంచి బయటపడుతారు.
- ఆర్గానిక్ కొబ్బరి నూనెలో సైంధవలవణాన్ని కలుపుకొని పెదాలకు మర్దన చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల పెదవులు మృదువుగా మారుతాయి.
- చర్మంపై పేరుకుపోయిన మురికి పూర్తిగా తొలగిపోవాలంటే గుప్పెడు సైంధవలవణాన్ని ఒళ్లంతా రుద్దుకోవాలి. ఆ తర్వాత ఐదు నిమిషాలకు స్నానం చేస్తే మృతకణాలు తొలగిపోతాయి.
- ముఖంపై బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్ వదలాలంటే టీ స్పూన్ ఎప్సమ్ సాల్ట్ చేతుల్లోకి తీసుకొని కొద్దిగా గోరువెచ్చని నీళ్లు కలిపి ముఖానికి సున్నితంగా రుద్దుకోవాలి. ఇలా చేస్తే బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్ సమస్య తొలిగిపోతుంది.






నమస్తే తెలంగాణ
శాస్త్ర
[ హైదరాబాద్ ]
శుక్రవారం 20 డిసెంబర్ 2019

జలప్రపంచం

## ఈ 'చెంచా పురుగులు' ఎక్కడివి?

**క్యాలిఫోర్నియా పసిఫిక్ మహాసముద్ర తీరానికి వేలసంఖ్యలో కొట్టుకొచ్చిన 'చెంచా పురుగులు' ఎక్కడివి? ఎలా వచ్చాయి? అన్నది శాస్త్రవేత్తలకు ఇదమిద్ధంగా తెలియడం లేదు.**



**బొద్దుగా,** లేత ఎరుపురంగు (గులాబి)లో కనిపించే ఈ చిన్న జలజీవులు శాస్త్రవేత్తలకు నిజానికి కొత్త కాదు. 'యురెచిస్ కాపో' (Urechis caupo) గా పిలిచే ఇవి ఒక రకమైన 'చెంచా పురుగు' (spoon worm)ల జాతికి చెందినవిగా చెబుతున్నారు. వీటిని 'శిష్న చేప' (penis fish) లుగానూ వారు 'ముద్దుపేరు'తో కూడా పిలుచుకొంటున్నారు. పసిఫిక్ మహాసముద్రానికి చెందిన ఒక క్యాలిఫోర్నియా తీర ప్రాంతానికి గత వారం (డిసెంబర్ 6న)లో ఇవి వేలసంఖ్యలో కొట్టుకు వచ్చాయి. సుమారు 10 అంగుళాల పరిమాణంలోని ఈ చిన్న జలజీవులు మెక్సికోకు చెందిన బాజా క్యాలిఫోర్నియా, సదరన్ ఓరెగాన్ ప్రాంతాలకు చెందినవై ఉంటాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అఖాతగర్భంలో ఏర్పడిన బలమైన తుపాను కారణంగా ఇవిలా ఒక్క పెట్టున కొట్టుకు వచ్చి ఉంటాయని కొందరు పరిశోధకులు అంటున్నారు. పీతలు, రొయ్యలు వంటి జలచరాలకు ఆహారమయ్యే ఈ చిన్న పురుగులను గురించిన లోతైన పరిశోధనలు జరగవలసి ఉంది.

# సుముఖ మార్పిడి!



■ అధిక చక్కదనం, క్రియాశీలతలే లక్ష్యంగా.. ■ మారుతున్న ముఖచిత్రం ■ ఆధునాతన సాంకేతికతలతో అద్భుతాలు

**ఇటీవల బోస్టన్ (అమెరికా) మహానగరంలో ఒక 68 ఏండ్ల వృద్ధుడికి జరిగిన ముఖమార్పిడి, వేగంగా మారుతున్న (అభివృద్ధి చెందుతున్న) వైద్య విజ్ఞానశాస్త్ర రంగం ముఖచిత్ర సౌందర్యానికి అద్దం పడుతున్నది. ఈ నేపథ్యంలో నే 'మానవ ముఖాల బదిలీ'పై ఒక ఆశావహ కథనం చదువండి.**

వైద్య విజ్ఞానశాస్త్రం



**అత్యంత** సంక్లిష్టమైన 'ముఖమార్పిడి' శస్త్రచికిత్సలో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అద్భుత ఫలితాలు నమోదవుతున్నాయి. వాటిలో ఒకటి తాజా 'బోస్టన్ ఫేస్ ట్రాన్స్‌ప్లాంట్'. 'ఏదో ఒక రూపాన్నిచ్చామని' కాకుండా, 'సుందరమైన ముఖకవళికలను సాధించడానికే' అనేకమంది వైద్యనిపుణులు తమ వంతు కృషి చేస్తుండడం గమనార్హం. 2015లో మొదలైన ఈ 'ముఖ పునఃసృష్టి వైద్యకళ' ఇవాళ్టికి గణనీయ స్థాయికి చేరింది. ఈ పద్నాలుగేండ్లలో ప్రపంచంలో మొత్తం 40 మందికి 'కొత్త ముఖాకృతుల'ను వారు అందించగలిగారు. తొలినాళ్లకు, ఇప్పటికీ ముఖసౌందర్యాకృతిలోను, క్రియాశీలతలోనూ అధిక స్థాయిలో ప్రశంసనీయ ఫలితాలనే గ్రహీతలు పొందుతున్నట్టు వారు చెబుతున్నారు. కాకపోతే, మరణానంతరం తమ ముఖావయవాలను దానం చేయగల దాతల కొరతే చాలా ఉంటున్నట్టు వారు పేర్కొన్నారు.

మనిషికి ముఖం ఎంత ప్రధానమంటే, అది లేకపోతే అసలు అతని ఉనికే లేనంతగా. తనదైన ఒక గుర్తింపును, వ్యక్తిత్వాన్ని, అందచందాలను, మొత్తంగా జీవితాన్ని, ఇంకా ఆత్మయిక సౌందర్యాన్ని అందించేది అదే. ఏదో కారణంతో ముఖమే కనుక రూపు కోల్పోయి వికారంగా మారితే బతుకు అత్యంత దయనీయమవుతుంది. ఒక చెయ్యి లేకున్నా, కాలు లేకున్నా చివరకు కండ్లు వంటి అవయవాలేవి లేకపోయినా, ఏ దివ్యాంగుడిగానో బతకవచ్చేమో. కానీ, మనసుకు, హృదయానికి అద్దం వంటి వదనమే చూడదగ్గదిగా లేకపోతే.. ఆ లోటు పూడ్చలేనిది. వైద్య విజ్ఞానశాస్త్రంలో 'ముఖమార్పిడి' శస్త్రచికిత్సలు సుసాధ్యమైన ఈ ఒకటిన్నర దశాబ్దాల కాలంలో పలు అనూహ్య విజయాలే నమోదైనాయి.

నిఖార్సత్వంతో కూడిన నిపుణులైన సర్జన్లు పలు ఆపరేషన్లతో కను, ముక్కు అవయవాలతో ఒక ముఖాకృతినైతే సృష్టించగలుగుతున్నారు కానీ, అనేకమంది గ్రహీతలకు చూడ'చక్కదనం' ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది. ఎబ్బెట్టుగా, కళా రహితంగా అంటుకట్టిన ముఖమార్పిడికి బదులు 'సుముఖ' మార్పిడినే ఎవరైనా కోరుకొంటారు. సృష్టి నైపుణ్యంతో మానవ నిపుణతను ఎటూ పోల్చలేం. పిండదశలో బిడ్డ ముఖాకృతి ఎలా రూపొందుతుందో తెలియదు కానీ, ఎంతో కొంత చూడ బుద్ధయ్యేలే 'మార్పిడి ముఖం' ఉండాలన్నదే చాలామంది అభిలాష. కానీ, దీని సాధ్యాసాధ్యాలే ప్రశ్నార్థకం. తాజా 'ముఖమార్పిడి' శస్త్రచికిత్స ముఖానికి చక్కదనాన్ని సాధించడంలో 'నూటికి తొంబై శాతం' విజయవంతమైందని నిపుణులు అంటున్నారు. భవిష్యత్తులోకూడా వట్టి ముఖమార్పిడులు కాకుండా, నాణ్యత, అందచందాల (aesthetic)తో కూడిన మార్పిడులకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందన్న అభిప్రాయాన్నీ వారు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో వైద్య విజ్ఞానశాస్త్ర రంగం సాధించిన ఒక వినూత్న ప్రగతికి ఇటీవలి 'ముఖమార్పిడి' ఒక నిదర్శనమని కూడా వారు అభిప్రాయ పడ్డారు. ఇదే సమయంలో ఈ 'మార్పిడి' సంఘటన మరొక కీలకాంశాన్ని సైతం తెరపైకి తెచ్చింది. 'ముఖమార్పిడి' కోసం గ్రహీతలు ఎదుర్కొంటున్న దాతలకొరతను చాలా ప్రస్ఫుటంగా ఇది చాటి చెప్పింది. ఈమధ్యే 'ముఖమార్పిడి' (బోస్టన్) శస్త్రచికిత్స చేయించుకొన్న వృద్ధుడు తన చర్మధర్మానికి సరిపోయే దాతకోసం కొన్నేండ్ల తరబడి ఎదురు చూశాడంటే దీనిని బట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆ వ్యక్తి పేరు రాబర్ట్ చెల్సియా (Robert Chelsea). అమెరికాలో జీవిస్తున్న నల్లజాతీయుడైన ఆఫ్రికన్. ఆయన చర్మరంగుకు సరిపోయే దాత లభించడానికి ఆరేండ్లు పట్టింది.

'ముఖమార్పిడి'ద్వారా సమకూరిన కొత్త ముఖాకృతి ఆయనకెంతో చక్కగా కుదిరింది. ఇప్పటి వరకు ప్రపంచంలో 'ముఖమార్పిడి' చేసుకొన్న వారందరిలోకీ ఈయన పొందిన ఫలితం అనూహ్యమని కూడా నిపుణులు అభివర్ణించారు. 'ముఖమార్పిడి' శస్త్రచికిత్స అంటే 'సాధారణ ఆపరేషన్' చేసినంత సులువేమీ కాదు. రాబర్ట్ చెల్సియా (68) ప్రస్తుత ముఖానికి, గతంలోని విచ్ఛిన్నమైన ముఖానికి నడుమ అనూహ్య వ్యత్యాసాన్ని గుర్తించవచ్చు. అతను సుమారు ఏడాదిన్నరపాటు ఆసుపత్రిలో ఉండగా, మొత్తం ప్రక్రియలో 30 వరకూ సర్జరీలు అయ్యాయి. ఇప్పుడు అతని ముఖం అకళాత్మకంగా ఏమీ కనిపించకపోవడం విశేషం. ఇంతటి విజయాన్ని సాధించినా దీనిని సహజ సిద్ధమైందిగా, పూర్తి 100 శాతం నాణ్యత (సుముఖం)గా వారు చెప్పకపోవడం గమనార్హం.

'ఆయన పెదవులు, ఎడమ చెవి, ముక్కులోని భాగాల పునర్నిర్మాణంలో కొంత వైఫల్యం తమకు తప్పలేదని' శస్త్రచికిత్స చేసిన వైద్యనిపుణులు వెల్లడించారు. తినడం, తాగడం వంటి నిత్యావసరాలను తీర్చుకొనే సమయంలో మాత్రం రాబర్ట్ చెల్సియా తన మెడను కొంచెం వెనుకకు వంచవలసి (tilt) వస్తున్నది. అయినప్పటికీ, తన కూతురు చెంపలపై ముద్దు పెట్టుకోవాలన్న అతని విలువైన కోర్కె చాలా వరకు నెరవేరే స్థాయిలోనే ఉన్నట్టు వారు పేర్కొన్నారు. సర్జరీ ప్రకియ పూర్తయిన పది రోజుల్లోనే ఆయన మాట్లాడటం, తనంత తాను తినడం, ఊపిరి తీసుకోవడం వంటి పనులు చేయగలుగుతున్నాడు. పునర్నిర్మితమైన ఆయన పెదవులు సహజమైన వాటివలె పూర్తిస్థాయిలో పనిచేయవని వారంటున్నారు. 'ఆరేండ్ల తర్వాతైనా నా చర్మధర్మానికి సరిపోయే దాత లభించడం నా అదృష్టం. నాకిదొక కొత్త జీవితం. నా భవిష్యత్ జీవిత ప్రయాణమంతా నేను ఏ మాత్రం నమ్మలేనిది. మనం తోటివారికి చేతనైన సహాయం చేయాలన్న స్ఫూర్తిని నేను నా అనుభవంతో నేర్చుకొన్నాను' అని రాబర్ట్ దాతల కొరతను గురించి అడిగినప్పుడు చెప్పుకొచ్చారు.

2018 ఆగస్టు నాటికి ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 40 ముఖమార్పిడిలు జరిగినట్టు తెలుస్తున్నది. జీవిస్తున్న మనిషిపై మొట్టమొదటిసారిగా 2005లో ఫ్రాన్స్‌లో 'తొలి పాక్షిక ముఖమార్పిడి' జరిగింది. 'పూర్తిస్థాయి ముఖమార్పిడి'ని స్పెయిన్‌లో 2010లో నిర్వహించారు. టర్కీ, ఫ్రాన్స్, స్పెయిన్, చైనా, బెల్జియం, ఇటలీ, కెనడా, పోలాండ్, యుకె (యునైటెడ్ కింగ్‌డమ్), అమెరికా దేశలతోపాటు మన భారతదేశంలోనూ ఈ సర్జరీలను (పాక్షికంగా లేదా పూర్తిగా) జరిపినట్టు చరిత్ర చెబుతున్నది. గాయాలు, అగ్నిప్రమాదాలు, జన్మతః లోపాలు వంటి కారణాలతో ఎవరి ముఖమైనా అందవికారంగా, ప్రయోజన రహితంగా మారినప్పుడు, ప్లాస్టిక్ సర్జరీ వంటి ప్రత్యామ్నాయాలు పనిచేయనప్పుడు, ఈ 'ముఖమార్పిడి' అవసరమవుతుంది. 'ముఖాకృతిలోని నిర్మాణపరమైన లోపాలను ఇలా ఆపరేషన్లద్వారా సరిచేయవచ్చునన్న భావన'ను 2002లోనే 'రాయల్ ఫ్రీ హాస్పిటల్స్' (ఇంగ్లాండ్)కు చెందిన ప్రొఫెసర్ పీటర్ బట్లర్ (Peter Butler) 'ది లాన్సెట్' ఆన్‌లైన్ పత్రికలో ప్రచురించిన పరిశోధనాత్మక వ్యాసంలో ప్రతిపాదించారు. అనేక చర్చోపచర్చలు, నైతిక విలువలను పరిగణనలోకి తీసుకొన్న అనంతరమే ముఖపునర్నిర్మాణ 'మార్పిడి' శస్త్రచికిత్స ప్రయోగాత్మకంగా ఆచరణలోకి వచ్చింది. తొలుత గ్రహీత సొంత చర్మాన్నే (తొడలు, పిరుదులు, వీపు లేదా ఛాతీ భాగాలనుంచి) సేకరించి పాక్షిక ముఖమార్పిడులను నిర్వహించినా, తర్వాత కాలక్రమేణా, గ్రహీతలకు సరిపోయే చర్మధర్మాలుగల దాతల నుండి కూడా స్వీకరిస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో అత్యధికంగా సుమారు 50 వరకు సర్జరీలు అవసరమవుతాయని నిపుణులు అంటున్నారు.

దోర్బల బాలశేఖరశర్మ

### అనూహ్య ఫలితం!

*2013లో రాబర్ట్ చెల్సియా (అప్పటికి ఆయనకు 62 ఏండ్లు) ముఖం ఒక తాగుబోతు డ్రైవర్ కారణంగా ఛిన్నాభిన్నమై పోయింది. దేహంలోని చాలాభాగం కాలి పోయింది కూడా. ప్రాణాపాయం తప్పినా, వికృతమైన ముఖంతో తలెత్తుకోలేని పరిస్థితిలో ఏమైనా, ఎంత ఖర్చయినా సరేనని 'ముఖమార్పిడి'కి సిద్ధమైనాడు. అతని చర్మవర్ణస్థాయికి సరిపోయే దాత ఈ ఏడాది (2019) జూలైలోనే లభించాడు. వెంటనే, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా 'బోస్టన్స్ బ్రిగ్‌హామ్ అండ్ వుమెన్స్ హాస్పిటల్' (Boston's Brigham and Women's Hospital) లో 'ముఖమార్పిడి' శస్త్రచికిత్స ప్రక్రియను పూర్తి చేశారు. సుమారు 16 గంటల ఆపరేషన్ల అనంతరం అతనికి లభించిన 'కొత్త ముఖం' ఇన్నేండ్ల ప్రపంచ 'ముఖమార్పిడి' చరిత్రలోనే విశేషం. ఎందుకంటే, అతనికి లభించిన ముఖాకృతి సౌందర్యాని (నాణ్యత)కి తోటివారితో పాటు అతనూ ముగ్ధుడయ్యాడు. అంత ఇదిగా చూడచక్కదనాన్ని వైద్యనిపుణులు ఎట్టకేలకు ఆయన ముఖసృష్టి కళలో సాధించారు. దీంతో 'పూర్తి ముఖమార్పిడిని పొందిన తొలి ఆఫ్రికన్ అమెరికన్'గా ఆయన చరిత్ర సృష్టించారు.*




జంతువింతలు

### 'వెటాస్' శీతల శక్తి!



**ప్రపంచంలోనే** 'అత్యంత శీతల వాతావరణాన్ని తట్టుకోగల (Largest freeze-tolerant) కీటకం'గా 'మౌంటేన్ స్టోన్ వెటాస్'ను శాస్త్రవేత్తలు పేర్కొంటారు. దీనికి రెక్కలు ఉండవు కనుక, ఎగురలేదు. ఉష్ణోగ్రతలు ప్రాణాంతక పరిస్థితిలోకి పడిపోయినప్పుడు ఇది నెలల తరబడి ఘనీభవ స్థితిలోకి వెళ్లిపోతుంది. అయినా, ప్రాణాన్ని మాత్రం కోల్పోదు. వాతావరణంలో వేడిమి పెరిగిన తర్వాత యథాస్థితికి వచ్చేస్తుంది. ఇందుకుగాను, దీని శరీరంలోని రక్తం వంటి ద్రవంలో మంచు స్ఫటికాలు రూపొందుతాయని, ఫలితంగా సుమారు 80 శాతం దేహకణాలకు అంతటి శీతల పరిస్థితులను తట్టుకొనే శక్తి లభిస్తుందనివా రంటున్నారు.

### పేడ పురుగు బలం!

**'భూమిమీద** అత్యంత బలమైన (strongest) కీటకం'గా పేడ పురుగును శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇవి తమ దేహం కన్నా సుమారు 200 రెట్లు ఎక్కువ బరువైన తాజా జంతుపేడ ముద్దలను నెట్టుకు పోగలవని వారంటున్నారు. ఒక పేడ పురుగుపై ప్రత్యేక అధ్యయన చిత్రాన్ని రూపొందించగా, సదరు పరిశోధకులను ఆశ్చర్యపరిచే విషయం వెల్లడైంది. అది ఏకంగా తన శరీరం బరువుకన్నా 1,141 రెట్లు ఎక్కువ బరువున్న పేడ ముద్దను నెట్టుకెళ్లినట్లు వారు చెప్పారు. అంటే, సుమారు 68 కేజీల (150 పౌండ్లు) బరువుగల ఒక మనిషి 80 టన్నుల బరువును తోసుకెళ్లడంతో ఇది సమానం.



### పింగాణీ కోసం లేజర్ వెల్డింగ్

కొత్త సాంకేతికత

**పగిలిన పింగాణీ ముక్కలను అతికించడానికి శాస్త్రవేత్తలు కొత్త 'లేజర్ వెల్డింగ్' విధానాన్ని కనిపెట్టారు. ఇందులో సెకనుకు కనీసం 1 మిలియన్ (10 లక్షలు) పర్యాయాలు నిప్పును సృష్టించడం జరుగుతుందని వారన్నారు.**



**పింగాణీ** ఎంత విలువైందో అంత ఖరీదైంది. ఈ పాత్రలు పగిలితే ఇక అతకడం (ఇప్పటి వరకు) అసాధ్యమే. కానీ, ఇక ముందు అలా పగిలిన పింగాణీ వస్తువులను పారేయనక్కరేకుండా శాస్త్రవేత్తలు ఒక రకమైన వెల్డింగ్‌తో అతికించే విధానాన్ని అభివృద్ధి పరిచారు. లేజర్ కిరణాలను సెకనుకు కొన్ని లక్షలసార్లు (10 లక్షలు) ప్రసరింపజేయడం ద్వారా పింగాణీ వస్తువులను అతికించే సాంకేతికతను వారు సాధించారు. 'సైన్స్' ఆన్‌లైన్ పత్రికలో ప్రచురితమైన ఈ పరిశోధనా ఫలితం ఆచరణలోకి వస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. కొన్ని వందల సంవత్సరాలుగా వాడకంలో వున్న పింగాణీ వస్తువులను తయారు చేయడం ఎంత సంక్లిష్టమో, పగిలిన తర్వాత వాటిని అతికించడమూ అంతే సంక్లిష్టమని, తాము దీనిని సాధించామని వారు అంటున్నారు. కొన్ని వేల డిగ్రీల ఫారిన్‌హీట్స్ ఉష్ణోగ్రతలతో కూడిన బట్టీలలో కాల్చడం ద్వారా పింగాణీ పాత్రలకు అంత గట్టిదనం సిద్ధిస్తుందన్న సంగతి మనకు తెలిసిందే.

నమస్తే తెలంగాణ
చిత్రం



**''రూలర్' సినిమా విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకున్నా. శారీరకంగా సరికొత్తలుక్‌తో కనిపించే ప్రయత్నం చేశా. నేను ఎప్పుడూ సవాళ్లను స్వీకరించడానికే ఇష్టపడతాను. ఆ నైజమే శక్తివంతమైనన పాత్రల్ని ఎంచుకోవడానికి స్ఫూర్తినిస్తున్నది' అని అన్నారు సీనియర్ కథానాయకుడు బాలకృష్ణ. ఆయన తాజా చిత్రం 'రూలర్' నేడు ప్రేక్షకులముందుకురానుంది. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ విశేషాలివి..**

## సినిమాల విషయంలో సాంకేతికతకు బానిసకావొద్దు!

**'రూలర్' అంటూ శక్తివంతమైన టైటిల్‌తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ సినిమా ఎలా ఉండబోతుంది?**

'లెజెండ్' 'రూలర్'..ఇలా శక్తివంతమైన టైటిల్స్‌ను నేను ఇష్టపడతాను. ఇప్పటికీ 'లెజెండ్' అంటే కొన్ని మారుమూల గ్రామాల్లో అర్థం తెలియకపోయినా కథలోని భావోద్వేగాలతో ప్రేక్షకులు బాగా కనెక్ట్ అయ్యారు. అందుకే ఆ సినిమాను ఆదరించారు. కొన్ని టైటిల్స్ నాకు టైలర్‌మేడ్‌లా సెట్ అవుతాయనిపిస్తుంది. అలా కుదరడం అదృష్టంగా భావిస్తున్నా.

**ఈ సినిమాలో యంగ్‌లుక్‌తో కనిపించినట్లున్నారు?**

ఈ సినిమాలో కథానుగుణంగా ద్విపాత్రాభినయంలో కనిపిస్తా. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్, గెటప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. సోషల్‌మీడియాలో ఆ స్టిల్స్ ట్రెండింగ్‌లో నిలిచాయి. నా దృష్టిలో ఒక వయసు మీద పడ్డాక సాహసాలు చేయకూడదు. మన సంస్కృతి సంప్రదాయాల్ని దృష్టిలో పెట్టుకొని పాత్రల్ని ఎంచుకోవాలి. ఇందులో యంగ్‌లుక్ విషయంలో తొలుత కొంత సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే గెటప్ వేసుకొని సెట్‌లోకి వెళ్లేసరికి అందరూ ఆశ్చర్యచకితులయ్యారు. అప్పటి నుంచే సినిమాపై కాన్ఫిడెన్స్ పెరిగింది. ఉత్తర్‌ప్రదేశ్ నేపథ్యంలో కథ నడుస్తుంది కాబట్టి అక్కడి పరిస్థితులకు తగ్గట్లుగా నా పాత్రను పవర్‌ఫుల్‌గా డిజైన్ చేశారు. కథలోని ఎమోషన్స్ నచ్చడంతో ఈ సినిమా విజయంపై మొదటి నుంచి ధీమాతో ఉన్నాను

**శరీరాకృతిని తీర్చిదిద్దుకునే విషయంలో ఎలాంటి శ్రద్ధ తీసుకున్నారు?**

ఈ సినిమా కాస్ట్యూమ్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. వస్త్రధారణ హాలీవుడ్ రేంజ్‌లో ఉందని అంటున్నారు. డ్రెస్ డిజైనింగ్ వ్యవహారాల్ని నేనే పర్యవేక్షించాను. నా ఆహార్యం, లుక్ విషయంలో ఇంతటి వైవిధ్యం వస్తుందని ఎవరూ నమ్మలేదు. ఓ సవాలుగా తీసుకొని శరీరాకృతిని తీర్చిదిద్దుకున్నా.

**ఈ సినిమాను అతితక్కువ సమయంలో పూర్తిచేశారని తెలిసింది?**

అవును. మూడునెలల్లో చిత్రాన్ని పూర్తిచేశాం. నిర్మాత సి.కల్యాణ్ చక్కటి ప్రణాళికతో సినిమాను అతితక్కువ టైమ్‌లో పూర్తిచేయగలిగారు. ఆయనతో నేను గతంలో రెండు సినిమాలు చేశాను. కాబట్టి మా ఇద్దరి మధ్య చక్కటి అవగాహన ఉంది. ఇక దర్శకుడు కె.ఎస్.రవికుమార్ నాకు సన్నిహితుడు. సినిమాల విషయంలో మా ఇద్దరి అభిరుచులు ఒకేలా ఉంటాయి. హీరోను ఓ బాస్‌లా ట్రీట్ చేస్తారాయన. సినిమాకు కథ, హీరోయిజం ముఖ్యమని నమ్ముతారు. టెక్నిక్‌కు బానిసకావొద్దని చెబుతుంటారు. నేను అదే సిద్ధాంతాన్ని నమ్ముతాను. ఎన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ వచ్చినా నా సినిమాను మాత్రం ప్రేక్షకులు థియేటర్‌కు వెళ్లి చూస్తేనే ఆస్వాదిస్తారు. ఈలలు, చప్పట్లతో స్క్రీన్‌మీద పువ్వులు వెదజల్లుతూ సినిమాను ఎంజాయ్ చేస్తారు. అలా చూస్తేనే వారికి నిజమైన అనుభూతి దొరుకుతుంది. అభిమానులకు ఏం కావాలో తెలుసుకొని వారి కోరికలు తీర్చడంలోనే నిజమైన స్టార్‌డమ్ ఉంటుందని నేను విశ్వసిస్తాను.

**ఈ కథలో మిమ్మల్ని బాగా ఆకట్టుకున్న అంశాలేమిటి?**

పరుచూరి మురళి ఈ కథను అందించాడు. దర్శకుడు కె.ఎస్.రవికుమార్ సింగిల్ సిట్టింగ్‌లోనే కథను ఓకే చేశారు. అయితే స్క్రిప్ట్‌లో కొన్ని మార్పులు చేశాం. పోలీస్ క్యారెక్టర్ ఒరిజినల్ కథలో లేదు. మార్పుల్లో భాగంగా దానిని జతచేశాం. కొన్ని ఇంపార్టెంట్ పాత్రల్ని కొత్తగా తీర్చిదిద్దాం.

**వాణిజ్య అంశాలతో పాటు ఈ సినిమాలో సందేశం కూడా ఉందని చెబుతున్నారు?**

ఈ సినిమాలో రైతులతో పాటు ఐటీ నిపుణుల గొప్పదనాన్ని ఆవిష్కరించాం. ఆ సన్నివేశాలు ఎందుకు పెట్టాల్సివచ్చిందో..వాటిలో ఉన్న ఔన్నత్యం ఏమిటో మీకు సినిమా చూస్తేనే అర్థమవుతుంది.

**బోయపాటితో చేయబోయే సినిమా ఎలా వుంటుంది?**

బోయపాటి, నా కాంబినేషన్ అనగానే ఖచ్చితంగా అంచనాలు ఎక్కువగా ఉంటాయి. వాటికి తగ్గట్లుగానే కథ కూడా కుదిరింది. బోయపాటి సినిమా అంటే నేను కథ కూడా వినను. ఆయనపై ఉన్న నమ్మకం అలాంటిది. నా గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తి బోయపాటి.



**నా సినిమాలు పంచభక్ష్యపరమాన్నంలా ఉంటాయి. అన్ని రకాల రుచులతో వడ్డించిన విస్తరిలా అలరిస్తాయి. 'రూలర్' సినిమాకు అనుభవజ్ఞులైన టీమ్ కుదిరింది. ఈ సినిమా ఆబాలగోపాలన్ని మెప్పిస్తుందనే నమ్మకం ఉంది.**

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

### సీఎంఎస్ఎస్‌లో

**న్యూఢిల్లీలోని సెంట్రల్ మెడికల్ సర్వీసెస్ సొసైటీ (సీఎంఎస్ఎస్)లో మేనేజర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు-ఖాళీలు:** మేనేజర్( ప్రొక్యూర్‌మెంట్-4, లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్-3, క్వాలిటీ అస్యూరెన్స్-2, ఫైనాన్స్-2,అ డ్మినిస్ట్రేషన్-1, ఐటీ-1) ఉన్నాయి.
- **అర్హతలు:** డిగ్రీ, బీఫార్మసీ, ఎంబీఏ, బీఈ/బీటెక్, ఎంసీఏ బీకాం
- **వయస్సు:** 40 ఏండ్లు మించరాదు.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 10
- **వెబ్‌సైట్:** www.cmss.gov.in

### ఎయిమ్స్‌లో బీఎస్సీ

**న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎయిమ్స్-బీఎస్సీ 2020 నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- **పరీక్ష పేరు:** ఎయిమ్స్-బీఎస్సీ 2020
- ఈ పరీక్ష ద్వారా ఢిల్లీతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్‌లలో కింది కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.
- **కోర్సులు:** బీఎస్సీ (నర్సింగ్, పోస్ట్‌బేసిక్, పారామెడికల్) కోర్సులు.
- **అర్హత:** బీఎస్సీ నర్సింగ్ కోర్సుకు ఇంటర్ (బైపీసీ) కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ/ఎస్టీలకు 50 శాతం మార్కులు రావాలి. బీఎస్సీ పారామెడికల్ కోర్సులకు ఇంటర్ ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీతో పాటు బయాలజీ/మ్యాథ్స్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. బీఎస్సీ నర్సింగ్ (పోస్ట్‌బేసిక్)కు ఇంటర్ లేదా జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ, నర్స్ లేదా ఆర్ఎన్ లేదా ఆర్ఎంగా స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయి ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 16 (సాయంత్రం 5 వరకు)
- **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా
- **పరీక్షతేదీ:** 2020 జూన్ 6, 20, 28.
- **చివరితేదీ:** 2020, మే 4
- **వెబ్‌సైట్:** https://www.aiimsexams.org



### జిప్‌మర్‌లో 116 ఖాళీలు

**పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మర్) కింది ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- మొత్తం ఖాళీలు: 116
- **పోస్టులు:** లోయర్ డివిజన్ క్లర్క్, నర్సింగ్ ఆఫీసర్, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్, ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్, జూనియర్ ఇంజినీర్, డెంటల్ మెకానిక్ తదితరాలు ఉన్నాయి.
- ఎంపిక విధానం: రాతపరీక్ష ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 20
- **వెబ్‌సైట్:** https://www.jipmer.edu.in

### బీఈసీఐఎల్‌లో 50 పోస్టులు

**న్యూఢిల్లీలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్ ) కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- **పోస్టు:** డేటా ఎంట్రీ ఆపరేటర్లు
- మొత్తం ఖాళీలు: 50
- **అర్హతలు:** ఇంటర్, గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత, ఇంగ్లిష్/హిందీలో నిమిషానికి 35 పదాల టైపింగ్ సామర్థ్యం ఉండాలి.
- **జీతం:** డిగ్రీ అభ్యర్థులకు నెలకు రూ. 19,572/-, డిగ్రీ కానివారికి నెలకు రూ.17,991/-
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 7
- **వెబ్‌సైట్:** https://www.becil.com

## ఇకపై కొత్త నమూనాలో రేషన్ కార్డులు

- నమూనాను రూపొందించిన కేంద్రం
- వచ్చే ఏడాది జూన్ 1 నుంచి 'ఒకే దేశం.. ఒకే రేషన్ కార్డు' అమలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 19:** వచ్చే ఏడాది జూన్ 1 నుంచి 'ఒకే దేశం.. ఒకే రేషన్ కార్డు'ను అమలు చేయాలని కేంద్రం భావిస్తున్నది. జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద లబ్ధిదారులు ఇకపై దేశంలో ఎక్కడి నుంచైనా రేషన్ సరుకులను పొందవచ్చు. ఇప్పటికే ఆరు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేస్తున్నారు. ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగా కొత్త రేషన్ కార్డు నమూనాను రూపొందించింది. ఇకపై కొత్త రేషన్ కార్డులను జారీ చేసేటప్పుడు ఈ నమూనాను అనుసరించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం కోరింది. జాతీయ పోర్టబిలిటి లక్ష్యం సాధించేందుకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఒకే విధమైన రేషన్ కార్డులను జారీ చేయాల్సిన అవసరం ఉన్నదని కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి ఒక నమూనాను రూపొందించినట్లు చెప్పారు. దీని ప్రకారం ఇకపై కొత్త రేషన్ కార్డులు స్థానిక భాషతోపాటు హిందీ లేదా ఇంగ్లీష్‌లో ఉంటాయి. ప్రతి రేషన్ కార్డు నెంబరు పది అంకెల ప్రామాణిక సంఖ్యలో ఉంటుంది. ఇందులో మొదటి రెండు అంకెలు రాష్ట్ర కోడ్‌ను సూచిస్తాయి. లబ్ధిపొందే కుటుంబ సభ్యులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఉంటుందని ఆ అధికారి వివరించారు. ఈ మేరకు అవసరమైన వివరాలను లబ్ధిదారుల నుంచి రాష్ట్రా ప్రభుత్వాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. ఎన్ఎఫ్ఎస్ఏ కింద దేశ వ్యాప్తంగా 81.35 కోట్ల మంది ప్రజలను లబ్ధిదారులుగా చేర్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకోగా ప్రస్తుతం 75 కోట్ల మంది ప్రజలు లబ్ధిపొందుతున్నారని ఆ అధికారి పేర్కొన్నారు.

## పనామా జైలులో చెలరేగిన హింస

- పరస్పరం కాల్పులు జరుపుకొన్న ఖైదీలు
- 13 మంది మృతి



పనామా జైలులో ఘర్షణలో గాయపడ్డవారిని దవాఖానకు తరలిస్తున్న దృశ్యం

**పనామా:** పనామాలోని ఓ జైలులో ఖైదీల మధ్య మంగళవారం హింస చెలరేగింది. సహచర ఖైదీల మధ్య జరిగిన కాల్పుల్లో 13 మంది మరణించగా, మరో 15 మంది గాయపడ్డారు. అధికారుల సమాచారం మేరకు.. మూడు ఏకే 47 రైఫిల్స్‌తోపాటు ఐదు పిస్తోళ్లు ఘటనా స్థలంలో లభించాయి. రాజధాని పనామా నగరంలోని లా జోయిటా జైలులోకి ఆయుధాలు ఎలా వచ్చాయనే విషయమై విచారణ చేపట్టనున్నట్టు పనామా దేశాధ్యక్షుడు లురెంటినో కార్టిజో తెలిపారు. 'ఈ తుపాకులు ఆకాశం నుంచి ఊడిపడలేదు. జైలులోకి వాటిని తరలించడానికి కచ్చితంగా లోపలినుంచి సహకారం అందే ఉంటుంది' అని అభిప్రాయపడ్డారు. జైలులోకి ఆయుధాల అక్రమరవాణాను అడ్డుకునేందుకు వెంటనే తమ భద్రతా మండలిని కలిసి చర్చిస్తానని చెప్పారు. కొన్ని వారాల కిందట జరిగిన తనిఖీలో ఆయుధాలు లభించాయి, ఇప్పుడు మళ్లీ దొరికాయంటే ఎవరో వాటిని తరలిస్తున్నారని పేర్కొన్నారు. జైలులో ఖైదీలను బృందాలవారీగా బ్లాకుల్లో నిర్బంధించామని, స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం రెండుగంటలకు 14వ బ్లాకులో కాల్పులు ప్రారంభమయ్యాయని జైలు అధికారులు వివరించారు. ఒకే వర్గానికి చెందిన ఖైదీల మధ్య అంతర్గత అసమ్మతి కాల్పులకు కారణమని పనామా జాతీయ పోలీస్ అసిస్టెంట్ డైరెక్టర్ అలెక్సిస్ మునోజ్ తెలిపారు.

- మంచు దుప్పట్లో కోటగుళ్లు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని కోటగుళ్లను గురువారం మంచుదుప్పటి కప్పేసింది. ఉదయం పది గంటల వరకు కురిసిన మంచులో కోటగుళ్లు మరింత సొగసును సంతరించుకున్నాయి. చూపరులకు చక్కటి ఆహ్లాదాన్ని పంచిపెట్టాయి.
- గణపురం, నమస్తే తెలంగాణ





ఆస్ట్రేలియా తూర్పు కోస్తా ప్రాంతంలో చెలరేగిన కార్చిచ్చు

## ఆస్ట్రేలియాను వణికిస్తున్న కార్చిచ్చు!

- న్యూ సౌత్‌వేల్స్‌లో అత్యయిక స్థితి

**సిడ్నీ, డిసెంబర్ 19:** ఆస్ట్రేలియా తూర్పు కోస్తా ప్రాంతంలో చెలరేగిన కార్చిచ్చు న్యూ సౌత్ వేల్స్ రాష్ట్ర ప్రజలను వణికిస్తున్నది. మంటలు అదుపు తప్పడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఏడు రోజులపాటు అత్యయిక స్థితిని విధిస్తున్నట్టు గురువారం ప్రకటించింది. రాష్ట్ర రాజధాని సిడ్నీతో పాటు పలు ప్రాంతాల్లో చెలరేగిన దాదాపు 100 కార్చిచ్చులతో జనావాసాలు పొగతో నిండిపోయాయి. బలమైన గాలులతో దావానలం వ్యాపిస్తుండటంతో పదుల సంఖ్యలో ఇండ్లు ధ్వంసమయ్యాయి. 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో సెగలు గక్కుతున్న మంటల్ని అదుపులోకి తీసుకురావడానికి వేలాది మంది అగ్నిమాపక సిబ్బంది రేయింబవళ్లు కృషి చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో గత సెప్టెంబర్‌లో కార్చిచ్చు రేగింది. ఈ ఘటనలో పలు ఇండ్లు ధ్వంసమయ్యాయి.

## జార్ఖండ్‌లో నేడు చివరి విడుత అసెంబ్లీ ఎన్నికలు

- 16 నియోజకవర్గాల్లో పోలింగ్
- సాయంత్రం ఐదు తర్వాత ఎగ్జిట్‌పోల్స్ ప్రసారం

**రాంచీ, డిసెంబర్ 19:** జార్ఖండ్‌లో శుక్రవారం చివరి విడుత అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. 16 నియోజకవర్గాల్లో ఐదవ దశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన బోరియో, బార్హైట్, లితిపారా, మహేశ్‌పూర్, సికారిపారా నియోజకవర్గాల్లో పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 3 గంటలకు ముగుస్తుందని, మిగతా 11 నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని ముఖ్య ఎన్నికల అధికారి వినయ్ కుమార్ చౌబే తెలిపారు. ఆరు జిల్లాల పరిధిలో జరిగే తుది దశ పోలింగ్ కోసం 40 వేల భద్రతా సిబ్బందిని మోహరించినట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం చివరి విడుత పోలింగ్ ముగిసిన తర్వాత ఎగ్జిట్‌పోల్స్‌ను టీవీ చానల్స్ ప్రసారం చేసుకోవచ్చన్నారు. మరోవైపు తుది దశ ఎన్నికల్లో మాజీ సీఎం హేమంత్ సోరెన్‌తోపాటు పలువురు మంత్రులు పోటీపడుతున్నారు. రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్న సోరెన్, బీజేపీ అభ్యర్థుల నుంచి తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నారు.

## కాషాయ వస్త్రాలు ధరిస్తారు.. మహిళలపై లైంగికదాడులు చేస్తారు

- బీజేపీ నేతలపై హేమంత్ సోరేన్ వివాదాస్పద వ్యాఖ్యలు
- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన బీజేపీ జార్ఖండ్‌శాఖ



**పకూర్/రాంచీ, డిసెంబర్ 19:** జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ బీజేపీ నాయకులు, కార్యకర్తలపై తీవ్రమైన వ్యాఖ్యలుచేశారు. కాషాయ వస్త్రాలు ధరించే కొందరు బీజేపీ నేతలు, కార్యకర్తలు వివాహాలు చేసుకోరని, కానీ, వారు మహిళలపై లైంగికదాడులు చేస్తారని హేమంత్ సోరేన్ ఆరోపించారు. బుధవారం పకూర్ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళలకు రక్షణ కల్పించడంతో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని, లైంగికదాడి నిందితులకే రక్షణ కల్పిస్తున్నదని విమర్శించారు. 'కొందరుంటారు.. వాళ్లే బీజేపీ వాళ్లు. కాషాయ వస్త్రాలు ధరిస్తారు. వివాహాలు చేసుకోరు. కానీ, మహిళలపై లైంగికదాడులు చేస్తారు..అలాంటి వారికి ఓటు వేయాలనుకుంటున్నారా? అని ప్రజలను అడిగారు. ఉత్తరప్రదేశ్‌లో ఒక రేపిస్టు దవాఖానలో విశ్రాంతి తీసుకుంటుండగా.. అతడి బాధితురాలు మాత్రం జైలులో ఉన్నదని పేర్కొన్నారు. 'ప్రస్తుతం (యూపీలో) మహిళలు మంటల్లో కాలిపోతున్నారు. కానీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జార్ఖండ్‌లోని సంతల్ పరగణా చుట్టూ చక్కర్లు కొడుతున్నారు' అని ఎద్దేవాచేశారు. ఉన్నావ్, హైదరాబాద్ దిశ లైంగికదాడి ఘటనను ప్రస్తావిస్తూ హేమంత్ సోరేన్ ఈ వ్యాఖ్యలు చేశారు. జార్ఖండ్‌లో శుక్రవారం జరిగే తుది దశ పోలింగ్‌లో జేఎంఎం/ కాంగ్రెస్/ ఆర్జేడీ కూటమికి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. త్రికూటమి పక్షాల సీఎం అభ్యర్థిగా హేమంత్ సోరేన్ ఉన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినే వ్యాఖ్యలు చేసిన సోరేన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ బీజేపీ జార్ఖండ్‌శాఖ రాంచీలో ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ పాల్గొన్న సభలోనే హేమంత్ సోరేన్ ఈ వ్యాఖ్యలు చేశారని, ఆమెపై కూడా చర్యలు తీసుకోవాలని కోరింది.

## మార్క్‌ఫెడ్ నిల్వలపై డిస్పోజల్ కమిటీ

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్; నమస్తే తెలంగాణ :** 2019-20 సంవత్సరంలో రైతుల నుంచి కనీస మద్దతు పథకం కింద కేంద్రప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్, హాకా సంస్థలు కొనుగోలుచేసిన వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి రాష్ట్రప్రభుత్వం డిస్పోజల్ కమిటీని ఏర్పాటు చేసింది. వ్యవసాయశాఖ కమిషనర్ చైర్మన్‌గా, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, ఆర్థికశాఖ డిప్యూటీ సెక్రటరీలు సభ్యులుగా ఈ కమిటీని నియమించింది. మార్క్‌ఫెడ్ ఎండీ.. మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ కమిటీ 2019-20లో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి టెండర్లు నిర్వహించనుంది. టెండర్లు ఖరారయ్యాక మార్క్‌ఫెడ్, హాకా ద్వారా సేకరించిన వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేందుకు ఈ కమిటీ అనుమతిస్తుంది. 2019-20 వానకాలంలో మొక్కజొన్న 6,912 మెట్రిక్ టన్నులు, కందులు 25,670, శనగలు 22,608, పొద్దుతిరుగుడు 1819, జొన్నలు 10,490, మినుములు 2156 మెట్రిక్ టన్నులు సేకరించినట్టు మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్‌రావు తెలిపారు. దాదాపు 62,835 మెట్రిక్‌టన్నులు సేకరించిన ఈ ఉత్పత్తులను విక్రయించేందుకు ప్రభుత్వ అనుమతి కోసం ఇప్పటికే మార్క్‌ఫెడ్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే వీటికి టెండర్లు పిలిచి, విక్రయించనున్నట్టు విష్ణువర్ధన్‌రావు తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 230 నుంచి రూ. 240 కోట్లు ఉంటుందని వెల్లడించారు.

# ఫోర్బ్స్ రారాజు విరాటుడే!

- రెండు, మూడు స్థానాల్లో అక్షయ్, సల్మాన్
- మొదటి పది స్థానాల్లో ఇద్దరు మహిళలకే దక్కిన చోటు
- ఆదాయం, పేరు ప్రఖ్యాతులను పరిగణనలోకి తీసుకొని ర్యాంకుల ప్రకటన
- గతంతో పోలిస్తే జాబితాలో దక్షిణాదికి పెరిగిన ప్రాతినిధ్యం



విరాట్ కోహ్లి



అక్షయ్‌కుమార్



సల్మాన్‌ఖాన్

**ముంబై, డిసెంబర్ 19:** ఫోర్బ్స్ ఇండియా విడుదల చేసిన టాప్-100 సెలబ్రిటీల(ప్రముఖ వ్యక్తుల) జాబితాలో భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి అగ్రస్థానంలో నిలిచారు. కేవలం వృత్తిపమైన ఆదాయాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా సెలబ్రిటీకున్న పేరు ప్రఖ్యాతులను పరిగణనలోకి తీసుకొని ర్యాంకులను ప్రకటించినట్టు ఫోర్బ్స్ ఈ సందర్భంగా పేర్కొంది. అక్టోబర్ 1, 2018 నుంచి సెప్టెంబర్ 30, 2019 మధ్య ఈ జాబితాను తయారుచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ లిస్టులో బాలీవుడ్ ప్రముఖ నటులు 'కిలాడీ' అక్షయ్‌కుమార్ రెండో స్థానంలో నిలవగా, కండల వీరుడు సల్మాన్‌ఖాన్ మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. దేశంలోనే అత్యధిక ఆదాయం పొందుతున్న సెలబ్రిటీగా అక్షయ్‌కుమార్ (రూ. 293.25 కోట్లు) నిలిచారు. కోహ్లి ఆదాయం రూ. 252.72 కోట్లుగా, సల్మాన్ ఆదాయం రూ. 229.25 కోట్లుగా ఫోర్బ్స్ వెల్లడించింది. బిగ్ బీ అమితాబ్ (నాలుగోస్థానం), మిస్టర్ కూల్, క్రికెటర్ మహేంద్రసింగ్ ధోనీ (ఐదో స్థానం) జాబితాలో చోటు దక్కించుకున్నారు. వీళ్ల ఆదాయం వరుసగా రూ. 239.25 కోట్లు, రూ. 135.93 కోట్లు. వీళ్లతో పాటు బాలీవుడ్ టాప్ హీరోలు షారుఖ్‌ఖాన్(రూ. 124.38 కోట్లు), రణ్‌వీర్‌సింగ్ (రూ. 118.2 కోట్లు)కు కూడా జాబితాలో చోటు దక్కింది. ఫోర్బ్స్ సెలబ్రిటీల జాబితాలో మొదటి పది స్థానాల్లో ఇద్దరు మహిళలకు మాత్రమే చోటు లభించింది. బాలీవుడ్ నటీమణులు అలియా భట్ (ఎనిమిదో స్థానం, రూ. 59. 21 కోట్లు), దీపికా పదుకొనే (పదో స్థానం, రూ. 48 కోట్లు) ఉన్నారు. ఈ జాబితాలో క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ తొమ్మిదో స్థానంలో (రూ. 76.96 కోట్ల ఆదాయంతో) నిలిచారు.

### 13 మంది దక్షిణాది సెలబ్రిటీలు

గతంతో పోలిస్తే ఫోర్బ్స్ ఇండియా టాప్-100 సెలబ్రిటీల జాబితాలో దక్షిణ భారతీయ సినీ పరిశ్రమ ప్రాతినిధ్యం పెరిగిందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. 'జాబితాలో ఈసారి 13 మంది దక్షిణాది సెలబ్రిటీలకు చోటు దక్కింది. 2018లో ఈ సంఖ్య 15 ఉన్నప్పటికీ, ఆ ఏడాది వాళ్ల ఆదాయం (11.26 శాతం)తో పోలిస్తే, ఈసారి వాళ్ల ఆదాయం(12.57 శాతం) పెరిగింది' అని నివేదిక పేర్కొంది. జాబితాలో పురుషుల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తున్నదని, సినీ, క్రీడా రంగాల్లో చెల్లించే భత్యాల్లో తేడానే దీనికి కారణమని ఫోర్బ్స్ ఇండియా ఎడిటర్ బ్రియాన్ కార్వల్హో పేర్కొన్నారు.

## విమానం దొంగతనానికి బాలిక విఫలయత్నం

- కాక్‌పిట్‌లోకి ప్రవేశించి విమానాన్ని చక్కర్లు కొట్టించిన వైనం
- అరెస్టు చేసిన పోలీసులు.. అమెరికాలో ఘటన

**కాలిఫోర్నియా, డిసెంబర్ 19:** 'పుర్రెకో బుద్ధి.. జిహ్వకో రుచి' అంటారు. దొంగలు సాధారణంగా డబ్బు, బంగారం, ఖరీదైన వస్తువులపై కన్నేస్తారు. అయితే, అమెరికాలో ఓ 17 ఏండ్ల బాలిక మాత్రం ఏకంగా ఓ విమానాన్నే దొంగతనం చేయాలని భావించింది. విమానాశ్రయంలో నిలిపి ఉంచిన విమానం కాక్‌పిట్‌లోకి ప్రవేశించి విమానాన్ని కాసేపు నేలపై చక్కర్లు కొట్టించి దొంగతనానికి విఫలయత్నం చేసింది. చివరకు విమానాశ్రయ అధికారులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సదరు బాలికను అరెస్టు చేసి జువెనైల్ హోంకి తరలించారు. ఈ ఘటన కాలిఫోర్నియాలోని ఫ్రెస్నో యొసెమైట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం ఉదయం చోటుచేసుకున్నది. 'విమానాశ్రయం చుట్టూ ఉన్న కంచెను దాటుకొని ఓ బాలిక కింగ్ ఎయిర్ 200 అనే ప్రైవేట్ విమానం కాక్‌పిట్‌లోకి బుధవారం ఉదయం ప్రవేశించింది. విమానాన్ని తస్కరించాలని భావించిన బాలిక దాన్ని స్టార్ట్ చేసింది. విమానాన్ని నేలపై కొన్ని చక్కర్లు కొట్టించింది. ఈ క్రమంలో సదరు విమానం దగ్గర్లోని భవనాన్ని ఢీకొట్టింది. దీంతో విమానం, అక్కడి భవనం కొంత దెబ్బ తిన్నాయి' అని ఫ్రెస్నో పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, విమానంతో పాటు, విమానాశ్రయ ఆస్తులు కొంతమేర దెబ్బతిన్నట్టు ఆయన తెలిపారు. బాలిక విమానాన్ని దొంగతనం చేయాలనుకోవడానికి గల కారణాల్ని అన్వేషిస్తున్నట్టు ఆయన తెలిపారు. కాగా మంగళవారం రాత్రి నుంచి తన కూతురు ఎక్కడికి వెళ్లిందన్న విషయం తనకు తెలియదని బాలిక తల్లి ఓ వార్తా సంస్థతో పేర్కొన్నారు.



విమానాన్ని దొంగిలించేందుకు ప్రయత్నించిన బాలికను అరెస్టు చేస్తున్న కాలిఫోర్నియా పోలీసులు

## ఎన్ఎండీసీకి రెండు బొగ్గు గనుల కేటాయింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ)కు కేంద్రప్రభుత్వం రెండు బొగ్గు గనులను కేటాయించింది. జార్ఖండ్ రాష్ట్రంలోని హజారిబాగ్ జిల్లాలోని రోహ్నె, టోకిస్దు గనులను ఎన్ఎండీసీకి కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నది. రోహ్నెలో 191 మిలియన్ టన్నులు, టోకిస్దులో 52 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఈ బొగ్గు గనుల కేటాయింపుపై ఎన్ఎండీసీ సీఎండీ బజేంద్రకుమార్ కేంద్రప్రభుత్వానికి, బొగ్గు గనుల మంత్రిత్వశాఖకు ధన్యవాదాలు తెలిపారు.

## నేటినుంచి కేజీబీవీ టీచర్ల బదిలీలకు వెబ్ ఆప్షన్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న స్పెషల్ టీచర్లు, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, ఏఎన్ఎంలు, పీఈటీలు ఒక జిల్లానుంచి మరోజిల్లాకు బదిలీపై వెళ్లానుకొనేవారు శుక్రవారం నుంచి వెబ్‌ఆప్షన్లు పెట్టుకోవచ్చని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికచేసుకున్న జిల్లాలవారీగా శనివారం సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 23న పనిచేస్తున్న పాత జిల్లాస్థానం రద్దుచేసి, కొత్తస్థానంలో పనిచేయడానికి అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. వివరాల కోసం 'samagrashiksha.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## రోడ్డు భద్రత సామాజిక బాధ్యత

రవాణాశాఖ మంత్రి
పువ్వాడ అజయ్‌కుమార్




గురువారం కత్రియా హోటల్‌లో జ్యోతిప్రజ్వలన చేసి, రోడ్ సేఫ్టీ సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్. చిత్రంలో రోడ్డు సేఫ్టీ అథారిటీ చైర్మన్ డీజీపీ టీ కృష్ణప్రసాద్, ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సందీప్ సుల్తానియా, పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, ట్రక్స్ స్పెషల్ కన్సల్టెంట్ పాల్ తదితరులు ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రమాదాల శాతం భారతదేశంలోనే అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తున్నదని, చట్టాలను ఎంత పక్కాగా అమలుచేస్తున్నా రోడ్డుప్రమాదాలను నివారించలేకపోతున్నామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రతను ప్రజలు సామాజికబాధ్యతగా తీసుకున్నప్పుడే ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. గురువారం కత్రియా హోటల్‌లో రోడ్‌సేఫ్టీ ఎన్జీవో (ఇండియా) సంస్థ ట్రక్స్ ఆధ్వర్యంలో ఇండియా ఎహెడ్ నిర్వహణలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. తన కుటుంబంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదం చేదు అనుభవంగా మిగిలిపోయిందన్నారు. పాదచారులు కూడా ప్రమాదాలకు గురవటం ఆందోళనకరమన్న ఆయన, అతివేగం, నిబంధల్ని పాటించకపోవటంవల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. వీటిని నియంత్రించడం మన చేతుల్లోనే ఉంటుందని, వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్, సీటుబెల్టు వాడకంతో పాటు రోడ్డుభద్రతా నిబంధనలను తప్పక పాటించాలన్నారు.

### టీఎస్‌ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం

ప్రజారవాణా వ్యవస్థను ఎక్కువగా వినియోగించడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరగకుండా ఆడ్డుకోవచ్చని మంత్రి చెప్పారు. టీఎస్‌ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని, సొంత వాహనాల వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ అథారిటీ చైర్మన్ డీజీపీ టీ కృష్ణప్రసాద్, ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సందీప్ సుల్తానియా, పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, ట్రక్స్ స్పెషల్ కన్సల్టెంట్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠద్వార దర్శనం రెండురోజులే

- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

**తిరుమల:** వైకుంఠద్వార దర్శనం రెండురోజులు మాత్రమేనని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. మొదట అనుకున్నట్టు పదిరోజులు కాదని స్పష్టంచేశారు. బుధవారం రాత్రి తిరుమలకు వచ్చిన శారదా పీఠం అధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని గురువారం టీటీడీ చైర్మన్, ఆలయ ప్రధాన అర్చకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. వైకుంఠ ఏకాదశి సందర్భంగా రెండు రోజులు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం అవకాశం కల్పిస్తామని చెప్పారు. మరోవైపు ఉత్సవమూర్తుల విగ్రహాల అరుగుదల అంశాన్ని స్వామీజీ దృష్టికి అర్చకులు తీసుకొచ్చారని తెలిపారు. చారిత్రక ఆలయాల్లో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని స్వామీజీ సూచించారని చెప్పారు. ధార్మిక ప్రచారంలో భాగంగా ప్రతినెలా టీటీడీ తరపున ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్టు సుబ్బారెడ్డి తెలిపారు.

## రైతురత్న పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

- తెలంగాణ వ్యవసాయ అధికారుల సంక్షేమ సంఘం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమీకృత వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న రైతులను రాష్ట్ర స్థాయిలో గుర్తించి వారిని సన్మానించడంతో పాటు, రైతురత్న పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం తెలిపింది. ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న నలుగురు పురుషులు, ఒక మహిళా రైతును సన్మానించనున్నట్టు సంఘం చైర్మన్ బీ కృపాకర్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తులను జిల్లాల్లోని ప్రతినిధుల నుంచి స్వీకరించాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 23లోగా విశ్రాంత వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షుడు టీ రంగారెడ్డి (88868 61188), తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బీ కృపాకర్‌రెడ్డి (93914 09959), వైస్‌చైర్మన్ డీ సత్యనారాయణ (7288090555), అధ్యక్షురాలు కే అనూరాధ (728884478), ప్రధానకార్యదర్శి జీ కృపాకర్‌రెడ్డికి అందజేయాలని చైర్మన్ కోరారు.

# విజయ ఉత్పత్తులపై ప్రచారం చేపట్టాలి

- పర్యాటక ప్రాంతాలు, హైవేలపై ఔట్‌లెట్స్
- విక్రయాల కోసం యాప్ రూపొందించాలి
- మంత్రి తలసాని సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

విజయ డెయిరీ ఉత్పత్తులను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు పెద్దఎత్తున ప్రచారం నిర్వహించాలని పశుసంవర్ధక, పాడిపరిశ్రమ అభివృద్ధిశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించారు. గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ కార్యాలయంలో విజయడెయిరీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ విజయ డెయిరీ ఉత్పత్తులకు ప్రజల్లో ఆదరణ ఉన్నదని, విక్రయాలను పెంచేందుకు సోషల్‌మీడియాను వినియోగించుకోవాలని సూచించారు. ఉత్పత్తులు తెలిసేలా వీడియోచిత్రాలను రూపొందించి మల్టిప్లెక్స్ థియేటర్లు, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్లలో ప్రదర్శించాలని కోరారు. పర్యాటకప్రాంతాలు, ప్రముఖ దేవాలయాలు, హైవేల వెంట ఆకర్షణీయమైన ఔట్‌లెట్స్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. డోర్ డెలివరీచేసేలా మొబైల్‌యాప్ రూపొందించాలని సూచించారు. ప్రధాన నగరాల్లోని మాల్స్, సూపర్‌మార్కెట్లలో విజయ ఉత్పత్తులు విక్రయించేందుకు ఆయా యాజమాన్యాలతో సంప్రదింపులు జరుపాలని కోరారు. సమావేశంలో డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి, ఎండీ శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విజయడెయిరీ బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి, ఎండీ శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ లక్ష్మారెడ్డి ఉన్నారు.

## దక్షిణమధ్య రైల్వేకు మూడు పురస్కారాలు

- జీఎం గజానన్ మాల్యా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మూడు తెలంగాణ ఇంధన పొదుపు పురస్కారాలను దక్షిణమధ్య రైల్వే జోన్ సాధించిందని జీఎం గజానన్ మాల్యా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌ఆర్ఈడీసీవో) అందించే ఈ పురస్కారాలను గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ప్రదానం చేస్తారని చెప్పారు. ప్రభుత్వ భవనాల క్యాటగిరీలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్రథమ, ఇదే క్యాటగిరీలో సికింద్రాబాద్ డివిజన్ ప్రధాన కార్యాలయ సంచాలన్ భవన్‌కు ద్వితీయ, లాలాగూడ క్యారేజ్ వర్క్‌షాప్‌కు ప్రథమ బహుమతులు లభించాయని పేర్కొన్నారు. పురస్కారాలు రావటంపై అధికారులు, సిబ్బందిని ఆయన ప్రశంసించారు.


'DIL' RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
A 'DIL' RAJU PRODUCTION
DECEMBER 25TH RELEASE
U r my heart Beat
ఇద్దరి లోకం ఒకటే
SHIRISH MICKEY J MEYER G R KRISHNA
HARSHITH REDDY - BEKKEM VENUGOPAL (GOPI) SAMEER REDDY ABBURI RAVI
TAMMI RAJU BANDI RATNA KUMAR RAMANA VANKA STUNT SIVA
G ANUHYA REDDY BHANU VIJAY
ADITYA MUSIC
U/A


SKF
నేడే విడుదల
ఆటకైనా వేటకైనా రెడీ
దబంగ్ 3
దర్శకత్వం: ప్రభుదేవా
నిర్మాతలు: సల్మాన్ ఖాన్, అర్బాజ్ ఖాన్, నిఖిల్ ద్వివేది


viacom 18 STUDIOS
Parallel Minds
నేడే విడుదల
AKSHAYASRI PRESENTS
KARTHI JYOTIKA SATHYA
దొంగ
A JEETHU JOSEPH FILM
RAVURI. V. SRINIVAS


ఉదయం గం॥ 8:33 ని॥ల ఆటతో
నేడే విడుదల
సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రై.) లిమిటెడ్
సమర్పించు
హ్యాపీ మూవీస్
BALAKRISHNA
రూలర్
POLICE
సి. కళ్యాణ్ కె. యస్. రవికుమార్
సి. వెంకటేశ్వరరావు - పత్స నాగరాజా చిరంతన్ భట్
సి. రాంప్రసాద్ పరుచూరి మురళి చిన్నా జాన్ అబ్రహం రామ్-లక్ష్మణ్ అన్బరివు వంశీ శేఖర్
ADITYA MUSIC
U/A